ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి




# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY






మంగళవారం 21 జూలై 2026 | సంపుటి: 28 సంచిక: 106 | Tuesday 21 July 2026 | Vol.No 28 Issue No .106 | హైదరాబాద్ Hyderabad | పేజీలు: 12+12 | వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA | www.visionandhra.in


# క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లు

- ప్లాట్ల కోసం పది వరకు దరఖాస్తుల స్వీకరణ
- రూ.10 వేలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి
- ఇందిరమ్మ ఇళ్ల బ్రోచర్ ఆవిష్కరించిన మంత్రులు





హైదరాబాద్,జూలై20 : క్యూర్ పరిధిలో ప్లాట్ల కోసం ఆగస్టు 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మీ సేవ, వాట్సాప్, వెబ్‌సైట్‌లో వీటికోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. రూ.10వేల టోకెన్ చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. డ్రా పద్ధతిలో లబ్దిదారుల ఎంపిక ఉంటుందని స్పష్టం చేశారు. డ్రాలో ఇల్లు రానివారి డబ్బులు వెంటనే చెల్లిస్తామని వెల్లడించారు. ఆయా ప్లాట్లు పదేళ్ల పాటు అమ్మరాదని.. అద్దెకు ఇవ్వరాదని షరతును విధిస్తామని అన్నారు. కుటుంబంలో ఒకరికి ఇళ్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. క్యూర్ పరిధిలో ఇల్లు, స్థలం లేనివారికి తొలివిడతలో ప్రాధాన్యం కల్పిస్తామని మంత్రి చెప్పుకొచ్చారు. లబ్దిదారుల పేరిట స్థలం రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. స్థలంతో పాటు రూ.5లక్షల సబ్సిడీ అందజేస్తామని పేర్కొన్నారు. సోమవారం ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన వాట్సాప్ దరఖాస్తులు, ఇళ్ల బ్రోచర్‌లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడారు. వారికి స్థలం ఇవ్వడంతో పాటు రూ.5లక్షల సహాయం అందజేస్తామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. పదేళ్ల వరకు ఇళ్లు అమ్ముకునే అవకాశం లేదని చెప్పుకొచ్చారు. మొదటి దశలో 16నియోజకవర్గాల్లో ఇస్తున్నామని.. త్వరలోనే మిగిలిన నియోజకవర్గాల్లో కూడా ఇళ్లు ఇస్తామని స్పష్టం చేశారు. ఆయా పార్టీలు, రాజకీయాలకు సంబంధం లేకుండా ఇళ్లను కేటాయిస్తామనిపేర్కొన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల ఇందిరమ్మ ఇళ్లు పూర్తి అవుతున్నాయని ఇప్పటికే రెండు విడతల్లో ఏడు లక్షల ఇళ్లు మంజూరు చేశామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు సొంత స్థలాలు ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్లు అందజేశామని వెల్లడించారు. మిగతా2లో..

## నేడు,రేపు బల్కంపేట ఎల్లమ్మకళ్యాణోత్సవం

- వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలిరానున్న భక్తులు
- ట్రాఫిక్ డైవర్షన్ ప్రకటించిన పోలీసులు

హైదరాబాద్,జూలై20(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆషాడం బోనాల ఉత్సవాలు జరుగుతున్నాయి. హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం, రథోత్సవం.. మంగళవారం, బుధవారం నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాలతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా పోటెత్తనున్నారు. ఈ నేపథ్యంలో బల్కంపేట పరిసర ప్రాంతాలు భక్తులతో కిక్కిరిసి పోనుంది. దాంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌ను మరో మార్గంలో మళ్లిస్తామని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ జాయింట్ కమిషనర్ వెల్లడించారు. మిగతా2లో..

## జాతీయ పోలీస్ అకాడమిలో లైంగిక వేధింపుల వ్యవహారం

- ట్రైనీ ఐపిఎస్‌ను సస్పెండ్ చేస్తూ.. ఆదేశాలు జారీ
- ఆత్మహత్యకు యత్నంచిన ట్రైనీ ఐపిఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి



హైదరాబాద్,జూలై20: లైంగిక ఆరోపణల నేపథ్యంలో ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ మిగతా2లో..

# ఆపదలో అండగా... ఆర్టీసీ ఒకే కుటుంబం..!

- కార్మికుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది
- డ్రైవర్ కోలా శంకర్ కుటుంబానికి రూ. 90.85 లక్షల ఆర్థిక సాయం
- ఉద్యోగులంతా కలసి సమీకరించిన ధనం చెక్కు రూపంలో అప్పగింత
- కార్మికుల కృషిని అభినందించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్,జూలై 20 : టీజీఎస్ ఆర్టీసీ కేవలం ఒక రవాణా సంస్థ మాత్రమే కాదని... వేలది మంది ఉద్యోగుల ఉమ్మడి కుటుంబమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. నర్సంపేట ఆర్టీసీ డిపోకు చెందిన దివంగత డ్రైవర్ కోలా శంకర్ కుటుంబానికి ఆర్టీసీ ఉద్యోగులు 'చేయూత' కార్యక్రమం ద్వారా స్వచ్ఛందంగా సేకరించిన రూ. 90,85,500 తొంభై లక్షల ఎనభై ఐదు వేల ఐదు వందల రూపాయల భారీ ఆర్థిక సహాయ చెక్కును సోమవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో శంకర్ కుటుంబ సభ్యులకు అందజేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండీ వై.నాగిరెడ్డి ల చేతుల మీదుగా దివంగత డ్రైవర్ సతీమణి హేమలత, కుమారుడు హేమంత్, కుమార్తె షాలినిలకు ఈ చెక్కును అందజేసి సంస్థ తరపున పూర్తి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, కార్మికుల కోసం ప్రాణత్యాగం చేసిన దివంగత కోల శంకర్ కుటుంబానికి ఆర్టీసీ ఉద్యోగులందరూ అండగా నిలవడం వారి మానవత్వానికి నిదర్శనమన్నారు. శంకర్ ఆసుపత్రిలో ఉన్న సమయంలో అర్ధరాత్రి వేళ స్వయంగా వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న విషయాన్ని మంత్రి మిగతా2లో..

## సజావుగా పార్లమెంట్ సమావేశాలు సాగాలి

- దేశం అనేక విజయాలను నమోదు చేస్తోంది
- విక్రమ్ విజయవంతం..యువకుల నైపుణ్యం
- పార్లమెంట్ ముందు మీడియాతో ప్రధాని మోడీ




న్యూఢిల్లీ,జూలై20 : పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగేలా చూడాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. ఈ సమావేశాలు నిర్మాణాత్మకంగా జరుగుతాయని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా మోడీ మీడియాతో మాట్లాడారు. గత నెల రోజులుగా దేశంలో అనేక పరిణామాలు జరిగాయని వెల్లడించారు. అంతరిక్ష ప్రస్థానంలో నవశకం ప్రారంభమైందని తెలిపారు. స్టార్టప్ కంపెనీ తయారు చేసిన విక్రమ్-1 రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లిందని వివరించారు. సోమవారం పార్లమెంట్ దగ్గర మిగతా2లో..

## పామాయిల్ పెంపకం రైతులకు ఎంతో మేలు

- వర్షాభావంలోనూ పంటలకు ఢోకా లేదు,
- పామాయిల్ ధరల పెంపునకు కృషి చేస్తున్నాం
- అంజనాపురంలో గోద్రెజ్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం,
- మంత్రి తుమ్మలతో కలసి ప్రారంభించిన భట్టి



ఖమ్మం,జులై 20 : పామాయిల్ ధర పెంపునకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లా వ్యవసాయంపై ఆధారపడిన జిల్లా అని పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అంజనాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సి మిగతా2లో..

## మేడిగడ్డ మరమ్మతులకు రంగం సిద్ధం...

- చివరి దశకు చేరుకున్న పరీక్షలు
- నిపుణుల నివేదికల ఆధారంగా పునరుద్ధరణ పనులు
- భద్రతా అనుమతుల తర్వాతే బ్యారేజీల నిర్వహణ
- శాస్త్రీయ విధానంతో కాళేశ్వరం బ్యారేజీల పునరుజ్జీవనం
- నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి




హైదరాబాద్,జూలై 20 : కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. బ్యారేజీలపై నిర్వహిస్తున్న సమగ్ర శాస్త్రీయ పరీక్షలు చివరి దశకు చేరుకున్నాయని, వాటి ఆధారంగా మరమ్మతులు, పునరుద్ధరణకు అవసరమైన డిజైన్ల రూపకల్పన జరుగుతోందని రాష్ట్ర నీటిపారుదల, మిగతా2లో..

## బాన్సువాడలో మళ్లీ గులాబీ జెండా ఎగరాలి

- పోచారం శ్రీనివాస్ రెడ్డికి గట్టిగా బుద్ధి చెప్పాలి
- ఏ పార్టీలో ఉన్నాడో కూడా తెలియని స్థితిలో పోచారం
- పార్టీలో చేరిన బాన్సువాడ నేతలకు కెటిఆర్ ఆహ్వానం



హైదరాబాద్,జూలై 20 : బాన్సువాడలో కుడితిలో పడిన ఎలుకలా పోచారం పరిస్థితి తయారైంది. ఇకపై ఏ ఎన్నికలు వచ్చినా ఆయన ఓడిపోవడం ఖాయం అని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఎలక్షన్స్ ఎప్పుడు వచ్చినా బాన్సువాడలో పోచారం శ్రీనివాస్ రెడ్డిని ఓడగొట్టడమే లక్ష్యంగా పని చేయాలని కార్యకర్తలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. కేటీఆర్ సమక్షంలో బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన మోరీల్ శ్రీనివాస్ రావు, పలువురు నాయకులు తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ. మిగతా2లో..

## అమిత్ షాతో ధర్మేంద్ర ప్రధాన్ భేటీ

- సిజెపిని చర్చలకు పిలిచిన జెపి నడ్డా



న్యూఢిల్లీ,జూలై20 : సిజెపి కార్యకర్తల చలో పార్లమెంట్ పిలుపుతో ఢిల్లీలో ఉద్రిక్తత నెలకొంది. మరోవైపు, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్లమెంట్ భవనం లోపల వీరి భేటీ జరిగినట్లు జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. 'చలో పార్లమెంట్' వేళ ఈ నిరసనలకు నాయకత్వం వహిస్తున్న నాయకులతో కేంద్రమంత్రి జేపీ నడ్డా భేటీ అయ్యారు. అలాగే ధర్మేంద్ర ప్రధాన్ కూడా వారితో మాట్లాడుతున్నారు. మరోవైపు, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను జేపీ నడ్డా కలవనున్నారని సమాచారం. పరీక్షల నిర్వహణలో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం చర్చలకు ముందుకొచ్చిందని కాక్రోచ్ జనతా మిగతా2లో..

## ప్రభుత్వాసుపత్రుల్లో రక్షణ లేకుండా పోయింది

- ఇందిరమ్మ పాలనలో బాలింతకు కూడా భరోసా లేదు
- బాన్సువాడ ఘటనపై స్పందించన ప్రభుత్వం
- నిమ్స్‌లో బాలింతను పరామర్శించిన హరీష్ రావు



హైదరాబాద్,జూలై20 : ఇందిరమ్మ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. బాన్సువాడ మాతా శిశు ఆస్పత్రిలో చికిత్స వికటించి, నిమ్స్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాలింతలను హరీశ్‌రావు పరామర్శించారు. అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. ఈ మిగతా2లో..

## సమస్యలపై గిరిజన సంఘాలతో త్వరలో ప్రభుత్వం చర్చలు

- గిరిజన హక్కులకు ప్రథమ ప్రాధాన్యమిస్తాం... ఆందోళన పడకండి!
- జీవో నెంబర్ 3 ప్రయోజనాలు దక్కేలా ప్రత్యామ్నాయాలు చూస్తున్నాం
- ఉమ్మడి రాష్ట్రంలో తెచ్చిన జీవో నెంబర్ 3ను గత ప్రభుత్వం పరిరక్షించలేకపోయింది
- జోన్-1లోకి అల్లూరి సీతారామరాజు జిల్లా, జోన్-2లోకి పోలవరం జిల్లా
- బాక్సైట్ విషయంలో ఆందోళన వద్దు... అవినీతితో అంతర్జాతీయ సమస్యగా మార్చారు
- ఎస్టీల సంక్షేమం, అభివృద్ధిపై సిఎం చంద్రబాబు సమీక్ష




అమరావతి, జూలై 20 : రాష్ట్ర ప్రభుత్వం గిరిజన హక్కులకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తుందని...ఈ విషయంలో గిరిజన ప్రజలు ఎటువంటి ఆందోళనకు, అనుమానాలకు గురి కావాల్సిన అవసరం లేదని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై ముఖ్యమంత్రి ఆ శాఖ అధికారులుతో సచివాలయంలో సోమవారం సమీక్ష చేశారు. జీవో నెంబర్ 3 పై గత ప్రభుత్వంలో సుప్రీంకోర్టు తీర్పు, తదనంతర పరిణామాలపై చర్చించారు. స్థానికులకే ఉద్యోగాలు దక్కడం సహా పలు అంశాలపై గిరిజన ప్రజల ఆకాంక్షలపైనా చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "ఉమ్మడి రాష్ట్రంలో 2000 సంవత్సరంలో జీవో నెంబర్ 3 తీసుకువచ్చాం. దీని ద్వారా షెడ్యూల్ ప్రాంతాల్లో స్థానిక గిరిజనులకే 100 శాతం రిజర్వేషన్లు దక్కేలా చూశాం. దాదాపు 20 ఏళ్లు అమల్లో ఉన్న ఈ ఉత్తర్వును గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. నాటి ప్రభుత్వం ఈ అంశంపై బలమైన వాదనలు వినిపించకపోవడం వల్ల సుప్రీంకోర్టు 2020 ఏప్రిల్ 22న కొట్టేసింది. దీంతో రెండు దశాబ్దాల పాటు గిరిజనులు మిగతా2లో..

## 1న మోడీ చేతుల మీదుగా భోగాపురం విమానాశ్రయం ప్రారంభం

- నిర్మాణ పనులు పూర్తి కావడంతో ప్రారంభానికి ఏర్పాట్లు
- ప్రధాని పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన మంత్రులు అనిత, శ్రీనివాస్



విజయనగరం,జూలై20 : ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆగస్టు 1వ తేదీన భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభిస్తారని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఈ మేరకు ప్రధాని పర్యటన ఏర్పాట్లను అనిత, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అనిత మీడియాతో మాట్లాడారు. వాహనాల పార్కింగ్ ఏర్పాట్లపై అధికారులకు హోం మంత్రి కీలక సూచనలు చేశారు. మిగతా2లో..

## అమిత్ షాతో ధర్మేంద్ర ప్రధాన్ భేటీ

పార్టీ(సీజేపీ) సోమవారం ప్రకటించింది. తమ డిమాండ్లను వివరించేందుకు ఇద్దరు అధికార ప్రతినిధులు కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో భేటీ కానున్నట్లు సీజేపీ వెల్లడించింది. అయితే.. ఈ చర్చల అంశంపై కేంద్ర ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటనా వెలువడలేదు. ఇదిలా ఉండగా.. పరీక్షల అవకతవకలపై బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అలాగే కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది సీజేపీ కార్యకర్తలు,

## మేడిగడ్డ మరమ్మతులకు రంగం సిద్ధం...

పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, బ్యారేజీల పునరుద్ధరణలో ప్రభుత్వం పూర్తిగా శాస్త్రీయ విధానాన్నే అనుసరిస్తోందని స్పష్టం చేశారు. నిపుణులు భద్రతపై పూర్తి స్థాయిలో ధ్రువీకరించే వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను తిరిగి నిర్వహణలోకి తీసుకురాబోమని వెల్లడించారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ , నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ వంటి దేశంలోని అత్యున్నత సాంకేతిక సంస్థలు నేల స్వభావం, పునాదులు, కాంక్రీట్ నిర్మాణం, ఇతర నిర్మాణ భాగాలపై విస్తృత స్థాయిలో పరీక్షలు నిర్వహించాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఆ పరీక్షలు దాదాపు పూర్తయ్యాయని, వాటి ఫలితాలను ఐఐటీ బొంబాయికి పంపించగా, అక్కడ నిపుణులు సమగ్ర పునరుద్ధరణ డిజైన్లను సిద్ధం చేస్తున్నారని చెప్పారు. ప్రాథమిక అంచనాల ప్రకారం డయాఫ్రం వాల్ నిర్మాణం పునరుద్ధరణలో భాగం కావచ్చని భావిస్తున్నప్పటికీ, అన్ని సాంకేతిక నివేదికలను పరిశీలించిన అనంతరమే తుది మరమ్మతుల విధానాన్ని నిర్ణయిస్తామని మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సాంకేతిక పర్యవేక్షణ కమిటీ, జాతీయ ఆనకట్టల భద్రతా ప్రాధికార సంస్థ , కేంద్ర జల సంఘం సూచనలకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరణ కార్యక్రమాన్ని అమలు చేస్తుందని తెలిపారు. పునరుద్ధరణ పక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు భారత సైన్యంలో సేవలందించిన అనుభవజ్ఞులైన ఇంజినీర్ల సేవలను ప్రభుత్వం వినియోగిస్తోందని, కల్నల్ పరిక్షిత్ మెహ్రా నేతృత్వంలోని సమన్వయ కమిటీ పరీక్షలు, సాంకేతిక ప్రణాళికలను పర్యవేక్షిస్తూ పారదర్శకత, నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని వెల్లడించారు. ÷-రజల భద్రతే ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమని పునరుద్ఘాటించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, శాస్త్రీయ పరీక్షలు, నిపుణుల రూపకల్పన, చట్టబద్ధ భద్రతా అనుమతులు పూర్తయిన తర్వాతే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. ప్రజాధనంతో నిర్మించిన ఈ కీలక ప్రాజెక్టును శాశ్వత భద్రతతో పునరుద్ధరించి రాష్ట్ర అవసరాలకు పూర్తి స్థాయిలో ఉపయోగపడేలా చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు.

నిరసనకారులు ఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి పార్లమెంట్ వైపునకు ర్యాలీగా వెళ్లేందుకు యత్నించగా భద్రతా బలగాలు అడ్డుకున్నాయి. ఈ సందర్భంగా నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జ్ చేశారు. ఈ నేపథ్యంలో పోలీస్ బలగాలు, సీజేపీ కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకోగా.. పలువురు పోలీసులు, సీజేపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. దీంతో టియర్ గ్యాస్ ప్రయోగించి ఆందోళనకారులను చెదరగొట్టారు పోలీసులు. ఈ క్రమంలో పార్లమెంట్ పరిసర ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామాల మధ్య సీజేపీ ప్రతినిధులు.. జేపీ నడ్డాతో భేటీ కానుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. చర్చల అనంతరం పరిస్థితిపై స్పష్టత వచ్చే అవకాశమున్నట్టు తెలుస్తోంది.

## బాన్సువాడలో మళ్లీ గులాబీ జెండా ఎగరాలి

గతంలో బాన్సువాడలో గులాబీ జెండాను ఎగురవేశాం. పెద్దాయన పోచారంను గెలిపిస్తే పోయి పోయి మునిగిపోయే పడవ కాంగ్రెస్ పార్టీలో చేరిండని ఎద్దేవా చేశారు. ఆయన కాంగ్రెస్‌లో చేరి కుడిదిలో పడ్డ ఎలుకలా గిలగిలా కొట్టుకుంటున్నడు. ఈ సమావేశంలో కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బాన్సువాడలో మరోసారి గులాబీ జెండా ఎగరేసే సమయం వచ్చిందని ఆయన అన్నారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి బీఆర్ఎస్ తరఫున గెలిచి పార్టీ మారారని, ప్రస్తుతం కాంగ్రెస్ పరిస్థితి కూడా బాగోలేదని ఆయనకు అర్థమైందన్నారు. ఈ గొంతులో ప్రాణం ఉన్నంత వరకు పార్టీ మారనని చెప్పిన పోచారం చివరకు మాట తప్పి పార్టీ మారారని ఆరోపించారు. స్పీకర్‌గా పనిచేసిన వ్యక్తి ఇప్పుడు తాను ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకునే పరిస్థితి కూడా లేదని ఎద్దేవా చేశారు. పోచారం తన రాజకీయ భవిష్యత్తును తానే సమాధి చేసుకున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డిపై కూడా కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చి ఇప్పుడు వాటిని అమలు చేయకుండా చేతులెత్తేశారని ఆరోపించారు. దేవుళ్లపై ఒట్టు పెట్టి కూడా అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. ఏ సభ పెట్టినా కేసీఆర్‌ను విమర్శించడమే సీఎం పనిగా మారిందన్నారు. రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేటీఆర్ అన్నారు. యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని, షాపుల్లో ఎరువుల సంచులు లేకపోతే యాప్‌లో కనిపించినా ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. ఢిల్లీకి పంపేందుకు సంచులు ఉంటున్నాయని, కానీ రైతులకు మాత్రం అందడం లేదని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కూడా కేటీఆర్ స్పందించారు. రెండు పిల్లర్లు కుంగి 31 నెలలు అవుతున్నా ఇప్పటి వరకు మరమ్మతులు ఎందుకు చేపట్టలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కన్నెపల్లి నుంచి ప్రతిరోజూ నీరు కిందకు వెళ్తున్నా పంపింగ్ చేయడం లేదన్నారు. రిజర్వాయర్లు డెడ్ స్టోరేజ్‌కు వెళ్తే ప్రభుత్వం మాత్రం 'కోల్డ్ స్టోరేజ్'లోకి వెళ్లిపోయిందని ఎద్దేవా చేశారు. తెలంగాణ కోసం అవసరమైతే రక్తమే కాదు ప్రాణాలు కూడా ఇస్తామని బీఆర్ఎస్ ఎప్పుడూ చెప్పిందని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ హయాంలో ఇచ్చిన ఉద్యోగాలను కూడా ప్రస్తుత ప్రభుత్వం తమ ఘనతగా చెప్పుకుంటోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## ప్రభుత్వాసుపత్రుల్లో రక్షణ లేకుండా పోయింది

ఘటన జరిగిన పది రోజులవుతున్నా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదని మండిపడ్డారు. ఇంత జరిగినా ప్రభుత్వం ఎందుకు విచారణ జరపడం లేదని ప్రశ్నించారు. బాధ్యులైన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐదుగురు బాలింతలు నిమ్స్‌లో చికిత్స పొందుతున్నార హరీశ్‌రావు తెలిపారు. వీరిలో ముగ్గురు డయాలసిస్‌పై ఉన్నారని పేర్కొన్నారు. తెల్లరక్తకణాలు తగ్గాయి.. కిడ్నీ, లంగ్స్ ఇన్‌ఫెక్షన్లతో బాధపడుతున్నారని చెప్పారు. బాలింతల నుంచి పసిగుడ్డులకు ఇన్‌ఫెక్షన్ సోకిందని తెలిపారు. బాలింతల నుంచి పాలు తాగడం వల్ల నీలోఫర్‌లో పసిగుడ్డులు చికిత్స పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాలింతలు పూర్తిగా కోలుకోకుండా పసిగుడ్డులను ఎవరు చూసుకుంటారని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఆరుగురికి 10వ తేదీన ఇన్‌ఫెక్షన్ వచ్చిందని, నలుగురికి 11వ తేదీన సిజేరియన్ చేశారని హరీశ్‌రావు తెలిపారు. థియేటర్ మెయింటెనెన్స్ సరిగ్గా లేక ఇన్‌ఫెక్షన్ సోకిందని బాధితులు అంటున్నారని అన్నారు. వైద్యుల నిర్లక్ష్యం కూడా కారణమని అంటున్నారని అన్నారు. కాలం చెల్లిన మందులు వాడినందుకే ఈ పరిస్థితి వచ్చింటున్నారని తెలిపారు. ఇంత జరిగినా ప్రభుత్వం ఎందుకు విచారణ జరపడం లేదని ప్రశ్నించారు. ఘటన జరిగిన పది రోజులవుతున్నా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదని మండిపడ్డారు. వైద్యారోగ్య అధికారులు కనీసం పరామర్శించిన పాపాన పోలేదని విమర్శించారు. ఘటన నుంచి గురించి పూర్తిస్థాయి విచారణకు ఆదేశించలేదని అన్నారు. బాధ్యులైన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక పేషెంట్ నగలు అమ్మి, అప్పు తెచ్చి వైద్య చికిత్సలు చేయించామని కుటుంబీకులు చెప్పారని హరీశ్‌రావు తెలిపారు. ఇంత జరిగినా ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా కూడా లేదని విమర్శించారు. ఇందిరమ్మ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. కేసీఆర్ హయాంలో గర్భిణులకు న్యూట్రీషన్ కిట్, బాలింతలకు కేసీఆర్ కిట్‌లు ఇచ్చామని తెలిపారు. మహిళల ఆరోగ్యం కోసం ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు. అమ్మ ఒడి వాహనాల్లో బాలింతలను సురక్షితంగా ఇళ్లకు చేర్చామని చెప్పారు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీలు గణనీయంగా తగ్గాయని అన్నారు.

## నేడు,రేపు బల్కంపేట ఎల్లమ్మకళ్యాణోత్సవం

గ్రీన్‌ల్యాండ్స్, సత్యం థియేటర్ నుంచి బల్కంపేట, ఫతేనగర్ వైపు వెళ్లే వాహనాలు ఎస్ఆర్ నగర్ టి జంక్షన్, బీకే గూడ మీదుగా సనత్‌నగర్ వెళ్లాల్సి ఉంటుందని వివరించారు. ఫతేనగర్ ఫ్లై ఓవర్ నుంచి బల్కంపేట వైపు వాహనాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. కట్టమైసమ్మ గుడి, బేగంపేట వైపు మళ్లిస్తామని పేర్కొన్నారు. గ్రీన్‌ల్యాండ్స్ – ఫుడ్ వరల్డ్ నుంచి బల్కంపేట వైపు వాహనాలకు నో ఎంట్రీ అని చెప్పారు. బేగంపేట, కట్టమైసమ్మ ఆలయం నుంచి బల్కంపేట వైపు వచ్చే ట్రాఫిక్‌ను సత్యం థియేటర్, మైత్రీవనం వైపు మళ్లిస్తామని అన్నారు. ఎస్ఆర్ నగర్ టి జంక్షన్ నుంచి ఫతేనగర్ వరకు ఉన్న చిన్న సందులు అన్నీ మూసివేస్తామని తెలిపారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్ కోసం ఆర్ అండ్ బీ కార్యాలయం, జిహెచ్ఎంసి గ్రౌండ్, నేచర్ క్యూర్ హాస్పిటల్ వద్ద సౌకర్యం కల్పించామని వివరించారు. ఈ ప్రాంతం వైపు వచ్చే వారు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని వాహనదారులకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ జాయింట్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లు

ఇంటి స్థలంలేని పేదలకు కూడా వీటిని అందజేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి పొంగులేటి వివరించారు. లాభం, స్వార్థం లేకుండా పేదలకు ఇళ్లు నిర్మించి అందజేస్తున్నామని పేర్కొన్నారు. అజఖీఇ పరిధిలో ఇళ్లు కట్టించే పథకాన్ని ఈ రోజు ప్రారంభించామని తెలిపారు. ఇందుకోసం పదహారు నియోజకవర్గాల్లో స్థలాలు ఎంపిక చేశామని చెప్పుకొచ్చారు. 528 అడుగుల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ప్లాట్లను నిర్మిస్తున్నామని వెల్లడించారు. కేసీఆర్ హయాంలో తప్పిదాలతో అప్పుడు కట్టిన ప్లాట్లు ఉపయోగపడకుండా పోయాయని చెప్పారు. నగరానికి దూరంగా 35 కిలోమీటర్ల దూరంలో కట్టడంతో పేదలు అక్కడకు వెళ్లలేదని తెలిపారు. చదరపు గజానికి లక్షల విలువ ఉండే కోర్ ప్రాంతంలో టవర్లు నిర్మించి పేదలకు ఇస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. పేదలకు ఇళ్లు ఇస్తామంటే కొందరు హేళన చేశారని అన్నారు. ఈ పథకం ఫెయిల్ అయితే విమర్శించాలని కొందరు సంతోషపడ్డారని చెప్పుకొచ్చారు. రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పేదలకు ఇంటి కల నెరవేర్చాలని తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కూడా ఇలా ఇళ్లు కట్టించి ఇవ్వడం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గుడిసెలు లేని తెలంగాణ రాష్ట్రం తమ ప్రభుత్వం లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. ఆ లక్ష్యంతోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. నాలుగు దశాబ్దాల క్రితమే కాంగ్రెస్ ప్రభుత్వం ఒఎఉ ఇళ్లను నిర్మించిందని తెలిపారు. నగరంలో చాలాచోట్ల హౌసింగ్ బోర్డు కాలనీలు ఉన్నాయని ప్రస్తావించారు. ఎంత విలువైన భూమి అయినా పేదలకు ఇవ్వాలని తాము నిర్ణయించామని చెప్పుకొచ్చారు. పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు జరుగుతోందని స్పష్టం చేశారు. ఇళ్ల కేటాయింపుల్లో రిజర్వేషన్లు అమలు చేస్తామని తెలిపారు. మొదటి విడతలో 16నియోజకవర్గాల్లో 7680 ఎ÷-లాట్లను నిర్మిస్తామని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. క్యూర్ పరిధిలోని ప్రజలకు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లో స్థలం లేని పేదలు కిరాయి ఇళ్లలో ఉంటున్నారని తెలిపారు. అజఖీఇలో పేదలకు తమ ప్రభుత్వమే స్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకునే పథకాన్ని ప్రారంభించామని వెల్లడించారు. గత ప్రభుత్వం హౌసింగ్ విభాగాన్నే రద్దు చేసిందని చెప్పుకొచ్చారు. తాము దాన్ని పునరుద్ధరించామని అన్నారు. బల్కంపేట ఎల్లమ్మ బోనాల ముందు అజఖీఇలో ఈ పథకం ప్రారంభించామని వెల్లడించారు. మళ్లీ వచ్చే బోనాల నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## ఆపదలో అండగా... ఆర్టీసీ ఒకే కుటుంబం..!

ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. కుటుంబానికి ప్రజా ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, అందులో భాగంగానే దివంగత శంకర్ కుమారుడు హేమంత్‌కు ఆర్టీసీలో ఉద్యోగం కల్పిస్తున్నామని, అలాగే ఆ కుటుంబానికి ఇల్లు కూడా మంజూరు చేశామని ప్రకటించారు. గత ప్రభుత్వాల కాలంలో ఆర్టీసీ కార్మిక సంఘాలను ఎత్తివేసి, నిరంకుశంగా వ్యవహరించారని మంత్రి విమర్శించారు. అయితే రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్టీసీలోని ప్రతి సమస్యను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించే మహాలక్ష్మి పథకం ప్రారంభమైనప్పటి నుండి ప్రభుత్వం నెలకు రూ. 300 కోట్లు ఆర్టీసీకి విడుదల చేస్తోందని, ఈ పథకం వల్ల పనిభారం పెరిగినప్పటికీ సిబ్బంది ఎంతో కష్టపడి విజయవంతం చేస్తున్నారని కొనియాడారు. ముఖ్యంగా రాఖీ పౌర్ణమి వంటి పండుగ రోజుల్లోనూ మహిళా ప్రయాణికుల కోసం కార్మికులు తమ సోదరులకు రాఖీ కట్టి మరీ విధులు నిర్వహించడం వారి నిబద్ధతకు అద్దం పడుతోందన్నారు. కార్మికుల సంక్షేమంతో పాటు వారి కుటుంబాల భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, రూ. 6 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న ఆర్టీసీ ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ సిబ్బందితో సహా ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని మంత్రి స్పష్టం చేశారు. రిటైర్డ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కూడా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో సంస్థ పరిరక్షణ, ప్రయాణికుల సౌలభ్యం, కార్మికుల సంక్షేమం అనే మూడు ప్రధాన అంశాల ఆధారంగా సంస్థను ముందుకు తీసుకెళ్తామన్నారు. కార్మిక సంఘాల ఎన్నికల అనంతరం నలుగురు మంత్రులు, అధికారుల కమిటీ తీసుకున్న నిర్ణయం మేరకు ఆర్టీసీ విలీన పక్రియను కూడా ప్రారంభిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే క్యూర్ ఏరియా పరిధిలో అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మిస్తామని, గ్రామాల నుండి రాజధాని వరకు కొత్త రూట్లలో బస్సులు నడుపుతూ, మెట్రో మరియు ఎంఎంటిసి సర్వీసులతో ఆర్టీసీని అనుసంధానం చేసి రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని వెల్లడించారు. ఆర్టీసీ పేదవాడి గుండె చప్పుడు అని, కాబట్టి యాజమాన్యం తీసుకుంటున్న సంక్షేమ, అభివృద్ధి చర్యల్లో ఉద్యోగులంతా మరింత బాధ్యతగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి మాట్లాడుతూ తోటి ఉద్యోగి కుటుంబం కష్టాల్లో ఉన్నప్పుడు సంస్థలోని సిబ్బంది అంతా ఏకతాటిపైకి వచ్చి రూ. 90.85 లక్షల భారీ ఆర్థిక సహాయాన్ని అందించడం ఆర్టీసీ ఉద్యోగులలో ఉన్న అంతర్గత బంధానికి, పరస్పర సహకారానికి ఒక గొప్ప నిదర్శనమన్నారు. సాయం చేయడానికి ముందుకు వచ్చిన ప్రతి ఒక్క ఉద్యోగికి ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఒక ఉద్యోగి కష్టంలో ఉంటే మొత్తం సంస్థ అండగా నిలవాలనే గొప్ప సంస్కృతి టీజీఎస్ ఆర్టీసీ సొంతమని, ఈ కార్యక్రమం ఆ విలువలను మరోసారి చాటిచెప్పిందన్నారు. ఉద్యోగుల సంక్షేమం కోసం యాజమాన్యం కట్టుబడి ఉందని, సిబ్బందికి అవసరమైన భద్రత, శిక్షణ, పని పరిస్థితుల మెరుగుదల కోసం నిరంతర చర్యలు తీసుకుంటున్నామని ఎండీ స్పష్టం చేశారు. ప్రయాణికుల భద్రతే తమ తొలి ప్రాధాన్యమని, ప్రతి డ్రైవర్, కండక్టర్ అత్యంత బాధ్యతతో విధులు నిర్వహిస్తూ ప్రజలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్నారని, వారి సేవలు అమూల్యమైనవని కొనియాడారు. సంస్థ ఆర్థిక బలోపేతంతో పాటు ఉద్యోగుల సంక్షేమం కూడా సమానంగా ముఖ్యమని యాజమాన్యం విశ్వసిస్తోందని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు తాము అందుబాటులో ఉంటామన్నారు. ప్రయాణికులకు నాణ్యమైన, సురక్షితమైన, సమయపాలనతో కూడిన సేవలు అందించేందుకు డిజిటల్ సేవలు, ఆన్‌లైన్ టికెటింగ్, బస్సుల ఆధునీకరణ వంటి ఆధునిక సాంకేతికతను విస్తృతంగా వినియోగిస్తున్నట్లు తెలిపారు.

## జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల వ్యవహారం

కృష్ణారెడ్డి వ్యవహారం ఉత్కంఠగా మారింది. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల కేసులో ఊహించని పరిణామం ఎదురైంది. ఓ వైపు ఆయనను సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకోగా,మరోవైపు ఆయన ఆత్మహత్యకు పాల్పడగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో హైదరాబాద్ నేషనల్ అకాడమీ చర్యలు తీసుకుంది. కృష్ణారెడ్డిని తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. నేషనల్ పోలీస్ అకాడమీ ప్రివిలేజ్ కమిటీ నిర్ణయం మేరకు ఉదయ్ కృష్ణా రెడ్డిని ఎన్‌పీఏ నుంచి అధికారులు పంపించేశారు. ఉదయ్ కృష్ణారెడ్డి ప్రవర్తన గురించి మొదట ఎన్‌పీఏ అధికారులకు మహిళా ట్రైనీ ఐపీఎస్ ఫిర్యాదు చేశారు. సీసీటీవీ కెమెరాల ఆధారాలతో పాటు అన్ని ఆధారాలు సేకరించాక ఉదయ్ కృష్ణారెడ్డిపై ఆరోపణలు నిజమేనని ప్రివిలేజ్ కమిటీ నిర్ధారించింది. దీంతో తక్షణమే పోలీస్ అకాడమీ నుంచి నుంచి సస్పెండ్ చేస్తూ ప్రివిలేజ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. సర్వీస్‌లో జాయినింగ్‌కు సంబంధించి డీవోపీటీ దే తుది నిర్ణయం అని నేషనల్ పోలీస్ అకాడమీ అధికారులు చెబుతున్నారు. ఇదిలావుండగానే ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యకు యత్నించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఆయనను ఆస్పత్రికి తరలించారు. ఎర్రగడ్డలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కృష్ణారెడ్డికి చికిత్స అందిస్తున్నారు. ఆదివారం కృష్ణారెడ్డిపై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. తనను లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నాడంటూ మరో మహిళా ట్రైనీ ఐపీఎస్ ఫిర్యాదు చేశారు. దీంతో అత్తాపూర్ పోలీసులు కృష్ణారెడ్డిపై కేసు నమోదు చేశారు. ఈ అంశంపై ఎనిమిది రోజుల్లోగా వివరణ ఇవ్వాలంటూ ట్రైనీ ఐపీఎస్‌కు పోలీసులు నోటీసులు కూడా జారీ చేశారు. అయితే ఈ ఘటన అనంతరం సొంతూరుకు వెళ్లిపోయిన కృష్ణారెడ్డి.. ఆదివారం సాయంత్రం మోతీనగర్‌లోని స్నేహితుడి ఇంటికి వచ్చినట్లు తెలుస్తోంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యకు యత్నించాడు. ఇది గమనించి అతన్ని ఎర్రగడ్డలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. కాగా, ఆత్మహత్యకు ముందు తన తప్పేమీ లేదని ఉదయ్ కృష్ణారెడ్డి వాట్సాప్ స్టేటస్ పెట్టడం గమనార్హం. తనతోపాటు శిక్షణ పొందుతున్న తోటి ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి ఈ ఏడాది జూన్ 23 నుంచి తనను లైంగికంగా వేధిస్తున్నాడని, వాట్సాప్ ద్వారా అసభ్యకర మెసేజ్‌లు పంపి బూతులు తిడుతున్నాడని ఓ మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారి అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఉదయ్ కృష్ణారెడ్డి రహస్యంగా తన వ్యక్తిగత ప్రైవేట్ వీడియోలను చిత్రీకరించి తీవ్రంగా బెదిరిస్తున్నాడని, ఆ వీడియోలను తన భర్తకు పంపి మానసికంగా వేధించడంతోపాటు వాటిని సోషల్ మీడియాలో పెడతానంటూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల తనను బలవంతంగా గదిలోకి లాక్కెళ్లి ప్రైవేట్ భాగాలను తాకుతూ లైంగిక వేధింపులకు పాల్పడటంతోపాటు చంపేందుకు ప్రయత్నించాడని, మెడపై కత్తి పెట్టి ఆ గది నుంచి బయటకు వెళ్లకుండా నిర్బంధించాడని ఆ అధికారి ఆరోపించారు. దీంతో ఉదయ్ కృష్ణారెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న అధికారులు.. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా మహిళా ఐపీఎస్ ట్రైనీ చేసిన ఆరోపణలు నిజమని ప్రివిలేజ్ కమిటీ నిర్ధారించింది. ఈ కమిటీ నిర్ణయంతో జాతీయ పోలీస్ అకాడమీ నుంచి ఉదయ్ కృష్ణారెడ్డిని తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. దీంతో మనస్తాపానికి గురైన ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యకు యత్నించాడు. దీనికి ముందు తన తప్పేమీ లేదంటూ వాట్సాప్‌లో స్టేటస్ పెట్టాడు. ఇప్పుడు ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది.

## సమస్యలపై గిరిజన సంఘాలతో త్వరలో ప్రభుత్వం చర్చలు

పొందిన ప్రయోజనాలు కొనసాగించే వీలు లేకుండా పోయింది. నాటి ప్రభుత్వం ఈ సమస్యపై కనీసం స్పందించలేదు. జీవో నెంబర్ 3కి ఉన్న అన్ని ప్రత్యామ్నాయ అవకాశాలను కూటమి ప్రభుత్వం పరిశీలిస్తోంది. సుప్రీంకోర్టు 5గురు సభ్యుల ధర్మాసనం స్పష్టమైన తీర్పు నేపథ్యంలో ఏ విధంగా న్యాయం చేయాలనే దానిపై కసరత్తు చేస్తున్నాం." అని అన్నారు.త్వరలో గిరిజన సంఘాలతో చర్చలుస్థానికులకే ఉద్యోగాలు అంశంతో పాటు...గిరిజనులకు సంబంధించి పలు సమస్యలపై గిరిజన సంఘాలతో వెంటనే చర్చించాలని సిఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఆయా అంశాలపై గిరిజన సంఘాలను ఆహ్వానించి...ఉన్నతాధికారులు, గిరిజన ప్రజా ప్రతినిధులు చర్చించాలని సూచించారు. జీవో నెంబర్ 3 ప్రయోజనాలు దక్కేలా చేస్తున్న ప్రయత్నాలను వివరించడంతో పాటు...ఈ ప్రక్రియలో వారిని కూడా భాగస్వాములు చేయాలని సూచించారు. చట్టపరమైన అడ్డంకులు అధిగమించడానికి గిరిజన సంఘాల సూచనలు కూడా తీసుకోవాలన్నారు. అదే విధంగా అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్ 1లోకి మార్చాలని, పోలవరం జిల్లాను జోన్ 2లో చేర్చాలని సీఎం ఆదేశించారు. ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. బాక్సైట్ మైనింగ్ విషయంలో గిరిజనులు ఎటువంటి ఆందోళన చెందవద్దని చెప్పారు. గత పాలకులు తమ అవినీతి కారణంగా బాక్సైట్ లీజుల అంశం ఇప్పుడు అంతర్జాతీయ కోర్టులకు వెళ్లిందని గుర్తు చేశారు. గిరిజనుల హక్కులకు, మనోభావాలకు వ్యతిరేకంగా ఎటువంటి చర్యలు ఉండవని....ఈ విషయంలో ఎవరి ట్రాప్ లోనూ పడవద్దని సిఎం సూచించారు. అలాగే 1/70 అమలు విషయంలో ఎటువంటి అనుమానాలు అవసరం లేదని... ఇదే విషయాన్ని గిరిజన సంఘాలకు చెప్పాలని సిఎం సూచించారు. అరకు కాఫీని ప్రమోట్ చేసినా...గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్యం, విద్య, రవాణా సదుపాయాల కల్పనకు పెద్ద పీట వేసినా అది కూటమి ప్రభుత్వం గిరిజనులపై చూపిన బాధ్యత అన్నారు. గిరిజన ప్రాంతాల్లో కూడా పూర్తి స్థాయి అభివృద్ధి జరిగినప్పుడే...వారి జీవన ప్రమాణాలు మారినప్పుడే నిజమైన అభివృద్ధి అని ప్రభుత్వం నమ్ముతోందన్నారు.ది

గిరిజన సంఘాలతో చర్చలకు, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎప్పుడూ సిద్దంగా ఉంటుందని సిఎం స్పష్టం చేశారు. ఈ విషయంలో చొరవ తీసుకోవాలని గిరిజన ప్రజాప్రతినిధులకు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులకు సూచించారు. సిఎం సూచన మేరకు త్వరలోనే గిరిజన సంఘాలను ఆహ్వానించి చర్చించనున్నారు. సమీక్షలో మంత్రి సంధ్యారాణి, సీఎస్ సాయి ప్రసాద్, గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ నాయక్, జీఏడీ ప్రిన్సిపల్ సెక్రటరీ రావత్, న్యాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## పామాయిల్ పెంపకం రైతులకు ఎంతో మేలు

ఉందని.. వివిధ కారణాలతో సీఎం రాలేకపోయారని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా రైతులకు సీఎం రేవంత్‌రెడ్డి తన శుభాకాంక్షలు తెలిపారని అన్నారు. అంజనాపురంలో ఆయిల్ పామ్ కాంప్లెక్స్ నిర్మించిన గోద్రెజ్ సంస్థకు భట్టి విక్రమార్క కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి విశేషంగా కృషిచేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి అభినందనలు చెప్పారు. ఖమ్మం జిల్లా రైతన్నలు అన్ని రకాల పంటలు సాగు చేస్తారని వెల్లడించారు. తాను ఎన్నో రకాల పంటలు సాగు చేశానని ఏ పంటకు రాని దిగుబడి ఆయిల్ పామ్‌కు వచ్చిందని మంత్రి తుమ్మల స్వయంగా తనతో చెప్పారని అన్నారు. చివరకు ప్రకృతి విపత్తులను కూడా ఈ పంట తట్టుకొని నిలబడుతుందని చెప్పుకొచ్చారు. పామాయిల్ సాగు చేసిన రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వెల్లడించారు. దేశంలో 25 లక్షల మిలియన్ టన్నుల పామాయిల్ అవసరం ఉందని తెలిపారు. దేశంలో కేవలం 12 లక్షల మిలియన్ టన్నుల పామాయిల్ మాత్రమే ఉత్పత్తి అవుతుందని చెప్పుకొచ్చారు. 1992లో ప్రారంభించిన పామాయిల్ సాగు ఇప్పటికి దేశంలోనే తెలంగాణను అగ్రగామిగా నిలిపే స్థాయికి వచ్చిందని భట్టి విక్రమార్క వివరించారు. గతంలో పామాయిల్ టన్ను గెల ధర రూ.12000లు ఉంటే.. నేడు టన్ను ధర రూ.23 వేలకు పెరిగిందని వెల్లడించారు. అంజనాపురంలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం.. ఖమ్మం జిల్లా అన్నదాతలకు ఓ వరమని ఉద్ఘాటించారు. వ్యవసాయ ఉత్పత్తుల పరిశ్రమలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా వేదిక కాబోతోందని తెలిపారు. రాబోయే రోజుల్లో అనేక రకాల పరిశ్రమలు ఇక్కడికి రాబోతున్నాయని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. జిల్లాలో గోద్రెజ్ కంపెనీ ఆయిల్ పామ్ కాంప్లెక్స్ నిర్మించడం సంతోషంగా ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఈ కాంప్లెక్స్‌లో అత్యాధునిక సీడ్ గార్డెన్ ఏర్పాటు చేశారని తెలిపారు. గోద్రెజ్ కంపెనీకి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని, రైతులకు అన్ని విధాలా అందుబాటులో ఉండేలా కంపెనీ సేవలందించాలని ఆకాంక్షించారు. ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ ముందు ఉందని మంత్రి తుమ్మల తెలిపారు. రాష్ట్రంలో పది లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు కృషి జరుగుతోందని చెప్పారు.

ఈ సందర్భంగా రైతులంతా ఈ పంట సాగుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయిల్ పామ్‌తో ఎలాంటి నష్టం ఉండదన్నారు. ఆయిల్ పామ్ కింద ఇప్పటికే మూడు ఫ్యాక్టరీల నిర్మాణం పూర్తయిందని, మరో ఆరు ఫ్యాక్టరీల నిర్మాణం జరుగుతోందని వెల్లడించారు. తెలంగాణ భూములు ఆయిల్ పామ్ సాగుకు అనుకూలమని మంత్రి పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో అన్ని జిల్లాల్లో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీల నిర్మాణం జరగాలన్నదే తన లక్ష్యమని చెప్పుకొచ్చారు. దక్షిణ భారతదేశ నేతలందరూ ఆయిల్ పామ్ దిగుమతిపై సుంకం తగ్గించాలని కోరుతున్నామని మంత్రి చెప్పారు.

ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రైతులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నామని, ఆయిల్ పామ్ సాగుతో వారి జీవితాల్లో వెలుగులు నింపుతామన్నారు మంత్రి తుమ్మల. తన యాభై సంవత్సరాల వ్యవసాయ అనుభవంలో ఎన్నో పంటలు పండించామని, ఏ పంటకు రాని ఆదాయం దీనికి వస్తుందన్నారు. ఆయిల్ పామ్‌ను ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన నాటి నుంచి తాను కూడా సాగు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మరోవైపు, ఎల్‌నినో ప్రపంచాన్ని కబళించే పరిస్థితి ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. దాని కారణంగా రుతుపవనాలు సరిగా రాలేదని, మానవజాతి చేసిన విధ్వంసం తిరిగి మన పాలిటే మహమ్మారిగా మారిందన్నారు. దక్షిణ భారతదేశంలో ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉందని, ఉద్యానవన పంటల సాగుతో భూములను చల్లబరచాలని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

## సజావుగా పార్లమెంట్ సమావేశాలు సాగాలి

మీడియాతో ప్రధాని మాట్లాడారు. భారత అంతరిక్ష ప్రస్థానంలో కీలక ఘట్టం ఆవిష్కృతమైందని ఉద్ఘాటించారు. భారతదేశ యువత అంతరిక్షంలోకి దూసుకుపోయిందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. విక్రమ్-1 విజయం వెనుక యువత పాత్ర కీలకమని తెలిపారు. స్కైరూట్ విజయవంతం అవడం దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. అదే సమయంలో అంతరిక్ష రంగ స్టార్టప్ స్కైరూట్ 'విక్రమ్-1' ప్రయోగం విజయవంతం అవడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. 28 ఏళ్ల సగటు వయసున్న ఆవిష్కర్తలదే ఈ ఘనత అని కొనియాడారు. 'ఏడాది కాలంలో ఎన్నో గొప్ప విషయాలు జరిగాయి. అంతరిక్షంతో సహా వేదిక ఏదైనా.. మనం సాధించిన విజయాలు దేశానికి గర్వకారణం. గత సంవత్సరం వర్షాకాల సమావేశాలకు ముందు ఒక భారతీయ పౌరుడు శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్నారు. ఇప్పుడు ఒక భారతీయ స్టార్టప్ స్కైరూట్ అద్భుతమైన ఘనత సాధించిందని మోదీ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి పరోక్షంగా చురకలంటించారు. భారత యువత అంతరిక్షంలో ఒక కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు. ప్రపంచంలోని కొన్ని దేశాల్లో మాత్రమే ఇలాంటి ప్రైవేటు సంస్థలు ఉన్నాయి. స్కైరూట్ స్టార్టప్ బృందం సగటు వయసు 28 ఏళ్లని నాకు తెలిసింది. ఇక్కడ నేను 56 ఏళ్ల యువకుడి గురించి మాట్లాడటం లేదని పరోక్షంగా రాహుల్‌ను ఉద్దేశించి మోదీ అన్నారు. యువత సాధించిన ఈ విజయం యాదృచ్ఛికం కాదు. మన దేశ యువత సామర్థ్యం, ఆకాంక్షలు అంతరిక్షం వలే హద్దుల్లేనివని చెప్పే సందేశం ఇదని ప్రధాని ప్రశంసించారు. రాజస్థాన్‌లో అతిపెద్ద ఆయిల్ రిఫైనరీని దేశానికి అంకితం చేశామని వెల్లడించారు. ఒక సెమీ కండక్టర్ ప్లాంట్, గ్రీన్ హైడ్రోజన్ రైలును ప్రారంభించామని తెలిపారు. యుద్ధంతో చాలా దేశాలకు నష్టం జరుగుతోందని చెప్పారు.

చమురు ధరలు అమాంతం పెరుగుతు న్నాయని తెలిపారు. 7.7శాతం గ్రోత్‌రేట్ భారత్ నమోదు చేస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధాని నరేంద్రమోదీ దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. 'వర్షాకాలం, వర్షాకాల సమావేశాలు.. ఈ రెండు చురుగ్గా ఉంటే ఫలితాలు గొప్పగా ఉంటాయి. అప్పుడే దేశం సంక్షేమంగా ఉంటుంది. అందుకే ఈ రెండూ మెరుగ్గా ఉండాలని కోరుకుంటున్నాను' అని మోదీ తెలిపారు. గందరగోళ పరిస్థితులకు తావులేకుండా పార్లమెంట్ ఉభయ సభల్లో చర్చలు జరగాలని ఆకాంక్షించారు.

## 1న మోడీ చేతుల మీదుగా భోగాపురం విమానాశ్రయం ప్రారంభం

ఉత్తరాంధ్ర సంస్కృతి ప్రతిబింబించేలా జానపద కళారూపాలతో స్వాగత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రధాని పర్యటనకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు హోం మంత్రి అనిత ఆదేశాలు జారీ చేశారు. గత పదేళ్ల వరకు ఒక సాధారణ గ్రామంగా ఉన్న భోగాపురం ఇప్పుడు రూపురేఖలు మారాయి. విమానాశ్రయం ఏర్పాటుతో నేడు ఉత్తరాంధ్ర ప్రగతికి మణిహారం కాబోతోంది. రాష్ట్ర విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన తెదేపా ఈ ప్రాంతంలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి ప్రతిపాదించింది. అప్పట్లో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతిరాజు చొరవ, ఎన్డీయే ప్రభుత్వం అనుమతితో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత అప్పటి వైకాపా ప్రభుత్వం భూసేకరణ చేపట్టింది. 2023 మే 23న ముఖ్యమంత్రిగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి విమానాశ్రయం నిర్మాణానికి రెండోసారి శంకుస్థాపన చేశారు. సరిగ్గా ఏడాదికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం.. కేంద్రంలో పౌరవిమానయాన శాఖ మంత్రిగా కింజరాపు రామ్మోహన్‌నాయుడు బాధ్యతలు చేపట్టడంతో ప్రాజెక్టు నిర్మాణం వేగంగా సాగింది. సుమారు రెండున్నరేళ్లలో విమానాశ్రయం నిర్మాణం పూర్తయ్యింది. ఆగస్టు ఒకటిన ప్రధాని నరేంద్ర మోదీ చేతులమీదుగా ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. ఉత్తరాంధ్ర వాసుల సహా రాష్ట్రంలోని నిరుద్యోగుల ఉపాధికి ఈ ప్రాజెక్టు ఊతమివ్వనుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా మూడు లక్షల మందికి ఉపాధి కల్పిస్తుందని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు వివిధ సందర్భాల్లో పేర్కొన్నారు. పర్యాటక రంగంలోనూ వేలాది ఉద్యోగావకాశాలు అందుబాటులోకి రానున్నాయి. పారిశ్రామిక, రవాణా రంగాలు భావితరాలకు బంగారు భవిత అందించనున్నాయి. 136 ఎకరాల్లో జీఎంఆర్–మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యు సిటీ విమానాశ్రయానికి అనుబంధంగా ఏర్పాటు కానుంది. ఈ ప్రాజెక్టును ఏడాదిలోపు పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇక్కడ పైలట్లు, రక్షణ రంగ నిపుణులను తీర్చిదిద్దేందుకు అడుగులు పడుతున్నాయి. విమానాశ్రయం సహా ఇతర భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులతో ప్రధానమైన అభివృద్ధి కేంద్రంగా మారనుంది.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

## సంపాదకీయం

# ప్రజాగొంతుకపై అంకుశం !

దేశంలో ఆందోళనలను పట్టించుకునేందుకు పాలకులకు తీరిక లేకుండా పోయింది. కేంద్రంలోని ప్రభుత్వమైనా, రాష్ట్రాల్లోని వివిధ పార్టీల నేతృత్వంలో ఉన్న ప్రభుత్వాలకైనా ఇది కనపడడం లేదు. అన్నా హజారే లాంటి వారు ఆందోళనలు చేస్తున్నా పట్టించుకునే స్థితిలతో పాలకులు లేరు. రాజకీయ అవినీతిపై ఆయన యుద్ధం చేస్తున్నా, ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. తాజాగా సామాజిక కార్యకర్త, విద్యావేత్త, పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ ఇరవైరోజులుగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ దగ్గర ఆమరణ దీక్షలో ఉన్నారు. ఆయన ఎందుకు దీక్ష చేస్తున్నారు..ఎందుకు నిరసనలకు దిగారన్న కనీస ఆలోచన కూడా చేసే పరిస్థితిలో కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం లేదు. ఎన్‌డిఎకు మద్దతు ఇస్తున్న పార్టీలు కూడా కిమ్మనడం లేదు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యంలో పనికిరాదు. మొత్తంగా పోటీ పరీక్షల విశ్వసనీయత దెబ్బతినివున్న పరిస్థితుల్లో ఉద్యమకారులు డిమాండ్ చేస్తున్న సంస్కరణలపై మాట్లాడటా నికీ, తగిన చర్యలు చేపట్టడానికీ ప్రభుత్వానికి అభ్యంతరం ఉండనక్కరలేదు. ప్రజల పక్షాన నిరశనలు, ఉద్యమాలు చేయడం వాంగ్‌చుక్‌కు కొత్తకాదు. రేపోమాపో ఆయన దీక్ష విరమించినా ఎవరూ దానిని వైఫల్యంగా భావించరు. కానీ, నెలన్నరనుంచి సాగుతున్న ఈ ఉద్యమాన్ని బేఖాతరు చేయడం ప్రభుత్వానికి అప్రదిష్ఠతెస్తుంది, మానవత్వం, జవాబుదారీతనం కొరవడ్డాయన్న అభిప్రాయానికి తావిస్తుంది. శాంతియు తంగా సాగుతున్న నిరసనను అలాగే ముగిసేట్టు చూడాల్సిన బాధ్యత ఇరుపక్షాలపైనా ఉంది. కొందరు నిస్వార్థ పరులు దేశం కోసం ఏదో చేయాలన్న తపనలో ఉంటారు. వారు తమ ఆకాంక్షను నిరసలన ద్వారా తెలియచేస్తారు. వాటిని గుర్తించి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ అలా జరగడం లేదు. తాజాగా సోనమ్ వాంగ్ చుక్ దీక్ష ఈ కోవలోకే వస్తుంది. నీట్ తప్పిదాలకు బాధ్యత వహిస్తూ కేంద్రవిద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో వాంగ్‌చురక్ దీక్షకు దిగారు. నిజానికి సోనమ్ ను పిలిచి మాట్లాడవచ్చు. లూఏదా ఆయన దీక్షను విరమించేలా, ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించ వచ్చు. కానీ ప్రభుత్వం అలా చేయకుండా యాన దీక్ష భగ్నానికి యత్నించింది. అంటే దీక్షలను కూడా తట్టుకునే స్థితిలో పాలకులు లేరని గుర్తించాలి. 1984లో లద్దాఖ్ వాసులకు ఎస్టీ హోదా ఇవ్వాలంటూ వాంగ్‌చుక్ తండ్రి వాంగ్యాల్ ఇలాగే దీక్షకు దిగితే నాటి ప్రధాని ఇందిరాగాంధీ స్వయంగా లెహ్ వెళ్ళి, డిమాండ్లు నెరవేరుస్తానని హామీ ఇచ్చి దీక్ష విరమింపచేసిన విషయం మరచిపోరాదు. 2011లో సామాజిక ఉద్యమకారుడు అన్నాహజారే దీక్ష సందర్భంలోనూ నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ మానవతా దృక్పథంతో వ్యవహరించారు. అభిప్రాయభేదాలు ఉన్నప్పటికీ చర్చించడం ద్వారా పెద్దమనసు చాటుకున్నారు.

వాంగ్‌చుక్ ఈ దీక్షకు దిగడానికి బీజేపీమీద ఆయనకు ఉన్న పాతకక్షలే కారణమంటూ కొన్ని హిందీ చానెళ్ళలోనూ, సోషల్ మీడియాలోనూ బురదజల్లే పని జోరుగా సాగడం దారుణం కాక మరోటి కాదు. ఆయన ఆరోగ్యం తీవ్రంగా క్షీణించిందని, పదికేజీలకు పైగా బరువు తగ్గారని, దీక్షసాగితే కీలక అవయవాల పై దుష్ప్రభావాలు తప్పవని వైద్యబృందం హెచ్చరించడంతో పోలీసులు ఆయనను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. నిజానికి ఈ పనిచేసే ముందు వాంగ్‌చుక్‌తో మాట్లాడివుంటే పాలక పార్టీ పెద్దల గౌరవం తగ్గేది ఏమీ లేదు.. ఆయన ప్రాణానికి ప్రమాదం ఉన్నది కనుక, దీక్ష విరమింపచేయా లంటూ దాఖలైన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేస్తూ, ప్రతీ పౌరుడి ప్రాణమూ విలువైనదేనని, వాంగ్‌చుక్‌కు ప్రభుత్వ వైద్యులతో నిరంతర పరీక్షలు నిర్వహిస్తూ, వైద్యపరమైన చర్యలన్నీ చేపట్టాలని కోర్టు ఆదేశించింది. ఆయనతోపాటుగా ఆమరణదీక్షలో ఉన్న ముగ్గురు విద్యార్థినేతల ఆరోగ్యం బాగా దిగజారిందని, తక్షణమే దీక్షవిరమించాల్సిందిగా ఒకరిని వైద్యులు హెచ్చరించినట్టుగా వార్తలు వస్తున్నాయి. వాంగ్‌చుక్ మాత్రం తాను బయటకు బలహీనంగా కనిపిస్తున్నా, లోన గట్టిగానే ఉన్నానని హామీ ఇస్తున్నారు. తనను దీక్ష విరమించుకోవాలని ఒత్తిడి చేయవద్దని ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని వాంగ్‌చుక్ విజ్ఞప్తి చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా, పార్లమెంట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభిం అయినా, ఎన్‌డిఎ పక్షనేతలు ఎవ్వరు కూడా వాంగ్‌చుక్‌ను పలకరించలేదు. ఆయన పక్షాన నిలవడానికి వారికి ధైర్యం లేకుండాపోయింది. దీక్షాస్థలిని సందర్శించి మద్దతు ప్రకటిస్తున్న ప్రముఖులు, నేతలు లేకపోలేదు. కొందరు స్వయంగా వచ్చి సంఘీభావం ప్రకటిస్తే, బీజేపీ ప్రభుత్వ కఠినవైఖరిని పలు వేదికలద్వారా మరికొందరు ప్రశ్నిస్తున్నారు.

నీట్ వైఫల్యం మీద స్వయంగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తూ, ధర్మేంద్రప్రధాన్ రాజీనామాకు డిమాండ్ చేస్తున్న కాంగ్రెస్‌పార్టీ, కాస్తంత ఆలస్యంగానైనా వాంగ్‌చుక్ పక్షాన మాట్లాడుతోంది. ఇకపోతే లద్దాఖ్‌కు రాష్ట్రహోదా, ఆరో షెడ్యూల్ రక్షణల కోసం గత ఏడాది వాంగ్‌చుక్ సుదీర్ఘపోరాటం చేసినప్పుడు కూడా ప్రభుత్వం ఏమాత్రం లక్ష్యపెట్టలేదు. పైగా, హింసను ప్రేరేపించారన్న ఆరోపణలతో, ఆయన మీద జాతీయ భద్రతాచట్టాన్ని ప్రయోగించి, జైల్లో పడేశారు. 170 రోజులు జైల్లో ఉన్నాక, సుప్రీంకోర్టులో కేసు చివరివిడత విచారణకు రెండురోజుల ముందు ప్రభుత్వం ఆయనను విడుదలచేసింది. దానితోపాటు, ఆయనను అరెస్టుచేయడానికి ప్రాతిపదికలుగా వాడిన పాకిస్థాన్‌తో సంబంధాలు, అనుమానస్పద విదేశీపర్యటనలు, అక్రమ విరాళాల సేకరణ ఇత్యాది ఆరోపణలను కూడా గాలికి వదిలేసింది. ఓ రకంగా ప్రజల గొంతుకపై పాలకులు అంకుశం దింపుతున్నారు. తాముకోరుకున్నట్లుగా పాలన సాగిస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించడం లేదు. ఇందుకు తాజా ఘటనలే నిదర్శనం.

## సాయిబాబా సన్నిధిలో దేప భాస్కర్ రెడ్డి ప్రత్యేక పూజలు



ఎల్బీనగర్/సరూర్ నగర్, జూలై 20 (విజన్ ఆంధ్ర): మహేశ్వరం నియోజకవర్గం ఎన్టీఆర్ నగర్ డివిజన్ పరిధిలోని గ్రీన్ హిల్స్ కాలనీలోనీ శ్రీ సాయిబాబా ఆలయాన్ని రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు స్థానిక కాలనీ వాసులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. అనంతరం దేప భాస్కర్ రెడ్డి సాయిబాబా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలందరూ బాబా ఆశీస్సులతో ఆయురారోగ్యాలతో, భోగభాగ్యాలతో వర్ధిల్లాలని, కాలనీ సమస్యల పరిష్కారానికి, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రటరీ చిలుక ఉపేందర్ రెడ్డి, రామకృష్ణాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూన్న గణేష్ నేత, ముప్పిడి లింగస్వామి గౌడ్, తలాటి రమేష్ నేత, సుదర్శన్, రమేష్ గౌడ్, కాలిని వాసులు కృష్ణారావు, నాగేష్ నేత,రఘువీర్,ఎల్లారెడ్డి, వీరారెడ్డి, పురుషోత్తం, యాదయ్య, నరసింహ, శ్రీనివాస్ గౌడ్, కాలనీ వాసులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి 65పై రోడ్డు ప్రమాదం

**-కేఎన్ఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల మహిళ లెక్చరర్ యెల్లోల శ్రావణిరెడ్డి మృతి**

రంగారెడ్డి జిల్లా/అబ్దుల్లాపూర్ మెట్, జూలై 20 (విజన్ ఆంధ్ర): గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాల మహిళా లెక్చరర్ మృతి చెందిన సంఘటన సోమవారం సాయంత్రం అబ్దుల్లాపూర్ మెట్టు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఎల్లగిరి గ్రామానికి చెందిన రిక్కల నరేందర్ రెడ్డి, యెల్లోల శ్రావణిరెడ్డి (34) భార్యాభర్తలు. వృత్తిరీత్యా శ్రావణి రెడ్డి రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండల పరిధిలోని కేఎన్ఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తుంది. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం విధులు ముగించుకొని బి.ఆర్ టీజీ07జీ 4499 నంబర్ గల ద్విచక్ర వాహనంపై తాను నివాసముంటున్నటువంటి హనుమాన్ హిల్స్ సదా శివ హెవెన్స్ సమీపంలో పెద్దా అంబర్‌పేట్ కు బయలుదేరింది. పెద్ద అంబర్పేట్ ఔటర్ రింగ్ రోడ్డు సమీపనికి చేరుకోగానే వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం శ్రావణిరెడ్డి ప్రయాణిస్తున్నటువంటి టీజీ07జీ 4499 స్కూటీని వెనక నుండి బలంగా ఢీకొన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రావణి రెడ్డి సంఘటన స్థలంలోని మృతి చెందింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదం జరిగిన తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సంఘటనపై మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ప్రజావాణిలో వచ్చిన ఆర్జీలను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు జిల్లా కలెక్టర్ హైమావతి



సిద్దిపేట జిల్లా ప్రతినిధి 20 జూలై : ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి తమ సమస్యల వినతులను జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ తో కలిసి జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వచ్చేసి అందజేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లాలో పరిష్కారం కోసం వచ్చేసిన ప్రజల నుండి మొత్తం 150 దరఖాస్తులు తీసుకున్నట్లు తెలిపారు. ఎల్ నీ నో ప్రభావం – వర్షా బావ పరిస్థితిలను ఎదుర్కొనేందుకు రూపొందించిన లితెలంగాణ జల సిరిలి గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భవ్య, ఎస్డిసి సుదర్శన్ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పండ్ల మొక్కలతో పచ్చని భవిష్యత్తుకు శ్రీకారం

**- -హైదరాబాద్ మావేరిక్స్ క్లబ్ అధ్యక్షులు అజయ్ కుమార్**

రంగారెడ్డి/అబ్దుల్లాపూర్ మేట్, జూలై 20 (విజన్ ఆంధ్ర): జీవితంలో ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో భూమిలో నాటే ఒక చిన్న మొక్క రేపటి తరాలకు నీడ, పండ్లు, స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యాన్ని అందించే మహావృక్షంగా ఎదుగుతుందని రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మావేరిక్స్ అధ్యక్షురాలు అజయ్ కుమార్ పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మావేరిక్స్ వారి సహకారంతో సోమవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్ మెట్టు మండలం ఎంఎంసీ నాగోల్ సర్కిల్ కుంట్లూర్ రావి నారాయణ రెడ్డి కాలని ఫెజ్ 3 భూపోరాట కేంద్రంలో సుమారు వెయ్యి వివిధ రకాల పండ్ల చెట్లని నాటారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ.. ఇది కేవలం మొక్కలు నాటే కార్యక్రమం మాత్రమే కాదు సమాజం, ప్రకృతి, భవిష్యత్ తరాల పట్ల ప్రతి ఒక్కరి బాధ్యతను గుర్తు చేస్తుందన్నారు. ఒక స్ఫూర్తిదాయక ఉద్యమంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఒక వృద్ధుడు మొక్కను నాటుతూ ఇలా అన్నాడని, నేను ఈ చెట్టు ఇచ్చే ప్రతి పండును తినకపోవచ్చు కానీ నా మనవళ్లు, మనవరాళ్లు మాత్రం ఈ చెట్టు నీడలో ఆడుకుంటారని, పండ్లు తింటారని అదే నాకు నిజమైన ఆనందం.“ఆ మాటలు విన్న ప్రతి ఒక్కరి హృదయం కదిలిందన్నారు. పక్కనే చిన్నారులు తమ చేతులతో నీళ్లు పోస్తుంటే, తల్లిదండ్రులు మట్టిని నింపారు. రోటరీ సభ్యులు వారితో కలిసి మొక్కలను నాటారు. ఆ క్షణంలో అక్కడ నాటబడింది కేవలం ఒక మొక్క కాదు ఒక ఆశ,ఒక భవిష్యత్తు,ఒక జీవన సందేశమని హర్షం వ్యక్తం చేశారు.పేద కుటుంబాలకు ఈ పండ్ల మొక్కలు రేపటి ఆహార భద్రతకు,



ఆరోగ్యానికి, ఆర్థిక సహాయానికి ఒక వరంలా మారనున్నాయని ఆయన పేర్కొన్నారు. పండ్ల చెట్లు మనకు కేవలం పండ్లు మాత్రమే ఇవ్వవని, జీవనాధారాలు, కుటుంబాలకు పోషకాహారం, స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను విడుదల చేసి కాలుష్యాన్ని తగ్గిస్తాయన్నారు. వేసవిలో చల్లని నీడను అందిస్తు పక్షులు, తేనెటీగలు, సీతాకోకచిలుకలకు ఆశ్రయం కల్పిస్తూ భూగర్భ జలాలను పెంపొందించడంలో సహాయపడతాయని, కుటుంబాల ఆర్థిక భారం తగ్గిస్తాయన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడుతాయని, రాబోయే తరాలకు ప్రకృతి సంపదను అందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అఫ్ హైదరాబాద్ మావేరిక్స్ కార్యదర్శి పగడాల భార్గవి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, రోటరీ క్లబ్ మాజి అధ్యక్షులు సురేష్ బాబు, ఉపాధ్యక్షులు మాధవి, ప్రాజెక్ట్ డైరెక్టర్ సీత ఆనంద్, మెంబర్షిప్ డైరెక్టర్ శేఖర్ గోగినేని, డైరెక్టర్ విజయ లక్ష్మి, డైరెక్టర్ మెంటల్ హెల్త్ వర లక్ష్మి, వాసిరెడ్డి నాగేశ్వరరావు, డైరెక్టర్ లిటరసీ, సతీష్, ప్రసన్న, మధుసూదన్ రావు, రత్నాకర్, సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్, సహాయ కార్యదర్శి కేతారాజు నర్సింహా, స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## హరీశ్ రావు పాదయాత్ర ఉనికి కోసమే.. ఆరోపణలు అవాస్తవం

### టీపీసీసీ కార్యదర్శి, నంగునూరు మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగి

జిల్లా ప్రతినిధి సిద్దిపేట, జూలై 20: మాజీ మంత్రి హరీశ్ రావు నిన్న సిద్దిపేటలో చేపట్టిన పాదయాత్ర ఉనికిని చాటుకునేందుకు నిర్వహించిన రాజకీయ కార్యక్రమమేనని టీపీసీసీ కార్యదర్శి, నంగునూరు మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి అన్నారు.సోమవారం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రంతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రభుత్వంపై హరీశ్ రావు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని మండిపడ్డారు.పాదయాత్రకు ప్రజలను రూ.500 నుంచి రూ.1,500 వరకు చెల్లించి తరలించారని, రైతుల పేరుతో పార్టీ కార్యకర్తలనే సమీకరించారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల హామీలను అమలు చేస్తున్నప్పటికీ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.ఎల్‌నినో వంటి ప్రకృతి వైపరీత్యాలను ప్రభుత్వ వైఫల్యంగాచిత్రీకరించడం బాధ్యతారాహిత్యమని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ లోపాలు ఎందుకు వచ్చాయో బీఆర్ఎస్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.సిద్దిపేటలో ఎన్ని ఎకరాలకు సాగునీరు అందించారో, కాలువల నిర్మాణం ఎందుకు పూర్తి కాలేదో హరీశ్ రావు ప్రజలకు వివరించాలని కోరారు.రానున్న మున్సిపల్, శాసనసభ ఎన్నికల్లో సిద్దిపేటలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని,మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించి మంత్రి కూడా అవుతారని పేర్కొన్నారు.హరీశ్ రావు అనవసర విమర్శలుమానుకోవాలని, ప్రజలను, కార్యకర్తలను కూలీలుగా చూడొద్దని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాకి ఆనంద్,సిద్దిపేట జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ తప్పెట శంకర్, మంద పాండు,పుట్ల యేసు, దేవయ్య, బయ్యారం యాదగిరి, ఐలేని యాదగిరి గౌడ్, శంకర్ గౌడ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు

## పంట కాలువలపై రిటర్నింగ్ వాల్ నిర్మాణం

***- మంత్రి ఆదేశాలతో కంట్రాక్టర్‌పై కేసు నమోదు***

అంబేద్కర్,జులై 20 :జిల్లాలోని ముక్కామల నడిపూడి మధ్య నేదునూరు పెదపాలెం వద్ద ప్రధాన పంట కాలువపై రిటర్నింగ్ వాల్ నిర్మించిన కాంట్రాక్టర్, ఆర్ అండ్ బి అధికారిపై అయినవిల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయ్యింది. ఈనెల 17న పంట కాలువలను మంత్రి నిమ్మల రామానాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా పంట కాలువ ద్వారా సాగునీరు సరఫరా కాకుండా అడ్డుగా రిటర్నింగ్ వాల్ నిర్మించారంటూ మంత్రికి రైతులు ఫిర్యాదు చేశారు. దీనిపై నిమ్మల సీరియస్‌గా స్పందించారు.సంబంధిత కాంట్రాక్టర్, అధికారులపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని జలవనరుల శాఖ అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. నిమ్మల ఆదేశాలతో కొత్తపేట ఇరిగేషన్ ఏఈ సాయి పవన్.. అయినవిల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో సుధారామ కన్‌స్టక్షన్స్‌కు చెందిన కాంట్రాక్టర్ పి.పద్మరాజు, ఆర్ అండ్ బి డీఈ నిక్కీ క్రూజ్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# ఉద్రిక్తంగా చలో పార్లమెంట్ పిలుపు

**- సిజెపి కార్యకర్తల రాకతో పార్లమెంట్ వద్ద ఉద్రిక్త**

**- పోలీస్ బారికేడ్లను దాటుకుని వచ్చిన వేలదిమంది**

**- ర్యాలీని అడ్డుకునేందుకు పోలీసుల లాఠీఛార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగం**

న్యూఢిల్లీ,జూలై20 : దేశ రాజధానిలోని జంతర్ మంతర్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నీట్–యూజీ పరీక్షల అక్రమాలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌తో కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద చేపట్టిన 'చలో పార్లమెంట్' కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. సీజేపీ మద్దతు దారులు బారికేడ్లను తోసుకొని పార్లమెంట్‌లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నిం చారు. వారిని అడ్డుకునేందుకు పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించి ఆందోళనకారులను చెదరగొట్టారు. సోమవారం పార్లమెంట్ మార్చ్ సందర్భంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కార్యకర్తలు, మద్దతుదారులు జంతర్ మంతర్ వద్దకు భారీగా చేరుకున్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది విద్యార్థులు కూడా హాజరయ్యారు. దీంతో ఆ ప్రాంతంలో భద్రతా దళాలు పెద్దఎత్తున మోహరించాయి. దీంతో ఢిల్లీలోని పార్లమెంట్ వద్ద హైటెన్షన్ వాతావరణం నెలకొంది. రైసినా రోడ్డు మార్గంలో ఈ ఘటన జరిగింది. పార్లమెంట్‌కు సుమారు 200 మీటర్ల దూరంలో ఆందోళనకారుల్ని పోలీసులు అడ్డుకున్నారు. జంతర్ మంతర్ నుంచి సీజేపీ.. పార్లమెంట్ మార్చ్ చేపట్టిన విషయం తెలిసిందే. ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా వద్ద ఆందోళనకారులపై టియర్ గ్యాస్ ప్రయోగించారు. సీజేపీ కార్యకర్తలను చెదరగొట్టే ఉద్దేశంతో టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు. సన్‌సద్ మార్గ్ రోడ్డులో వస్తున్న ఆందోళనకారుల్ని కూడా పోలీసులు



అడ్డుకున్నారు. సన్‌సద్ మార్గ్ పోలీసు స్టేషన్ వద్ద బారికేడ్లు పెట్టి నిరసనకారుల్ని ముందుకు కదలకుండా చేశారు. అయినా తోసుకుని రావడంతో భద్రతా బలగాలు లాఠీఛార్జ్ చేశాయి. ఆ ఘర్షణలో కొందరు ఆందోళనకారులు గాయపడ్డారు. సైట్ వద్దే వారికి ప్రథమ చికిత్స అందించారు. వికాస్ మార్గ్‌లోని ఐటీవో వద్ద కూడా నిరసనకారులను బ్లాక్ చేశారు. ఐటీవో, సెంట్రల్ ఢిల్లీ రూట్లో ఇది కీలకమైన ప్రదేశం. పార్లమెంట్, జంతర్ మంతర్ ఈ మార్గంలోనే ఉన్నాయి. పార్లమెంట్ స్ట్రీట్ వద్ద వేల సంఖ్యలో సీజేపీ కార్యకర్తలు చేరుకున్నారు. వారిపై లాఠీఛార్జ్ జరిగినట్లు తెలుస్తోంది. బారికేడ్లను తొలగించేందుకు నిరసనకారులు ప్రయత్నించారు. పోలీసులకు, సీజేపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. సుమారు 15 మంది ఆందోళనకారు లను అదుపులోకి తీసుకున్నారు. ర్యాలీ ప్రారంభమైన వెంటనే నిరసనకారులను భద్రతా బలగాలు అడ్డుకున్నాయి. ఈ సందర్భంగా భద్రతా సిబ్బంది, సీజేపీ కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో వారిని చెదరగొట్టేందుకు భద్రతా దళాలు లాఠీఛార్జ్ చేశాయి. పలువురిని అరెస్టు చేశారు. మరోవైపు, ఇప్పటికే పార్లమెంట్‌కు వెళ్లే అన్ని మార్గాలను అధికారులు మూసివేశారు. జంతర్ మంతర్‌తో పాటు పటేల్ చౌక్, పార్లమెంట్ స్ట్రీట్, రైల్ భవన్ ప్రాంతాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఐదు మెట్రో స్టేషన్లను కూడా మూసివేశారు. అలాగే సెంట్రల్ ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో మొబైల్ ఇంటర్నెట్‌ను నిలిపివేశారు. పార్లమెంట్ సమావేశాల ప్రారంభం రోజున తలపెట్టిన ఈ మార్చ్‌కు పోలీసులు అనుమతి నిరాకరించారు. ఎక్కడికక్కడ విద్యార్థులను అడ్డుకొనేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినప్పటికీ.. భారీ సంఖ్యలో నిరసనకారులు బారికేడ్లను దాటుకొని పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. దాంతో వారిని చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జి చేశారు. భాష్పవాయువు గోళాలను ప్రయోగించారు. కొందరిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో పలువురు పోలీసులకు గాయాలైనట్లు సమాచారం.

# భాస్కర్ హత్య కేసులో నిందితులకు కఠిన శిక్ష తప్పదు

**-ఉప్పరపెల్లిలో బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు.**

**-చిత్రపటానికి నివాళులు. కుటుంబానికి ఆర్థిక చేయూత**

**-ప్రభుత్వం తరపున అన్ని విధాల అండగా ఉంటామని భరోసా.**



వరంగల్ జిల్లా ప్రతినిధి జూలై20(విజన్ ఆంధ్ర); హైదరాబాద్ మాధాపూర్‌లో దారుణ హత్యకు గురైన వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఉప్పరపెల్లి గ్రామానికి చెందిన సీనపెల్లి భాస్కర్ కుటుంబాన్ని సోమవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు పరామర్శించారు. మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అయూబ్‌తో కలిసి భాస్కర్ నివాసానికి చేరుకున్న ఎమ్మెల్యే, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి,కుటుంబంలో ఒకరికి అంగన్వాడీ టీచర్ కానీ, లేక ఏదోఒక ప్రభుత్వ ఉద్యోగం అందించుటకు కానీ, ఎక్స్ గ్రేషియా తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని,అన్నారు.వ్యక్తిగతంగా ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, భాస్కర్ హత్య అత్యంత దారుణమని, నిందితులు ఎంతటి వారైనా చట్టం ముందు నిలబెట్టి కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.దళితులపై జరుగుతున్న దాడులు సమాజానికి మచ్చ అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి అమానుష ఘటనలు పునరావృతం కాకుండా నేరస్తులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న యువకుడిని కోల్పోవడం తల్లిదండ్రులకు తీరని వేదన అని పేర్కొన్న ఎమ్మెల్యే, ఆ బాధను ఎవరూ భర్తీ చేయలేరన్నారు. ప్రభుత్వం తరపున అన్ని విధాలా అండగా నిలుస్తామని, అవసరమైన సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మనుషులుగా పుట్టిన తర్వాత మరో మనిషి ప్రాణం తీసే హక్కు ఎవరికీ లేదని, కుల విద్వేషాలకు సమాజంలో తావు ఉండకూడదని పిలుపునిచ్చారు.ఎమ్మెల్యే రాకతో గ్రామంలో భావోద్వేగ వాతావరణం నెలకొంది. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించగా, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు వారిని ఓదార్చారు. భాస్కర్‌కు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అయూబ్, వర్ధన్నపేట మార్కెట్ కమిటీ చైర్మన్ నరకుడు వెంకటయ్య, ఐనవోలు దేవస్థాన చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, మాజీ సర్పంచ్ మరుపట్ల సాయికుమార్, మాజీ ఎంపీటీసీ సూరారపు నిరంజన్, దళితరత్న అవార్డు గ్రహీత సీనపెల్లి కొమురయ్య,తుళ్ళ రవి, సమయ్య,శ్రీపాద సతీష్, నాంపల్లి యాదగిరి, బిర్రు మహేందర్ మాదిగ, విజయ్ మాదిగ, జక్కి గోపాల్ మాదిగ, గోలి సుధాకర్ మాదిగ, నాంపల్లి మలేష్ మాదిగ, సీనపెల్లి రాజు, కొండేటి బాలకృష్ణ, ఎర్ర శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# సరికొత్త ఆలోచనలు, ఆవిష్కరణలకు వేదికగా. "స్టార్ట్ అప్ కడప"

**- జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**



కడప,జూలై 20 (విజన్ ఆంధ్ర)సరికొత్త ఆలోచనలు, ఆవిష్కరణలకు వేదికగా జిల్లా యువతను పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రూపుదిద్దుకుంటున్న "స్టార్ట్ అప్ కడప" ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సెంటర్ త్వరలో ప్రారంభానికి సిద్ధమవుతోందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు.సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావనతో కలిసి దాదాపు పూర్తి కావచ్చిన నిర్మాణ పనులను పరిశీలించారు. భవనం బాహ్య నిర్మాణ పనులను వారంలోపు పూర్తి చేసి, వెంటనే అంతర్గత సదుపాయాల ఏర్పాటును వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా పనులు పూర్తి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.ప్రతి ఇంటి నుంచి ఒక స్టార్టప్ ఆవిర్భవించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా "స్టార్ట్ అప్ కడప" రూపుదిద్దు కుంటోందన్నారు.ఇది కేవలం ఒక భవనం కాదని యువత ఆలోచనలకు, ఆవిష్కరణలకు, కొత్త వ్యాపారాల ఆరంభానికి బలమైన వేదికగా నిలవబోతోందని చెప్పారు. ఈ కేంద్రం ద్వారా స్టార్టప్ వ్యవస్థాపకులు, ఫ్రీలాన్సర్లు, చిన్న, మధ్యతరహా వ్యాపార సంస్థలకు అవసరమైన మార్గదర్శకత్వం, ఆధునిక సదుపాయాలు, ప్రోత్సాహం లభిస్తాయని తెలిపారు. కడపను పారిశ్రామిక అవకాశాల కేంద్రంగా తీర్చిదిద్దడంలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందన్నారు.నిర్మాణ పనుల పరిశీలనలో కేఎంసీ కమిషనర్ భవానీ ప్రసాద్, హౌసింగ్ ఇంజనీర్లు, ఏడీపీ యంగ్ ప్రొఫెషనల్స్ తదితరులు పాల్గొన్నారు.

# మారుతీనగర్,ఆఫీసర్స్ కాలనీ పార్కు స్థలాన్ని పరిరక్షించాలి

**-అధికారుల హామీతో బీజేపీ నిరసనకు ఫలితం**

**-స్థానిక తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి**



ఎల్బీనగర్, జూలై 20 (విజన్ ఆంధ్ర): ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని బి.ఎన్.రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని మారుతీనగర్, ఆఫీసర్స్ కాలనీకి చెందిన పార్కు స్థలాన్ని అక్రమంగా కబ్జా చేసి భవన నిర్మాణం చేపడుతున్నారని స్థానిక ప్రజలు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తగిన చర్యలు తీసుకోకపోవడంతో పూర్తిగా విఫలం చెందారని బిజెపి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా ఎల్బీనగర్ అసెంబ్లీ బీజేపీ పార్టీ ఇంచార్జ్ సామ రంగారెడ్డి, బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్ కార్యాలయం ఎదుట వినూత్న రీతిలో "వంటావార్పు" కార్యక్రమంతో భారీ ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... గత కొన్ని రోజులుగా పార్కు స్థల ఆక్రమణపై అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ స్పందన లేకపోవడం పట్ల బీజేపీ నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ నాయకుల నిరసనకు స్పందించిన అధికారులు వెంటనే అక్కడికి చేరుకుని, పార్కు స్థలాన్ని పరిరక్షిస్తామని, అక్రమంగా కబ్జా చేసి భవన నిర్మాణం చేపట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు.అనంతరం పార్కు స్థలాన్ని జెసిపి సహాయంతో శుభ్రం చేయడం జరుగుతుందన్నారు. కాలనీ ప్రజలకు ఎంతో అవసరమైన పార్కు స్థలాన్ని కాపాడేందుకు నిరంతరం కృషి చేసిన ఎల్బీనగర్ అసెంబ్లీ ఇంచార్జ్ సామ రంగారెడ్డి, తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలకు కాలనీవాసులు తమ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు, హస్తినాపురం అధ్యక్షులు మల్లేష్ గౌడ్, రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ మెంబర్ శ్రీధర్ రావు, సీనియర్ నాయకులు అంజన్ కుమార్ గౌడ్, విజయ్ కుమార్, నూతి శ్రీనివాస్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ప్రేమ్ నాథ్, విష్ణువర్ధన్ రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షులు మహేష్ గౌడ్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భార్గవ్ తేజ, మహిళా నాయకురాలు కవితా రెడ్డి, బీజేపీ నాయకులు శంకరయ్యగౌడ్, భూపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రవి శంకర్, కృష్ణారెడ్డి, సంగమేశ్వర్, శ్రీనివాసరావు, కిషోర్, విజయ్ కుమార్, నరసింహ, సిద్దేశ్వర్, రఘువీర్, గిరి, దుర్గా, వినోద్, కాలనీ మారుతి నగర్ అధ్యక్షులు దుర్గాప్రసాద్, ఆఫీసర్స్ కాలనీ అధ్యక్షులు బాలాజీ, వెంకట్ రెడ్డి, నాయుడు, శ్రీనివాస్, అనిల్ కుమార్ కాలనీ సభ్యులు అరుణ, దుర్గ, స్వాతి, సత్య, ఉమా, శారద, బిందు, సత్యవేణి, మాధవి, భార్గవి, యాదమ్మ, సుచిత్ర, సరిత, ప్రసన్న, అశ్విని, సునీత, శ్రీ మాల, మహేశ్వరి, రమ్య, నాగలక్ష్మి, శారద తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమంలా 'తెలంగాణ జలసిరి' కార్యక్రమం చేపట్టాలి

**- ఊరూరా ఇంకుడుగుంతలు, ఊట కుంటలు నిర్మించాలి - కలెక్టర్ చిత్రా మిశ్రా**



కరీంనగర్(విజన్ ఆంధ్ర బ్యూరో), జూలై 20: ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'తెలంగాణ జలసిరి' కార్యక్రమాన్ని ఉద్యమంలా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులకు పిలుపునిచ్చారు. వీబీజీ రామ్-జీ (వి బి జి -ఆర్ ఏ ఎమ్ జి) పథకం కింద గ్రామాల్లో ఇంకుడుగుంతలు, ఊట కుంటలు, పంట కుంటలు, బోరు బావుల రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణి సమావేశ మందిరంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ జలసిరి పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ అనిల్ కుమార్, అదనపు కలెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, అశ్విని తానాజీ వాకడే, డీపీఓ జగదీశ్వర్, డీఆర్డీఓ గీతతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని కోరారు. రానున్న రోజుల్లో నీటి కొరతను ఎదుర్కొనేందుకు ప్రతి వర్షపు చుక్కను భూమిలోకి ఇంకించి భూగర్భ జలాలను పరిరక్షించాలని అన్నారు. వీబీజీ రామ్-జీ పథకం కింద ప్రభుత్వం ఇంకుడుగుంతలు, పంట కుంటలు, ఊట కుంటలు, బోరు బావుల రీఛార్జ్ వంటి నీటి సంరక్షణ పనులు చేపడుతోందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణ, సహజ వనరుల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, స్థిరమైన గ్రామాభివృద్ధి లక్ష్యంగా వీబీజీ రామ్-జీ కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో అమలు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పంచాయతీరాజ్, వ్యవసాయ, ఉద్యానవన, భూగర్భ జలాలు, గనులు-భూగర్భ శాస్త్రం, మత్స్య, ప్రణాళిక, విద్యుత్ శాఖలతో పాటు స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణం) అధికారులు పరస్పర సహకారంతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డ్ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

***పారిశుధ్య పనులను స్వయంగా పర్యవేక్షించిన ఏఎంసీ చైర్మన్ లాల్ సింగ్ నాయక్***




కొత్తగూడెం బ్యూరో, జూలై 20(విజన్ ఆంధ్ర) : రైతులు, వ్యాపారులు నిత్యం రాకపోకలు సాగించే మార్కెట్ యార్డును పరిశుభ్రంగా ఉంచేందుకు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ లాల్ సింగ్ నాయక్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. సోమవారం మార్కెట్ యార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు మార్కెట్ యార్డ్ షాపింగ్ కాంప్లెక్స్ పరిసరాల్లో చేరి, వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించడంతో పాటు దుకాణాలకు వెళ్లే మార్గాలు కూడా దెబ్బతింటున్నాయని ఆయన పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించి, కాలువలను శుభ్రపరచడం, పిచ్చి మొక్కలను తొలగించడం, చెత్త సేకరణను వేగవంతం చేయాలని సంజయ్‌నగర్ సర్పంచ్ తాటి బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లుకు సూచించారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని దోమలు, ఈగలు వ్యాప్తి చెందకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, డ్రైనేజీల్లో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రత పనులు నిర్వహించాలని మార్కెట్ యార్డు సిబ్బందిని ఆదేశించారు.రైతులు తమ పంటలను విక్రయించేందుకు మార్కెట్‌కు వచ్చే సమయంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం తమ ప్రధాన బాధ్యత అని లాల్ సింగ్ నాయక్ తెలిపారు. మార్కెట్ యార్డు పరిశుభ్రంగా ఉంటే రైతులతో పాటు వ్యాపారులకు కూడా అనుకూల వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. పరిశుభ్రమైన మార్కెట్ యార్డు ద్వారా రైతులు, వ్యాపారులకు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని ఏఎంసీ చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి, ఏఎంసీ సిబ్బంది, పంచాయతీ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

# వర్షపు ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టాలి..

**- భవిష్యత్తు నీటి భద్రతకు ఇప్పుడే చర్యలు: కలెక్టర్ గరిమ అగ్రవాల్**



రాజన్న సిరిసిల్ల, జూలై 20 (విజన్ ఆంధ్ర బ్యూరో): వర్షాభావ పరిస్థితులు, ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని వర్షపు ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టి భవిష్యత్తు తరాలకు నీటి భద్రత కల్పించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో వీబీజీ రాంజీ, తెలంగాణ పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన "తెలంగాణ జలసిరి" అవగాహన పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో ఇంకుడు గుంతలు, పంటకుంటలు (ఫామ్ పాండ్స్), ఊటకుంటలు (పర్కొలేషన్ ట్యాంకులు), బోరు బావుల రీచార్జ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీటిని వృథా కాకుండా భూగర్భ జలాల పెంపునకు వినియోగించడం ద్వారా భవిష్యత్తులో నీటి కొరతను అధిగమించవచ్చని పేర్కొన్నారు. ప్రజలందరూ నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని, ప్రతి చుక్కను ఆదా చేయడం సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి జయశీల, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సౌజన్య, మిషన్ భగీరథ ఈఈలు అన్వర్, సుమలత, వ్యవసాయ, నీటిపారుదల శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎనుగల్లులో 2 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ సింక్రనైజేషన్ విజయవంతం




వరంగల్ జిల్లా ప్రతినిధి జూలై20(విజన్ ఆంధ్ర); వరంగల్ జిల్లాలోని పర్వతగిరి మండల కేంద్రంలోని ఎనుగల్లు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన బోయినపల్లి మురళీధర్ రావుకు చెందిన 2 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ సింక్రనైజేషన్ ప్రక్రియ సోమవారం సాయంత్రం విజయవంతంగా పూర్తయింది.ఎన్పీడీసీఎల్ ఉన్నతాధికారుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. చీఫ్ ఇంజనీర్ వెంకటరమణ వరంగల్ ఆపరేషన్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఆనంద్ లు ఈ గ్రిడ్ సింక్రనైజేషన్‌ను అధికారికంగా ప్రారంభించారు. ఈ ప్రక్రియ విజయవంతం కావడంతో ప్లాంట్ నుండి గ్రిడ్‌కు విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ప్రారంభమైందని పర్వతగిరి ఆపరేషన్ ఏడీఈ తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. ప్లాంట్ ప్రారంభం పట్ల అధికారులు, నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిఈలు దానయ్య,హర్జా నాయక్, ఎనుగల్లు ఏఈ శివకుమార్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# రైలు ప్రమాద బాధితుడికి 108 సిబ్బంది సత్వర సేవలు

**-ప్రథమ చికిత్స అనంతరం ఎంజీఎం ఆస్పత్రికి తరలింపు.**

**-ఈఎన్ టీ నాగరాజు, పైలట్ సాంబయ్య సేవలకు ప్రయాణికుల ప్రశంసలు.**



వరంగల్ జిల్లా ప్రతినిధి జూలై20(విజన్ ఆంధ్ర); వరంగల్ రైల్వే స్టేషన్‌లో సోమవారం జరిగిన ప్రమాదంలో గాయపడిన ఓ ప్రయాణికుడికి 108 అత్యవసర వైద్య సిబ్బంది సకాలంలో స్పందించి ప్రాణాపాయం నుంచి కాపాడారు. బీహార్ రాష్ట్రం, చంపరన్ జిల్లా, రతన్మాలా మండలం, కొధ్వ గ్రామానికి చెందిన టకేశ్వర్ కుమార్ (తండ్రి: ధ్వరిక్ మెహత) హైదరాబాద్ వైపు రైలులో ప్రయాణిస్తున్నాడు. వరంగల్ రైల్వే స్టేషన్‌లో రైలు ఆగిన సమయంలో నీటి సీసా తీసుకురావడానికి ప్లాట్‌ఫామ్‌పై దిగిన టకేశ్వర్ కుమార్, తిరిగి రైలు ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి ప్లాట్‌ఫామ్‌కు, రైలుకు మధ్య చిక్కుకుని తీవ్రంగా గాయపడ్డాడు. ఘటనను గమనించిన తోటి ప్రయాణికులు వెంటనే 108 అత్యవసర సేవలకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే 108 ఈఎన్ టీ నాగరాజు, పైలట్ సాంబయ్య ఘటనాస్థలికి చేరుకుని బాధితుడికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అత్యంత వేగంగా స్పందించి వృత్తి ధర్మాన్ని చాటుకున్న 108 సిబ్బంది సేవలను తోటి ప్రయాణికులు అభినందిస్తూ, వారి అప్రమత్తత వల్ల బాధితుడికి సకాలంలో వైద్యం అందిందని ప్రశంసించారు.

# వీకర్ సెక్షన్ కాలనీ ప్రజలకు తాగునీరు అందించరా!!

**-తాగునీటికే బిందెలతో మహిళల నిరసన**

**-ప్రభుత్వ అధికారుల తీరుపై మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి**

ఎల్బీనగర్ జూలై 20 (విజన్ ఆంధ్ర): ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వ బాధ్యత, కాళీ బిందెలతో నిరసన చేయాల్సిన పరిస్థితి రావడం పాలకుల వైఫల్యానికి నిదర్శనం ఎల్బీనగర్ నియోజకవర్గం మన్సూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి అసహనం వ్యక్తం చేశారు. సోమవారం మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని వీకర్ సెక్షన్ కాలనీలో నెలకొన్న తీవ్ర త్రాగునీటి సమస్యను స్థానికులు మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి దృష్టికి తీసుకురావడంతో ఆయన వెంటనే కాలనీని సందర్శించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులను కాలనీవాసులు వివరించగా, తమ ఆవేదనను వ్యక్తం చేస్తూ అసలే ఇంటి బోర్లు అన్ని ఎండిపోయాయని త్రాగునీరు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాళీ బిందెలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ.. వీకర్ సెక్షన్ కాలనీలో ఇండ్లకు సంబంధించిన బోర్లు అన్ని ఎండిపోయాయని, నీరు లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నా విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు అనుగుణంగా మంచినీరు సరఫరా చేయాల్సింది పోయి ప్రజలు కాళీ బిందెలతో రోడ్డెక్కాల్సిన పరిస్థితి రావడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం అని ఆయన తీవ్రంగా విమర్శించారు. తాగునీటి ఇబ్బందులపై హెచ్ఎండబ్ల్యూఎస్ ఎస్ బి అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, వీకర్ సెక్షన్ కాలనీలో తీవ్రంగా ఉన్న త్రాగునీటి సమస్యను వివరించి అత్యవసరంగా వాటర్ ట్యాంకర్లను పంపించాలని, అలాగే సరిపడా త్రాగునీటి సరఫరా జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2013 సంవత్సరంలో రూ.5 లక్షల వ్యయంతో స్థానిక ప్రజలకు స్వచ్ఛమైన మినరల్ వాటర్ అందించేందుకు ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ప్రస్తుతం నిరుపయోగంగా ఉండడం విచారకరమని, వెంటనే దానిని పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు. త్రాగునీటి సమస్య మన్సూరాబాద్ డివిజన్ అంతటా ఉందని, నిరుపయోగంగా ఉన్న పవర్ బోర్లు, హ్యాండ్ పంపులు వెంటనే రిపేర్ చేయించాలని డిమాండ్ చేసి త్రాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీ వాసులు కాసాని అశోక్ యాదవ్, పరమేష్ యాదవ్, గోనెల స్వామి, మల్లేష్, యాదగిరి, రాములు, రాజశేఖర్ రెడ్డి, చందర్,వనమ్మ, దమయంతి, ప్రేమలత, లక్ష్మి, అరుణ, ప్రభావతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



# త్వరితగతిన డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పూర్తి చేయాలి

**-హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి**

ఎల్బీనగర్, జూలై 20 (విజన్ ఆంధ్ర): ఎల్బీనగర్ నియోజకవర్గం ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ కాలనీ నుండి పద్మావతి కాలనీ వరకు సోమవారం ప్రారంభమైనటువంటి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్ లైన్ పనులను హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి వర్షాకాలంలో వర్షపు నీరు రోడ్లపై నిల్వ ఉండి స్థానిక ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలనే లక్ష్యంతో రూ.49 లక్షల నిధులు మంజూరై, 600 ఎంఎం డయా స్టార్మ్ వాటర్ డ్రైనేజ్ పైప్‌లైన్ నిర్మాణ పనులు ప్రారంభం కావడం సమస్యల పరిష్కారానికి దోహదపడిందన్నారు. తాను కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో ప్రజల ఇబ్బందులను ప్రత్యక్షంగా గుర్తించి, శ్రీనివాస్ కాలనీ, పద్మావతి కాలనీ ప్రాంతాల్లో నీటి నిల్వ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశ్యంతో ఈ పనులకు ప్రత్యేకంగా కృషి చేసి రూ.49 లక్షల నిధులు మంజూరు చేయించామని తెలిపారు. అభివృద్ధి పనులు ఆలస్యమైనప్పటికీ, ఇప్పుడు ప్రారంభం కావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ప్రజలకు ఉపయోగపడే ప్రతి అభివృద్ధి కార్యక్రమం పూర్తయ్యే వరకు తన వంతు బాధ్యతగా నిరంతరం పర్యవేక్షిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇరు కాలనీలా సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నీనో ప్రభావ తీవ్రతను తగ్గించేందుకు
# అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

**- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్ల సమీక్షా సమావేశంలో ఉమ్మడి జిల్లాల ప్రత్యేక అధికారి ఇలంబర్తి....**

ఆదిలాబాద్ జిల్లా.జులై 20 (విజన్ ఆంధ్ర) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎల్‌నీనో ప్రభావం నేపథ్యంలో ఏర్పడే పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్పెషల్ ఆఫీసర్ ఇలంబార్తి అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్ సమావేశ మందిరంలో ఎల్‌నీనో ప్రభావ తీవ్రతను తగ్గించేందుకు రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రణాళికా విభాగం జిల్లా ప్రణాళికా అధికారి, వ్యవసాయ శాఖ జిల్లా వ్యవసాయ అధికారి, ఉద్యానవన శాఖ జిల్లా ఉద్యానవన అధికారి, నీటిపారుదల శాఖ ఎస్ఈ, ఈఈలు, భూగర్భ జల శాఖ జిల్లా అధికారి, శక్తి విభాగం టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ, డీఈలు, పురపాలక పరిపాలన అధికారులు, పంచాయతీరాజ్ శాఖ ఈఈ, సీఈవో, పీఆర్ అధికారులు, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి, కేవీకే/ఐసీఏఆర్ వ్యవసాయ శాస్త్రవేత్తలు, మిషన్ భగీరథ అధికారులు, అటవీ శాఖ డీఎఫ్‌వో, సివిల్ సప్లైస్ డీసీఎస్‌వో, వైద్యారోగ్య శాఖ డీఎంహెచ్‌వో, డీసీహెచ్ఎస్, మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి ఇలంబర్తి మాట్లాడుతూ ఎల్‌నీనో ప్రభావాన్ని ఎదుర్కోవడంలో ప్రతి శాఖ కీలక పాత్ర పోషించాలని అన్నారు. వర్షాభావ పరిస్థితులు, తాగునీటి సమస్యలు, వ్యవసాయ రంగంపై ప్రభావం వంటి అంశాలను ముందుగానే అంచనా వేసి శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తే తీవ్రతను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ప్రతి శాఖ తమ కార్యాచరణ ప్రణాళికను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.




మంచిర్యాల శాసనసభ్యులు ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ ఈ అంశాన్ని రాజకీయ కోణంలో కాకుండా ప్రజల సంక్షేమ దృక్పథంతో చూడాల్సిన అవసరం ఉందన్నారు. రైతులకు శాస్త్రీయ అవగాహన కల్పించేందుకు మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఆగస్టు వరకు వర్షాలు వచ్చే అవకాశమున్నందున రైతులు పెసర్లు, కందులు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. పోడు భూముల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అటవీ హక్కుల చట్టం (ఫ్రా) కింద హక్కులు పొందిన రైతులకు రైతు భరోసా నిధులు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఖానాపూర్ శాసనసభ్యులు వెడమ బొజ్జు పటేల్ మాట్లాడుతూ సమావేశంలో అన్ని శాఖల అధికారులు విలువైన సూచనలు చేశారని అన్నారు. అయితే పోడు భూముల సమస్యలపై చర్చ జరుగుతున్న సమయంలో అటవీ శాఖ అధికారులు గైర్హాజరు కావడం విచారకరమన్నారు. ఈ సమస్యను ప్రాధాన్యతగా తీసుకొని సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ పోడు భూముల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ప్రస్తుతం సాగు చేస్తున్న రైతులు యూరియా ఎరువుల పంపిణీ కోసం తప్పనిసరిగా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. రైతులకు అవసరమైన వ్యవసాయ సేవలు, ఎరువులు, విత్తనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరిత మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తే ఎల్‌నీనో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని పేర్కొన్నారు.

ప్రజల్లో అవగాహన పెంచేందుకు మీడియా ముఖ్యమైన పాత్ర పోషించాలని, ప్రభుత్వ సూచనలు ప్రతి గ్రామానికి చేరేలా ప్రచారం నిర్వహించాలని కోరారు. నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు, వర్షపు నీటి సంరక్షణ చర్యలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. భూగర్భ జలాల సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ గ్రామీణ ప్రాంతాల్లో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే చర్యలను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు తమ శాఖల తరఫున ఎల్‌నీనో ప్రభావాన్ని తగ్గించేందుకు చేపట్టనున్న కార్యాచరణ ప్రణాళికలను వివరించారు. వ్యవసాయం, ఉద్యానవనం, తాగునీరు, విద్యుత్, పశుసంవర్ధక, ఆరోగ్యం, అటవీ, పంచాయతీరాజ్, పురపాలక, మహిళా శిశు సంక్షేమ తదితర రంగాల్లో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమగ్రంగా చర్చించారు. ఎల్‌నీనో ప్రభావం వల్ల తలెత్తే సవాళ్లను ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు అవసరమైన సేవలను నిరంతరం అందించాలని సమావేశంలో స్పెషల్ ఆఫీసర్, కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి మందమకరందు, ఉమ్మడి జిల్లాల అడిషనల్ కలెక్టర్ లు, అధికారులు పాల్గనారు.

## ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హెమంత కేశవ్ పాటిల్



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి ( విజన్ ఆంధ్ర), జులై 20 : అర్హులైన ప్రతి ఓటరు వివరాలు నమోదు కావాలి, ఆగస్టు3లోగాఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించాలని సూచననాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని బిజినపల్లి మండలం వట్టెం గ్రామంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) డిజిటలైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ హెమంత కేశవ్ పాటీల్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిజిటలైజేషన్ ప్రక్రియ పురోగతిని పరిశీలించిన ఆయన, అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులతో మాట్లాడి చేపడుతున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ......, ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను ఎలాంటి లోపాలకు తావులేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఓటరికి ఈ ప్రక్రియపై సమగ్ర అవగాహన కల్పించాలని, ఆగస్టు 3వ తేదీలోగా ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించని వారి వివరాలు ఓటర్ల జాబితాలో నమోదు కాకపోవచ్చనే విషయాన్ని ప్రతి ఓటరికి స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా నమోదు ప్రక్రియకు దూరం కాకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు అవసరమైన సమాచారం అందిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు డిజిటలైజేషన్ ప్రక్రియలో తప్పనిసరిగా నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా, అనర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో కొనసాగకుండా చూడడంతో పాటు, ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటరు నమోదు (డూప్లికేట్ నమోదు) జరగకుండా అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా, ఖచ్చితత్వంతో రూపొందేలా ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతంగా, సమర్థవంతంగా పూర్తి చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ వెంట నాగర్‌కర్నూల్ ఆర్డీవో అర్చన, బిజినపల్లి తహసీల్దార్ మునీరుద్దీన్, ఎంపీడీవో, బీఎల్‌వోలు, డిజిటలైజేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్న అధికారులు తదితరులు ఉన్నారు.

## కెరమెరి మండలంలో సర్ ప్రక్రియను పరిశీలించిన డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క.

**- బీఎల్‌ఏలు గడపగడపకు తిరిగి సర్ ప్రక్రియను పర్యవేక్షించాలి.**



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జులై 20.(విజన్ ఆంధ్ర) : కొమురం భీం అసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని దేవాపూర్, తుమ్మగూడ, అనార్‌పల్లి గ్రామాల్లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్ఏలు,స్థానిక కాంగ్రెస్ నాయకులతో సమావేశమై ప్రక్రియ పురోగతిపై సమీక్ష నిర్వహించారు.అనంతరం ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ..బీఎల్ఏలు తప్పనిసరిగా గడపగడపకు తిరిగి ప్రతి కుటుంబాన్ని కలుసుకొని ఓటర్ల పరిస్థితిని తెలుసుకోవాలని సూచించారు. అర్హులైన ఓటర్లు ఓటు హక్కు కోల్పోకుండా అవసరమైన ఫారాలు నింపించడంతో పాటు, ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు పార్టీ నాయకులు ప్రజల మధ్యే ఉండి ప్రతి అర్హుడైన ఓటరికి న్యాయం జరిగేలా పనిచేయాలని తెలిపారు.ప్రతి గ్రామం, ప్రతి బూత్‌లో బీఎల్ఏలు, అబ్జర్వర్లు, మండల కోఆర్డినేటర్లు, కాంగ్రెస్ నాయకులు సమన్వయంతో పనిచేసి సర్ ప్రక్రియను విజయవంతం చేయాలని సుగుణక్క పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో దేవాపూర్ సర్పంచ్ అముల్, కుంరం భీంరావు, మండల దీూా అబ్జర్వర్ సుజాయిద్ ఖాన్, దీూా అబ్జర్వర్ రాథోడ్ దేవీదాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాజిద్ దేశ్‌ముఖ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదు దారుల నుండి 10 ఫిర్యాదులను స్వీకరించిన జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్.



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): జులై 20 పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డా.సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట ్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు సూచనలు చేశారు. సోమవారం నాడు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి వచ్చిన 10 అర్జీలలో భూమికి సంబంధించిన అర్జీలు 05, తగు న్యాయం సంబంధించిన అర్జీలు 03, భార్య భర్తల గొడవలు 02 ,స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ కి పరిష్కారానికి సూచనలు చేయడం జరిగింది. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీస్ సేవల్ని వినియోగించుకుంటూ,వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని జిల్లా సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ తెలియజేశారు.

## తరగతులకు క్రమం తప్పకుండా హాజరై ప్రణాళికాబద్ధంగా చదవాలి

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

వేములవాడ, జూలై 20 (విజన్ ఆంధ్ర బ్యూరో): పదో తరగతి విద్యార్థులు ప్రతిరోజూ తరగతులకు హాజరై ప్రణాళిక ప్రకారం చదువును కొనసాగించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. సోమవారం వేములవాడ పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల వంటశాలను పరిశీలించి పరిశుభ్రత, మెనూ చార్ట్ ప్రకారం భోజనం సిద్ధం చేస్తున్నారా అనే అంశాలను పరిశీలించారు. అనంతరం స్టోర్‌రూమ్‌లో బియ్యం, పప్పులు, గుడ్లు తదితర ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేయడంతో పాటు సంబంధిత రికార్డులను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో సమావేశమైన కలెక్టర్, ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి ఎంతో కీలకమని పేర్కొన్నారు. క్రమం తప్పకుండా తరగతులకు హాజరై రోజువారీ అధ్యయన ప్రణాళిక రూపొందించుకోవాలని, గత సంవత్సరాల ప్రశ్నాపత్రాలను సాధన చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు ప్రతిరోజూ కొంత సమయం ఆటలకు కేటాయించాలని, వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. భోజనం చేసే ముందు, అనంతరం తప్పనిసరిగా చేతులు శుభ్రంగా కడుక్కోవాలని కలెక్టర్ సూచించారు.

# సీసీఐ సాధనే అంతిమ లక్ష్యం

**- చర్చాగోష్ఠిలో వక్తల పిలుపు**



అదిలాబాద్, జులై 20 (విజన్ ఆంధ్ర): ఆదిలాబాద్‌లోని సీసీఐ (సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) పరిశ్రమను పునఃప్రారంభించడమే తమ అంతిమ లక్ష్యమని పలు ప్రజా, కుల మరియు కార్మిక సంఘాల నాయకులు స్పష్టం చేశారు. స్థానిక బాశెట్టి మాధవరావు విజ్ఞాన కేంద్రం (సీఐటీయూ కార్యాలయం)లో సీసీఐ సాధన కమిటీ కో-కన్వీనర్ విజ్జగిరి నారాయణ అధ్యక్షతన "సీసీఐ ప్రస్తుత పరిస్థితులు భవిష్యత్తు కార్యాచరణ"పై చర్చాగోష్ఠి నిర్వహించారు. సమావేశంలో సాధన కమిటీ కన్వీనర్ దర్శనాల మల్లేష్ గత నాలుగేళ్లుగా చేసిన పోరాటాలను వివరించి భవిష్యత్ కార్యాచరణను ప్రవేశపెట్టగా, హాజరైన ప్రతినిధులు దానికి పూర్తి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగురామన్న మాట్లాడుతూ.. సీసీఐ సాధన కోసం అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకు పూనుకుంటానని స్పష్టం చేశారు. సీసీఐ పునరుద్ధరణపై రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే తక్షణమే నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమను తెరిస్తే 80 శాతం ఉద్యోగాలు స్థానికులకే దక్కుతాయని, తద్వారా జిల్లా యువత వలసలు ఆగుతాయని తెలిపారు. అలాగే, అభివృద్ధికి ఉపయోగపడే ఈ అంశంలో స్థానిక ఎమ్మెల్యే కూడా కలిసిరావాలని కోరారు. సమావేశంలో మాట్లాడిన భూ నిర్వాసితులు, వివిధ కుల సంఘాల నాయకులు మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు శివన్న, పద్మశాలి నేత దాసరి రమేష్, దళిత నేత దర్శనాల నగేష్ సీసీఐ పోరాటానికి తమ పూర్తి అండదండలు ఉంటాయని ప్రకటించారు. నాడు భూములు ఇచ్చి నేడు కూలీలుగా మారామని నిర్వాసితులు ఈశ్వర్ దాస్, అరుణ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువతకు, దళిత, బీసీ వర్గాలకు స్థానికంగా ఉపాధి లభించాలంటే సీసీఐ పునఃప్రారంభం అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు. మరోవైపు రిటైర్డ్ ఉద్యోగులు, విద్యార్థి, యువజన, మహిళా మరియు రైతు సంఘాల నాయకులు ఈ ఉద్యమంలో భాగస్వాములవుతామని పిలుపునిచ్చారు. సీఐటీయూ ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ కార్మికులను కదిలిస్తామని చెప్పగా, ఆదివాసీ నేత పూసం సచిన్, మహిళా నేతలు మంజుల, స్వరూప తమ మద్దతు తెలిపారు. కాంగ్రెస్ నేత మునిగేల నర్సింగ్ మాట్లాడుతూ, సీసీఐ పునరుద్ధరణ అంశాన్ని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి సాధన కమిటీతో చర్చలు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

## పత్రికా విలేకరులపై దాడి దారుణం

***బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎస్.ఆర్ రెడ్డి***



నారాయణపేట , జూలై 20 ( విజన్ ఆంధ్ర) : నారాయణపేట జిల్లా కృష్ణ మండలంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న విషయం తెలుసుకొని ఫోటోలు తీసుకునేందుకు అక్కడికి వెళ్లిన విలేఖరి,ఫోటో గ్రాఫర్ పై ఇసుక మాఫియా దాడికి పాల్పడడం అత్యంత బాధాకరమని దారుణమని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛ అత్యంత విలువైన హక్కు అని తెలిపారు. సమాజానికి నిజమైన సమాచారాన్ని అందించేం దుకు విధులు నిర్వహిస్తు న్న పత్రికా విలేకరులపై జరిగిన దాడి అత్యంత బాధాకరమన్నారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలి స్టులపై భౌతిక దాడులు, బెదిరింపులు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. ఈ ఘట నపై సంబంధిత అధికారు లు వెంటనే స్పందించి, దాడికి పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలనీ డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరా వృతం కాకుండా జర్నలిస్టు లకు తగిన భద్రత కల్పించా లని ప్రభుత్వాన్ని, పోలీసు శాఖను కోరారు. పత్రికా స్వేచ్ఛను పరిరక్షించ డం ప్రతి ఒక్కరి బాధ్యత అని జర్నలిస్టులపై దాడుల ను ఏ పరిస్థితుల్లోనూ సహించబోమని, బాధ్యుల పై నిష్పాక్షిక విచారణ జరిపి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# ముందస్తు చర్యలతో ఎల్-నినో ప్రభావాన్ని
# సమర్థవంతంగా ఎదుర్కొందాం

**- ఎల్-నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి**

**- రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి**

**- మెదక్, సంగారెడ్డి జిల్లాల ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై మంత్రి సమీక్ష**




సంగారెడ్డి బ్యూరో , జూలై :20(విజన్ ఆంధ్ర ) : ఎల్-నినో ప్రభావం కారణంగా తలెత్తే ప్రతికూల పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి,మెదక్ జిల్లాలలో ఎల్-నినో ప్రభావ తీవ్రతను తగ్గించేందుకు ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై సోమవారం సంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మెదక్, సంగారెడ్డి జిల్లాల అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎల్-నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు శాఖల వారీగా చేపట్టాల్సిన చర్యలు, ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలు, జిల్లాల వారీ అమలు తీరుపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జహీరాబాద్, సంగారెడ్డి, నారాయణఖేడ్, నర్సాపూర్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఎల్-నినో ప్రభావాన్ని తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎల్-నినో ఒక సహజ ప్రకృతి విపత్తు అని, దీని ప్రభావాన్ని అర్థం చేసుకొని నష్టాన్ని వీలైనంత తగ్గించే దిశగా ముందస్తు ప్రణాళికతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. లోటు వర్షపాతం, నీటి కొరత, పంటలపై ప్రతికూల ప్రభావం వంటి పరిస్థితులను ముందుగానే అంచనా వేసి శాఖల వారీ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు.

వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి, తాగునీటి సరఫరా, భూగర్భ జలాలు, విద్యుత్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఒక ఎకరం వరి సాగుకు అవసరమైన నీటితో నాలుగు ఎకరాల ఆయిల్‌పామ్ లేదా ఎనిమిది ఎకరాల కంది పంట సాగు చేయవచ్చని పేర్కొన్నారు. రైతులు పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలు, అంతర్ పంటల సాగుపై దృష్టి సారించేలా అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.

రైతులకు అవగాహన కల్పించేందుకు వీడియో రీల్స్, నాటక ప్రదర్శనలు, కళాజాతాలు, అన్ని ప్రచార మాధ్యమాలను వినియోగించాలని సూచించారు. జిల్లాలలో పలుచోట్ల కోతుల బెడద ఉన్నందున దానిని నివారించే చర్యలు చేపడితే రైతులు పంటల మార్పిడి వైపు మరింతగా మొగ్గు చూపే అవకాశం ఉంటుందని అన్నారు.

ఎల్-నినో ప్రభావం తీవ్రత పెరిగితే భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నందున నీటి వృథాను అరికట్టడంతో పాటు భూగర్భ జలాల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. బోర్‌వెల్‌ల రీచార్జ్, వర్షపు నీటి సంరక్షణ, నీటి వినియోగంలో పొదుపు వంటి చర్యలను విస్తృతంగా అమలు చేయాలని సూచించారు.

ప్రజలకు తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పశువులకు మేత కొరత ఏర్పడకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, అలాగే ఆరోగ్య శాఖ సీజనల్ వ్యాధుల నివారణతో పాటు ప్రజారోగ్య పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

ప్రత్యేక ప్రధాన కార్యదర్శి,ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి, ఎ. వాణి ప్రసాద్ మాట్లాడుతూ, ఎల్-నినోను ముందస్తుగా అంచనా వేసి ప్రభుత్వం ప్రతి శాఖను సమాయత్తం చేస్తోందన్నారు. అందుబాటులో ఉన్న అన్ని వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడడమే ఈ ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. అనంతరం మంత్రి "జలసిరి" ప్రచార పోస్టర్లను, జిల్లా కంటింజెన్సీ ప్లాన్ ను ఆవిష్కరించారు.అంతకుముందు వివిధ శాఖల అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వర్షపాత పరిస్థితులు, పంటల సాగు, భూగర్భ జలాల స్థితి, జలవనరులలో నీటి లభ్యత, విద్యుత్, తాగు నీటి సరఫరా, ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక తదితర అంశాలను వివరించారు.

ఈ సమావేశంలో రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి ఎ. వాణి ప్రసాద్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సంజీవరెడ్డి, మాణిక్‌రావు, సునీతా లక్ష్మారెడ్డి, అదనపు కలెక్టర్లు, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి,

వివిధ మున్సిపాలిటీల ఛైర్మన్లు, ప్రజాప్రతినిధులు, మెదక్, సంగారెడ్డి జిల్లాల వివిధ శాఖల ఉన్నతాధి కారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఆత్మ కమిటీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యం

**- ప్రజాదివాస్‌లో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్**



భూపాలపల్లి జిల్లా :20 జూలై (విజన్ ఆంధ్ర) భూపాలపల్లి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి మొత్తం 13 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును ఎస్పీ శ్రద్ధగా విని, సంబంధిత పోలీస్ స్టేషన్ సీఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి, సమస్యల పరిష్కారానికి అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు ఎలాంటి పైరవీలు లేదా మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పోలీస్ శాఖ కట్టుబడి ఉందని, ప్రజలకు మరింత చేరువగా ఉండి శాంతి భద్రతలను పరిరక్షించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజాదివాస్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు సత్వర, పారదర్శకమైన సేవలు అందించేందుకు భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ తెలిపారు.

# మారుమూల గిరిజన గ్రామాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, టీ-షర్ట్లు, స్టీల్ ప్లేట్ల పంపిణీ...



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 20, (విజన్ ఆంధ్ర) కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (యు) మండలంలోని మారుమూల గ్రామాలైన చప్పి, సోముగూడ మరియు రాజులగూడ గ్రామాల పాఠశాల విద్యార్థులకు ఆదివాసి మిత్ర వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ఎస్సై కొమురయ్య చేతుల మీదుగా విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, టీ-షర్ట్లు, స్టీల్ ప్లేట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆదివాసి మిత్ర వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు ఆడ వెంకటేష్ మాట్లాడుతూ.. యంగ్ ఇండియా ఫౌండేషన్, హైదరాబాద్‌కు చెందిన పూనమ్ అగర్వాల్ , పర్ధ గుప్తా , అర్జున్ కెడియా, పూజ మరియు జయంతి ల సహకారంతో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, బుధవారం మరియు శనివారం ధరించేందుకు టీ-షర్ట్లు, అలాగే మధ్యాహ్న భోజనం కోసం స్టీల్ ప్లేట్లను పంపిణీ చేశారు. అదేవిధంగా గ్రామంలోని బాలికలకు శానిటరీ న్యాప్‌కిన్లు పంపిణీ చేశారు. విశ్వ క్రియేషన్స్ వారి సహకారంతో కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులకు జండుబామ్‌లను కూడా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిర్పూర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ కొమురయ్య హాజరయ్యారు. పాఠశాల ఉపాధ్యాయులు రాథోడ్ దినేష్, డి. వర్ధన్, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇండోర్ లో ఐఐటి. సీటు సాధించిన విద్యార్థి బి. జస్వంత్ ను సన్మానించిన ఎంఈఓ రాములు, అక్షర పాఠశాల ప్రిన్సిపాల్ మహేందర్



అయిజ జూలై 20 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బి.బొజ్జన్న కుమారుడు 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు అక్షర ఉన్నత పాఠశాలలో చదివిన బి.జస్వంత్ ఇండోర్ లో ఐఐటి సీటు సాధించారు.ఈ మేరకు విద్యార్థిని అక్షర ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ యు.మహేందర్ తో కలిసి,అయిజ మండల ఎంఈఓ రాములు తో కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి,అభినందించి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ రాములు మాట్లాడుతూఅయిజ పట్టణంలో అక్షర ఉన్నత పాఠశాలలో 1వ తరగతి నుంచి పదో తరగతి వరకు చదివి, హైదరాబాద్ లోని నారాయణ కళాశాలలో ఇంటర్ చదివి,ఐఐటీ కి ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమన్నారు.జస్వంత్ ఐఐటీకి ఎంపికై పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకువచ్చారని అన్నారు.మారుమూల ప్రాంతం నుంచి దేశ స్థాయిలో ర్యాంక్ సాధించడం గర్వకారణమని అభినందిస్తూ, భవిష్యత్తులో సివిల్ సర్వీసెస్లో రాణించి ఐఏఎస్ గా ఎదిగి పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల బృందం, ప్రభుత్వ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ నితికా పంత్ .



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జులై 20. (విజన్ ఆంధ్ర) : కోమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నితికా పంత్ ఫిర్యాదుదారుల సమస్యలను స్వయంగా విని, చట్టప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు చేశారు. ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు. జిల్లా పోలీస్ శాఖ ప్రజలకు చేరువగా ఉండి శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు.

# ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో షీ టీం అవగాహన సదస్సు



భూపాలపల్లి జిల్లా :20 జూలై ( విజన్ ఆంధ్ర) భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ గ ఆదేశాల మేరకు జిల్లా షీ టీం ఆధ్వర్యంలో ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం ఎస్సై ఫజల్ ఖాన్ మాట్లాడుతూ విద్యార్థినులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, మహిళలపై వేధింపులు, స్ట్రీట్ హరాస్మెంట్, వ్యక్తిగత భద్రత, సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, వీడియో కాల్స్‌కు స్పందించవద్దని, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. విద్యార్థినులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, చదువుపై పూర్తి దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని తెలిపారు. తమ పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని గుర్తించి క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. పాఠశాల పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, ఎవరైనా మహిళలు లేదా బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా వెంటనే షీ టీంకు సమాచారం అందించాలని కోరారు. షీ టీం మొబైల్ నంబర్ 8712658162కు ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్-100 సేవలను వినియోగించాలని, సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని వివరించారు.

# తొలి తరం ఆదివాసి ఉద్యమ నేత సిడాం శంభుకు నివాళులర్పించిన ఆత్రం సుగుణక్క



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 20. (విజన్ ఆంధ్ర) అదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండల కేంద్రంలో నీదతొలి తరం ఆదివాసి ఉద్యమ నేత, తుడుం దెబ్బ వ్యవస్థాపకులు, ఆదివాసుల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన యోధుడు సిడాం శంభు 8వ వర్ధంతి సందర్భంగా కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క తన కుటుంబ సభ్యులతో కలిసి ఆయన సమాధి వద్ద పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.ఉట్నూర్ మండలం మత్తడిగూడా గ్రామంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో సుగుణక్క పాల్గొని సిడాం శంభు సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ, కొమరం భీమ్, బిర్సా ముండా, రాంజీ గోండ్ వంటి మహనీయుల స్ఫూర్తితో "జల్‌జంగల్‌జమీన్" నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ఆదివాసుల హక్కుల సాధన కోసం సిడాం శంభు జీవితాంతం పోరాడారని అన్నారు. 2006లో అటవీ హక్కుల చట్టం అమలు కోసం దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సిడాం శంభు పటేల్ అధ్యక్షతన నిర్వహించిన భారీ ధర్నా ఆదివాసుల ఉద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని పేర్కొన్నారు.ఆదివాసుల భూమి, అడవి, జీవన హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన త్యాగాలు, ఉద్యమాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని సుగుణక్క అన్నారు. సిడాం శంభు ఆశయాలను కొనసాగించడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు కనక ప్రతిభ,ముక్కడే విష్ణు, కొడప కన్ను, కుటుంబం సభ్యులు..సిడం కౌసల్య, సోనేరావ్, లచ్చు,శేషు,నాయకులు వినాయక్,షైక్ మహమ్మద్, కనక సుదర్శన్, కోటేశ్వర్,ఆదివాసి సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల పక్షాన పోలీసు వ్యవస్థ ఉండాలి

**- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**



ఆదిలాబాద్, జూలై 20 (విజన్ ఆంధ్ర): ప్రజలకు న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన బాధ్యత అని, బాధితుల పక్షాన పోలీసు వ్యవస్థ ఎల్లప్పుడూ నిలబడుతుందని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో నిర్వహించిన 'గ్రీవెన్స్ డే' కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి ఆయన నేరుగా అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 49 మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకురాగా, ప్రతి ఫిర్యాదును ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, బాధితుల సమస్యలపై వెంటనే దర్యాప్తు జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. బాధితులకు న్యాయం జరిగేలా ప్రతీ ఫిర్యాదుపై పారదర్శకంగా విచారణ చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజల్లో పోలీసులపై ఉన్న విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా అధికారులు పనిచేయాలన్నారు. జిల్లాలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు, చట్టవ్యతిరేక చర్యలు లేదా నేరాలకు సంబంధించిన సమాచారం ఉన్నా ప్రజలు 8712659973 నంబర్‌కు వాట్సాప్ ద్వారా తెలియజేయవచ్చని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీసీ కొండరాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారి జైస్వాల్ కవిత, సిబ్బంది వామన్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# బిఎల్ఓ సుజాత పనితీరు ప్రశంసనీయం..



సూర్యాపేట జూలై 20:(విజన్ ఆంధ్ర) : బిఎల్ఓ సుజాత పనితీరు ప్రశంసనీయం ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించడంలో బూత్ లెవల్ ఆఫీసర్ (బిఎల్ఓ) పాత్ర ఎంతో కీలకం.. ఓటరు జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, తొలగింపులు వంటి బాధ్యతలను క్రమశిక్షణతో నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారు.విధి నిర్వహణలో అంకితభావం, సమయపాలన, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ బిఎల్ఓ ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తున్నారు. వారి సేవ నిజంగా ప్రశంసనీయమైనవి.సూర్యాపేట పట్టణ పరిధిలోని 7వ వార్డు పిఎస్ నెంబర్ 82 బూత్ లెవల్ ఆఫీసర్ (బిఎల్ఓ)గా విధులు నిర్వహిస్తున్న తంతెనపల్లి సుజాత,బిఎల్ఎ ల సహాయంతో ఎన్నికల సంఘం చేపట్టిన ఎనుమేరేషన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను సోమవారం విజయవంతంగా పూర్తి చేశారు. ఇంటింటికి వెళ్లి అర్హులైన ఓటర్ల వివరాలను సేకరించడం, అవసరమైన పత్రాలను పరిశీలించడం, ఓటరు జాబితా నవీకరణలో నిబద్ధతతో పనిచేయడం ద్వారా విధులను సమర్థవంతంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె పనితీరును తాసిల్దార్ సాయి గౌడ్, డిప్యూటీ తాసిల్దార్ లాలు అభినందించారు.ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించడంలో బిఎల్ఓల పాత్ర కీలకమని, తంతెనపల్లి సుజాత అదే బాధ్యతతో డిస్ట్రిబ్యూషన్ మొత్తం 952, ఆన్లైన్ కంప్లీటెడ్ 825, ఆన్లైన్ ఓట్లు03,డెత్, షిఫ్టింగ్, డిలేట్ 124 ఓట్లు 100 శాతం పూర్తి చేసి ప్రతి ఒక్క ఇంటికి స్టికర్ అతికించి సమర్థవంతంగా నిర్వర్తించి ఎనుమేరేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ వెంకటేశ్వర్లు, బి ఎల్ఓ లు బొజ్జ అనిత, ఉషారాణి,గట్టు రమ్య, బిఎల్ఎ దైద కృష్ణ,వీర్జాల వేణు, పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుల పై అనుచిత వ్యాఖ్యలు ఊరుకోం..

## సూర్యపేట జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్..



సూర్యాపేట జూలై 20:(విజన్ ఆంధ్ర) : ఇటీవల సరూర్ నగర్ లో బిఆర్ఎస్ పార్టీ నిర్వహించిన యువ సంగ్రామ సదస్సులో పలువురు పెయిడ్ ఆర్టిస్టులు కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుల పై అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల సూర్యపేట జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్ మండిపడ్డారు. ఈ మేరకు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ అగ్ర నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్ లో టూ టౌన్ ఎస్ఐ గోపికృష్ణ కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... 10 సంవత్సరాల పాటు రాష్ట్రాన్ని పాలించి ఉద్యోగాలు ఇవ్వకుండా నేడు నిరుద్యోగ యువతను అబద్ధపు ప్రచారాలతో రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో వారి హయాంలో నోటిఫికేషన్లను ఇచ్చి పేపర్లను లీక్ చేసిన చరిత్రను యువత మర్చిపోలేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడగానే 531 గ్రూప్ వన్ పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇవ్వగా దానిని కూడా ఆపేందుకు ప్రయత్నం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఈ రెండున్నర సంవత్సర కాలంలో 70 వేల ఉద్యోగాలు ఇవ్వడాన్ని బిఆర్ఎస్ పార్టీ జీర్ణించుకోలేకపోతుందని తెలియజేశారు.దీంతో కొంతమంది పెయిడ్ ఆర్టిస్టులతో నిరుద్యోగులను రెచ్చగొట్టి తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రయత్నాన్ని యువత తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సంకరమద్ది శ్రావ్య సుధీర్ రెడ్డి ,అసెంబ్లీ అధ్యక్షుడు జావిద్ బెగ్, యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ బలవంతుల వినయ్ కుమార్,యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు,నియోజకవర్గ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ చింత సుధీర్,పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బొడ్డు సాయి గౌడ్,దంగూల శివ,కృష్ణ, గోపి, రమేష్ రెడ్డి,సాయి,లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి కార్యక్రమంలో 15 ఫిర్యాదులు

**- జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు**



గద్వాల జులై 20( విజన్ ఆంధ్ర బ్యూరో) : ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సర్కిల్ అధికారుల సమక్షంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు తెలిపారు.సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 15 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వారి వినతులు, ఫిర్యాదులను స్వీకరించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. తద్వారా ప్రజల్లో పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం పెరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటి పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందిస్తున్నామని తెలిపారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం వల్ల వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించే అవకాశం ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు. ఈ రోజు వచ్చిన ఫిర్యాదుల్లో కంది పంట పీకి వేసిన విషయంకు సంబంధించినది - 01, పాస్‌పోర్ట్ పోగోట్టుకున్న విషయం కు సంబంధించినది 01, గొడవలకు సంబంధించినవి 01, భూ వివాదాలకు సంబంధించినవి 07, ప్రాబ్లమ్స్ కు సంబంధించినవి - 01,ఇతర అంశాలకు సంబంధించినవి 04 ఫిర్యాదులు ఉన్నాయి.

## రేగొండ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఆడిషనల్ ఎస్పీ.




భూపాలపల్లి జిల్లా :20 జూలై (విజన్ ఆంధ్ర) : జిల్లాలో పోలీసు సేవలను మరింత మెరుగుపర్చే దిశగా జిల్లా అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, సోమవారం రేగొండ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు ప్రజల ఫిర్యాదులను సత్వరంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా వ్యవహరించి, నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని, ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించేలా పనిచేయాలని సిబ్బందికి ఆదేశించారు.

## ప్రజావాణి వినతులను త్వరితగతిన పరిష్కరించాలి: అదనపు కలెక్టర్ వేణుగోపాల్



కొత్తగూడెం బ్యూరో, జూలై 21(విజన్ ఆంధ్ర) : ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి వినతిని సకాలంలో పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఆదేశించారు.జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి, జిల్లా గృహనిర్మాణ సంస్థ (హౌసింగ్) ప్రాజెక్టు డైరెక్టర్‌తో కలిసి ప్రజల నుంచి అందిన వినతులు, ఫిర్యాదులను స్వీకరించి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారంలో శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని పేర్కొన్నారు. తక్షణ పరిష్కారం సాధ్యమయ్యే వినతులను వెంటనే పరిష్కరించాలని, మిగిలిన వాటిని నిర్ణీత గడువులోగా పరిష్కరించి దరఖాస్తుదారులకు సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## చిమన్‌గూడలో పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్.. గుడుంబా ధ్వంసం, 14 బైక్‌లు సీజ్: సీఐ సిహెచ్ రమేష్



ఆదిలాబాద్, జూలై 20 (విజన్ ఆంధ్ర): ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ సర్కిల్ పరిధిలోని సిరికొండ పోలీస్ స్టేషన్ చిమన్‌గూడ గ్రామంలో సోమవారం ముమ్మరంగా 'కమ్యూనిటీ కాంటాక్ట్' కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఇచ్చోడ సీఐ సిహెచ్ రమేష్ తెలిపారు. గ్రామంలో పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా నలుగురు వ్యక్తుల వద్ద నుండి 10 లీటర్ల నాటు గుడుంబా, 50 లీటర్ల బెల్లం ఊట, మరియు 3 క్వింటాళ్ల ఇప్పపూలను స్వాధీనం చేసుకుని అక్కడికక్కడే ధ్వంసం చేశారు. అలాగే గ్రామంలోని ఒక బెల్ట్ షాపుపై దాడి చేసి 3.5 లీటర్ల అక్రమ మద్యాన్ని జప్తు చేసుకుని సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేశారు. మరోవైపు గ్రామంలోని 35 ద్విచక్ర వాహనాలను తనిఖీ చేయగా, సరైన వాహన పత్రాలు లేకపోవడం, నంబర్ ప్లేట్లు నిబంధనలకు విరుద్ధంగా ఉండడం మరియు నంబర్ ప్లేట్లు లేకపోవడంతో 14 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ రమేష్ మాట్లాడుతూ.. గ్రామాల్లో గుడుంబా తయారీ, విక్రయాలు, అక్రమ మద్యం అమ్మకాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు మరియు ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై నిరంతరం ప్రత్యేక డ్రైవ్‌లు కొనసాగుతాయని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు విక్రమ్, ఎల్ శ్రీకాంత్, స్పెషల్ పార్టీ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా దేవేందర్ రావు



భూపాలపల్లి జిల్లా 20 జూలై (విజన్ ఆంధ్ర): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక శ్రీ రాధాకృష్ణ గీత మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అఖిల భారత తెలంగాణ సకల కళాకారుల సంఘం భూపాలపల్లి జిల్లా శాఖకు నూతన అధ్యక్షుడిగా టేకుమట్ల మండలానికి చెందిన ప్రముఖ జానపద కళాకారుడు పోలసాని దేవేందర్‌రావు నియమితుల య్యారు. రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మయ్య ఈ మేరకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దేవేందర్‌రావు మాట్లాడుతూ:- కళాకారుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. జిల్లాలోని జానపద కళాకారులను సంఘంలో సభ్యులుగా చేర్చి వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అలాగే కళాకారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడంతో పాటు, జానపద కళల పరిరక్షణ, అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు చేపడతానని చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మయ్య, జిల్లా కళాకారులు, సంఘ సభ్యులు దేవేందర్‌రావుకు శుభాకాంక్షలు తెలియజేసి, ఆయన నాయకత్వంలో కళాకారుల సంక్షేమానికి మరింత ఊతం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఓటును సురక్షితం చేసుకోండి

**- బి ఎల్ ఓ కేంద్రాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే**



నారాయణపేట, జూలై 20 (విజన్ ఆంధ్ర) : ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఎస్ ఐ ఆర్ లో నిర్లక్ష్యం వహించకుండా పాల్గొని ప్రతి ఒక్కరు పాల్గొని తమ ఓటును సురక్షితం చేసుకోవాలని నారాయణపేట మాజీ ఎమ్మెల్యే బి. ఆర్. ఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్ రాజేందర్ రెడ్డి కోరారు. జిల్లా కేంద్రంలోని 19వ వార్డులో ఏర్పాటు చేసిన బిఎల్ఓ కేంద్రాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలంటే ప్రస్తుతం ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ పత్రాలను పూర్తి చేసి బిఎల్ఓ లకు వెంటనే అందజేయాలని ఆయన కోరారు. 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని భవిష్యత్తులో తమ ఓటు హక్కు పొందేందుకు మంచి అవకాశం అన్నారు.ఎన్నికల సంఘం ఎన్యూమరేషన్ దరఖాస్తు గడువు ఆగస్ట్ 3 వరకు పొడిగించిందన్నారు. ఓటు హక్కు పొందే ప్రతి ఒక్కరు శ్రద్ధ చూపి ఎన్యూమరేషన్ దరఖాస్తు పూర్తి చేయకపోతే ఓటు గల్లంతు అవుతుందని సూచించారు. నూతనంగా ఓటు హక్కు పొందే వారికి బిఎల్ఓ లు సహకరించి వేగవంతం చేయాలని కోరారు. ఆయన వెంట మూడవ వార్డు కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మతోపాటు బిఆర్ఎస్ నాయకులు అజార్ ,మహిమూద్ ఉన్నారు.

# నమ్మిన నాయకుడు అడప మహేష్ పాడె మోసిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**- కుటుంబానికి అండగా ఉంటామని భరోసా...**



హన్మకొండ జిల్లా ప్రతినిధి జులై 20 ( విజన్ ఆంధ్ర ) : వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని 14వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు,సోషల్ మీడియా ఇంఛార్జ్ అడప మహేష్ పెట్రోల్ దాడిలో మృతి చెందగా సోమవారం తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మెన్ సిరిసిల్ల రాజయ్య ,వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ , ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ,వరంగల్,హన్మకొండ డీసీసీ ప్రెసిడెంట్స్ మహమ్మద్ ఆయుబ్,ఇనగాల వెంకట్రామ్ రెడ్డి,హన్మకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దిలీప్ రాజ్ గార్లతో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఆ కుటుంబాన్ని పరామర్శించారు.మహేష్ మృతదేహంపై పార్టీ జెండా కప్పి,వర్షానికి సైతం లెక్క చేయకుండా తడుస్తూ అంతమయాత్రలో ఎమ్మెల్యే నాగరాజు పాల్గొని పాడె మోశారు. మృతుడి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా నిలబడుతుందన్నారు.దోషుల అరాచకాలను అడ్డుకట్టు వేస్తానని హామీ ఇచ్చారు.కఠినమైన శిక్ష పడేలా చూస్తానన్నారు.మహేష్ కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటానని హామీ ఇచ్చారు.మరణవార్త తెలిసినప్పుడు నుంచి ఎమ్మెల్యే నాగరాజు అన్నీ దగ్గరుండి కుటుంబ సభ్యలకు అండగా నిలిచారు.మంచి కార్యకర్తను కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు.మహేష్ పార్టీకి చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ కంటతడి పెట్టారు.ఆయన జ్ఞాపకాలు సజీవంగా ఉంటాయని అన్నారు.అధిష్టానం ఇచ్చే సహాయం కాకుండా తన వంతుగా కూడా మహేష్ కుటుంబానికి ఎల్లవేళల కాపాడుకుంటామన్నారు.మహేష్ కుటుంభ సభ్యులు ఈ తీవ్ర విషాదాన్ని తట్టుకునే శక్తిని భగవంతుడు ఇవ్వాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ,డివిజన్,మండల,గ్రామ ముఖ్య నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇంజాపూర్ "సాయిధయ అంక్లేవ్ ఎన్ క్లేవ్" కాలనీ నూతన కమిటీ

**-అధ్యక్షులుగా ఆర్.భరత్ రెడ్డి**



రంగారెడ్డి జిల్లా బ్యూరో/అబ్దుల్లాపూర్ మెట్ జులై 20 (విజన్ ఆంధ్ర): రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్ మెట్టు మండలం ఆదిబట్ల సర్కిల్, తుర్కయంజాల్ వార్డు, ఇంజాపూర్ సాయిధయ ఎన్ క్లేవ్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయింది. ఈ సందర్భంగా ఇంజాపూర్‌లోని సాయిధయ ఎన్ క్లేవ్ కాలనీ నూతన కమిటీని కాలనీ వాసులందరి ఏకాభిప్రాయంతో ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో కాలనీ సంక్షేమ అభివృద్ధికి బీజం పడినట్లు అయిందని కాలనీవాసులు పేర్కొన్నారు. నూతన కమిటీ అధ్యక్షులుగా ఆర్.భరత్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా కె.కృష్ణనాయక్, జనరల్ సెక్రటరీగా జె.జానకిరాములునాయక్, కోశాధికారిగా వల్లమల్ల స్వామి, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా ఎస్.శ్యామ్ ప్రసాద్ నాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సీహెచ్. శ్రావణ్ రెడ్డిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు కాలనీవాసులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షులు ఆర్.భరత్ రెడ్డి మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధికి తన వంతుగా శక్తివంచన లేని కృషి చేస్తానని, కమిటీ సభ్యులతో పాటు కాలనీవాసులు అందరి సమన్వయంతో అభివృద్ధిలో అగ్రగామిగా కాలనీ తీర్చిదిద్దుతామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. నూతన కమిటీ నియామకానికి సహకరించిన కాలనీవాసులందరికీ కమిటీ తరపున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం



హన్మకొండ జిల్లా ప్రతినిధి జులై 20 ( విజన్ ఆంధ్ర ) : హనుమకొండలోని డీసీసీ కార్యాలయంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమీక్షా సమావేశం ఘనంగా జరిగింది. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ నాసీర్ అహ్మద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. డివిజన్ అధ్యక్షులు, ఇన్‌చార్జ్‌లు, బూత్ స్థాయి ఇన్‌చార్జ్‌లు నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు డివిజన్ స్థాయిల్లో సమన్వయంతో ముందుకు సాగాలని, పార్టీ నమ్ముకున్న నాయకులకు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని వెంకట్రామ్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఈవీ శ్రీనివాసరావులతో పాటు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని డివిజన్ అధ్యక్షులు, డివిజన్ ఇన్‌చార్జ్‌లు, మాజీ కార్పొరేటర్లు, బూత్ ఇన్‌చార్జ్‌లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యా సంస్థల్లో 100 శాతం ఫీజు రాయితీ కల్పించాలి

**- =జిల్లా కలెక్టర్‌కు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నేతల వినతి**



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూలై-20(విజన్ ఆంధ్ర) : జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యా సంస్థల్లో 100 శాతం ఫీజు రాయితీ కల్పించేలా చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్ర సంపత్ కుమార్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు మల్లవర్జల వంశీ విద్యానంద్, జిల్లా కార్యదర్శి నారాయణదాసు అశోక్,తదితరులు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. జిల్లాలో వివిధ దినపత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలో సుమారు 600 మందికి పైగా జర్నలిస్టులు చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారని, ప్రభుత్వానికి-ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న తమ పిల్లలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో చదువుతున్నారని పేర్కొన్నారు. గత కొంతకాలంగా జిల్లాలోని ప్రైవేట్ విద్యా సంస్థలు జర్నలిస్టుల పిల్లలకు ఫీజుల్లో రాయితీ కల్పిస్తున్నాయని, జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి కూడా ఈ విషయంలో సహకారం అందిస్తున్నారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో జిల్లాలో విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యా సంస్థల్లో 100 శాతం ఫీజు రాయితీ కల్పించేలా జిల్లా యంత్రాంగం చొరవ తీసుకుని విద్యా సంస్థలతో సమన్వయం చేసి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు పాలకుర్తి విజయ్ కుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టీకే శ్రీనివాస్, జిల్లా కమిటీ నాయకులు ముత్యాల నరసయ్య, జక్కుల సత్యనారాయణ, ఎండి జబ్బర్ ఖాన్, బాలసాని రాజయ్య, మంథని రమేష్, వీరమల్ల విద్యాసాగర్ రావు,ఆకుల రమేష్, తాటిపెల్లి శ్రీనివాస్, తిరుమల సురేష్, రంజిత్, జైపాల్, ఇబ్రహీం, జర్నలిస్టులు పాల్గొన్నారు.

# కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి: ఎమ్మెల్యే నాయిని..



హనుమకొండ జిల్లా ప్రతినిధి జూలై 20 ( విజన్ ఆంధ్ర ): ఆగస్ట్ 6 నుంచి 12 తేదీవరకు నిర్వహించనున్న కాజీపేట హజ్రత్ సయ్యద్ షా ఖాద్రీ చిష్తీ దర్గా ఉర్సు ఉత్సవాలను భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హనుమకొండ జిల్లా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , దర్గా పీఠాధిపతి, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ కుసూరు పాషా , జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ , గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న హాజరయ్యారు.ఈ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్ శాఖ, విద్యుత్ శాఖ, ట్రాఫిక్ పోలీస్, రెవెన్యూ శాఖ, మైనారిటీ సంక్షేమ శాఖ, అగ్నిమాపక శాఖ, ఆర్టీసీ, పోలీస్ శాఖ, తాగునీటి సరఫరా శాఖతో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొని ఉత్సవాల ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది భక్తులు దర్గాను సందర్శిస్తారని, అలాంటి పరిస్థితుల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని శాఖలు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. ప్రతి శాఖ తమకు కేటాయించిన బాధ్యతలను నిర్లక్ష్యం చేయకుండా సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. దర్గా రైల్వే ట్రాక్‌కు సమీపంలో ఉన్నందున భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైల్వే అధికారులు, సంబంధిత స్టేషన్ గేట్ మాస్టర్లు ఉత్సవాల రెండు రోజుల పాటు అప్రమత్తంగా ఉండి రైళ్ల రాకపోకల సమయంలో సమన్వయం పాటించాలని సూచించారు. అవసరమైతే అదనపు భద్రతా సిబ్బందిని నియమించాలని కోరారు. నగరం నలుమూలలతో పాటు ఇతర జిల్లాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పార్కింగ్ ఏర్పాట్లు, ట్రాఫిక్ మళ్లింపులు, ప్రత్యేక మార్గాల ఏర్పాటు వంటి అంశాలను ముందుగానే పూర్తి చేయాలని ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. ఉత్సవాల సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ప్రత్యామ్నాయ విద్యుత్ ఏర్పాట్లు కూడా సిద్ధంగా ఉంచాలని ఎమ్మెల్యే ఆదేశించారు. తాగునీటి కొరత లేకుండా తగినన్ని వాటర్ ట్యాంకర్లు, తాగునీటి కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. దర్గా పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడం, పారిశుధ్య సిబ్బందిని ప్రత్యేకంగా నియమించడం, ఫాగింగ్, బ్లీచింగ్ కార్యక్రమాలు నిర్వహించడం, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. భక్తులకు అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, అంబులెన్సులు, వైద్య బృందాలను సిద్ధంగా ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. ఉత్సవాల సందర్భంగా భారీ జనసందోహం ఏర్పడే అవకాశం ఉన్నందున దర్గా పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు ఆగస్టు 10, 11 తేదీల్లో స్థానిక సెలవులు ప్రకటించాలని సమావేశంలో నిర్ణయించారు.సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేయడం, తాత్కాలిక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం, తగినంత పోలీసు బందోబస్తు కల్పించడం, అగ్నిమాపక సిబ్బందిని సిద్ధంగా ఉంచడం, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, ట్రాఫిక్ వంటి అన్ని అంశాల్లో శాఖల మధ్య సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ ఉర్సు ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేస్తామని, ప్రతి శాఖకు స్పష్టమైన బాధ్యతలు అప్పగించి ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. దర్గా పీఠాధిపతి, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ కుసూరు పాషా మాట్లాడుతూ ఉర్సు ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, భక్తులందరికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అబూబకర్,అడిషన్ కలెక్టర్ రవి,ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి అర్హత కలిగిన ఓటును కాపాడటమే లక్ష్యం ఎమ్మెల్యే నాయిని

**- ప్రతి ఇంటికి చేరుకోవాలి.. బి ఎల్ ఎ లు గడప గడప ప్రచారం నిర్వహించాలి**

**- జి డబ్ల్యూ ఎం సి ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యం..**

**- ఇప్పటి నుంచే సిద్ధంగా ఉండాలి**

**- సార్ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ వరంగల్ పశ్చిమ విస్తృత సమీక్ష**



హన్మకొండ జిల్లా ప్రతినిధి జులై 20 ( విజన్ ఆంధ్ర ) : హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ స్థాయి డివిజన్ అధ్యక్షులు, డివిజన్ ఇన్‌చార్జ్‌లు, మాజీ కార్పొరేటర్లు, సార్ బూత్ ఇన్‌చార్జ్‌లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో సోమవారం విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి , జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి , సార్ వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ నాసీర్ అహ్మద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమావేశంలో గత నెల రోజులుగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో సార్ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ ) ప్రక్రియలో డివిజన్, బూత్‌ల వారీగా జరిగిన పురోగతిని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సమగ్రంగా సమీక్షించారు. ప్రతి డివిజన్‌లో ఇప్పటివరకు జరిగిన పని, ఎదురవుతున్న సమస్యలు, బూత్‌ల వారీగా నమోదవుతున్న పురోగతిపై నాయకులను అడిగి తెలుసుకున్నారు. రాబోయే రోజులు అత్యంత కీలకమని, ఈ సమయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మరింత బాధ్యతతో పనిచేయాలని సూచించారు.ప్రతి బూత్ లెవల్ ఏజెంట్ ( బి ఎల్ ఎ ) తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లి గడప గడప ప్రచారం నిర్వహించాలని, ప్రతి అర్హత కలిగిన ఓటరు వివరాలను పరిశీలించి అవసరమైన సవరణలు చేయించాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీదేనని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా కాపాడడమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితాలో పేరు లేకపోవడం, తప్పులు ఉండడం, చిరునామా మార్పులు, ఇతర సవరణలపై ప్రజలకు అవగాహన కల్పించి అవసరమైన దరఖాస్తులు పూర్తి చేయించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ , టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సార్ ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్నారని తెలిపారు. ప్రతి అర్హ ఓటును కాపాడేందుకు రాష్ట్ర నాయకత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, అదే స్ఫూర్తితో ప్రతి నాయకుడు చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు.చాలా వరకు షిఫ్టెడ్ ఓట్లపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు.మరణించిన వారి ఓట్లు ఎన్ని కొత్తగా నమోదు అవుతున్నాయో లేదో క్షుణ్ణంగా పరిశీలించాలి. పార్టీలో పని చేసే వారికే గుర్తింపు, అవకాశాలు, పదవులు వస్తాయి. సీనియర్ అనే పేరుతో పని చేయకుండా కూర్చుంటే అవకాశాలు రావు. ప్రజల మధ్య ఉండి పార్టీ కోసం కష్టపడిన వారినే కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ గౌరవిస్తుంది" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గత రెండేళ్లలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అనేక సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరవేసిందని ఆయన పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, అదే విశ్వాసంతో ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలను వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనే స్థాయిలో పార్టీ యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ముఖ్యంగా రానున్న గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ( జి డబ్ల్యూ ఎం సి ) ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి డివిజన్‌లో పార్టీని మరింత బలోపేతం చేసి విజయానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. డివిజన్ స్థాయిలో పార్టీ సంస్థాగత బలోపేతానికి త్వరలోనే డివిజన్ అధ్యక్షుల నియామకాలు చేపడతామని ఎమ్మెల్యే ప్రకటించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు, బాధ్యతలు తప్పకుండా లభిస్తాయని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి లు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి,ఇ వి శ్రీనివాస్ రావు,పలువురు కాంగ్రెస్ నాయకులు, డివిజన్ ఇన్‌చార్జ్‌లు, మాజీ కార్పొరేటర్లు, సార్ బూత్ ఇన్‌చార్జ్‌లు,నాయకులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రివర్యులు కేటీఆర్ ను కలిసిన హనుమకొండ, వరంగల్ మైనార్టీ నాయకులు



హన్మకొండ జిల్లా ప్రతినిధి జులై 20 ( విజన్ ఆంధ్ర ) : మాజీ మంత్రివర్యులు, భారత రాష్ట్ర సమితి పార్టీ కార్యానిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారకరామా రావు ని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ తో కలిసి హనుమకొండ, వరంగల్ జిల్లాల మైనార్టీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మైనార్టీలకు కేటాయించిన స్థలాలను కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి తీసుకొందని వారు కేటీఆర్ దృష్టి తీసుకెళ్లారు... వారిని ఉద్దేశిస్తూ... మైనార్టీలకు బీఆర్ఎస్ పార్టీ, వినయన్న, మేము అండగా ఉంటామని, అభివృద్ధి కి సైతం కట్టుబడి ఉన్నామని, వారి ఉద్యమానికి బాసటగా నిలుస్తామని వారి తరపున పోరాడుతామని భరోసా నిచ్చారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ సైతం ఇచ్చారు.

## ప్లాస్టిక్ వాడకుండా ఉపాధ్యాయులు ఆదర్శం ప్లేటు గ్లాసు మాదే.



నారాయణపేట, జూలై 20 (విజన్ ఆంధ్ర) : ప్లాస్టిక్ వస్తువులను వాడొద్దని చెప్పడమే కాదు స్వయంగా ఆదరించి ఆదర్శంగా నిలుస్తున్నారు నారాయణపేట జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు బోధన నైపుణ్యాలు పెంపొందించేందుకు ప్రస్తుతం జిల్లా స్థాయిలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. జిల్లా పరిధిలో యుపిఎస్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు ఇంటిగ్రేటెడ్ ఇన్ సర్వీస్ టీచర్ శిక్షణ విడుదలవారీగా పాల్గొంటున్నారు వీరికి మధ్యాహ్న భోజనం టి బిస్కెట్లు అందజేయడానికి ప్లాస్టిక్ ప్లేట్లు గ్లాస్ బదులుగా స్టీల్ ప్లేట్లను స్టీల్ గ్లాసుల్లో వినియోగిస్తున్నారు. ఈ శిక్షణలో జీవశాస్త్ర తెలుగు సాంఘిక శాస్త్ర బోధించు ఉపాధ్యాయులు విద్యార్థులకు పర్యావరణ పరిక్షణపై బోధిస్తుంటారు ఈ అంశాలు ఆచరణలో లేకుండా పోతున్నాయని గుర్తించి వారు ప్లాస్టిక్ వస్తువులు వాడకుండా స్టీల్ ప్లేట్లు ఉపయోగించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. నారాయణపేట మండల పరిధిలోని జాజాపూర్ లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో మూడు రోజుల శిక్షణ నిర్వహించారు.ఈ సందర్భంగా పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత ప్లాస్టిక్ రహితంగా భూమిని మార్చే కార్యక్రమంలో ఉపాధ్యాయులు ముందు వరుసలో నిలవడం అభినందనీయమని జిల్లా సైన్స్ అధికారి హెచ్ భాను ప్రకాష్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర డిఆర్పిలు నాగేష్ శ్రీనివాసులు అయ్యప్ప రెడ్డి శంకర్ జీవశాస్త్ర డిఆర్పిలు సంతోష్ కుమార్ శ్రావణి జహంగీర్ తెలుగు బోధించే డిఆర్పిలు వీరేంద్ర కుమార్ శ్రీనివాస్ భాస్కర్ శిక్షణలో పాల్గొన్నటువంటి ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది నరసింహ లక్ష్మణ్ ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**- అదనపు కలెక్టర్ బి హరిసింగ్**



సూర్యాపేట జూలై 20:(విజన్ ఆంధ్ర) : ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ బి హరిసింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మరియు డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను వెంటనే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. అధికారులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. డివిజన్ స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి సంబంధించి 68 దరఖాస్తులు, డీపీఓ 4, డిడబ్ల్యుఓ 4, డి ఆర్ డి ఓ 3, డి ఇ ఓ 3, మిగిలిన 24 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని మొత్తం 106 దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని అదనపు కలెక్టర్ ఈ సందర్భంగా అన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి డిఆర్ఓ ప్రేమ్ రాజ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి, సెల్ ఫోన్ లు నగదు స్వాధీనం

**- గట్టు ఎస్ ఐ శేఖర్ గౌడ్**



గట్టు జులై 20 ( విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండల పరిధిలోని యెల్లందొడ్డి శివారులో అక్రమంగా నిర్వహిస్తున్న పేకాట (జూదం) స్థావరంపై గట్టు పోలీసులు సోమవారం సాయంత్రం దాడి నిర్వహించి, 13 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి 14 మొబైల్ ఫోన్లు, 10 మోటార్ సైకిళ్లు, నగదు రూ.43,932 స్వాధీనం చేసుకున్నామని గట్టు ఎస్ ఐ శేఖర్ గౌడ్ తెలిపారు.

## తిమ్మాపూర్ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



సిద్దిపేట జిల్లా ప్రతినిధి 20 జూలై : దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోని ఏఎన్ఎం చీజణ స్క్రీనింగ్ చేస్తున్నారా, సీజనల్ వ్యాధులకు సంబంధించి శానిటేషన్ డ్రైవ్ సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఓపి ఎంత, అందరూ సమయ వేళలు పాటిస్తున్నారా అని మెడికల్ ఆఫీసర్ ను అడగ్గా, రోజు ఉదయం సాయంత్రం వేళల్లో రోగుల తాకిడి ఉంటుందని సమయ వేళలు పాటిస్తున్నామని మెడికల్ ఆఫీసర్ కలెక్టర్ కి తెలిపారు. రోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించేలా పనిచేయాలని మెడికల్ ఆఫీసర్ మరియు సిబ్బందిని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చిన బాలికతో ఏమైంది, ఎందుకొచ్చువామ్మ అని జిల్లా కలెక్టర్ పలకరించగా 5 రోజుల నుండి జ్వరం వస్తుందని తగ్గడం లేదని చింతమడక మహాత్మ జ్యోతిబాపూలే బిసి గురుకుల పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్లు సూచించిన మెడిసిన్ క్రమం తప్పకుండా వాడుకోవాలని కాచి చల్లార్చిన నీటిని తాగాలని వేడిగా ఉన్నపుడే ఆహారం తీసుకోవాలని, అధైర్య పడవద్దని త్వరలోనే తగ్గుతుందని జిల్లా కలెక్టర్ సూచించారు. చింతమడక మహాత్మ జ్యోతిబాపూలే బిసి గురుకుల పాఠశాలలో బాలికలకు 5 రోజులుగా జ్వరం వస్తున్నాయని గురుకులంలో ఫీవర్ సర్వే జరపాలని డిఎం అండ్ ఎచ్ ఓ ను ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఫోన్ ద్వారా ఆదేశించారు

# ఈనెల 22న గద్వాలలో జాబ్ మేళా

**- జిల్లా ఉపాధి కల్పనాధికారి ప్రశాంతి**

గద్వాల జూలై 20 (విజన్ ఆంధ్ర బ్యూరో) : నిరుద్యోగ యువతకు గద్వాల, ఐజ, మహబూబ్ నగర్, హైదరాబాద్ లోని పలు కంపెనీల్లో ఉపాధి అవకాశాలు కల్పించుటకు ఈ నెల 22న ఉదయం 11:00 గంటలకు ఐడిఓసి లోనీ తమ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ప్రశాంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 18 నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సు ఉండి, పదో తరగతి, ఇంటర్, ఏదైనా డిగ్రీ, బీటెక్, తదితర విద్యార్హతలు ఉన్న నిరుద్యోగులకు అవసరమైన శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందన్నారు. పుష్కళ్ అగ్రోటెక్ లిమిటెడ్, పిఎంకెకే, ఆర్ సెటి గద్వాల, జిడిఏ సెక్యూరిటీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల ప్రతినిధులు పాల్గొని ప్రతిభగల నిరుద్యోగులను ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటారన్నారు. జిల్లాలోని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

## ఆకారపు సుదర్శన్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని ప్రజాసేవలో ముందుండాలి..



సూర్యాపేట సిటీ, జూలై 20:(విజన్ ఆంధ్ర) : ఆకారపు సుదర్శన్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని ప్రజాసేవలో ముందుండాలని టీడీపీ మాజీ రాష్ట్ర కార్యదర్శి బయ్య నారాయణ అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న ఆకారపు సుదర్శన్ విగ్రహానికి ఆయన కుమారుడు, తుంగతుర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఆకారపు రమేష్ కుమార్ తో కలిసి 16వ వర్ధంతి సందర్భంగా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దళిత కుటుంబంలో జన్మించిన ఆకారపు సుదర్శన్ తన సేవా తత్పరత, ప్రజా సంక్షేమ దృక్పథంతో విశిష్ట గుర్తింపు పొందారని కొనియాడారు. మారుమూల ప్రాంతం నుంచి ఎదిగి ప్రజల సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఆయన చూపిన చొరవ నేటికీ ఆదర్శంగా నిలిచిందన్నారు. ఆకారపు సుదర్శన్ తొలుత సోషలిస్టు భావజాలంతో ప్రజా ఉద్యమాల్లో పాల్గొని, అనంతరం భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)లో పనిచేశారని, తర్వాత తెలుగుదేశం పార్టీ తరఫున 1989, 1994 ఎన్నికల్లో సూర్యాపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారని గుర్తు చేశారు. 1997 నుంచి 1999 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) ఛైర్మన్‌గా, 2002 నుంచి 2008 వరకు రాజ్యసభ సభ్యుడిగా సేవలందిస్తూ పలు పార్లమెంటరీ కమిటీల్లో సభ్యుడిగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధికి నిస్వార్థంగా పనిచేసిన నాయకులు ఎప్పటికీ ప్రజల మదిలో నిలిచిపోతారన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి నాతల రాంరెడ్డి, చివ్వెంల మండల పార్టీ అధ్యక్షుడు ధరావత్ వెంకన్న, సూర్యాపేట రూరల్ అధ్యక్షుడు నకిరేకంటి ఉపేందర్, పెను పహాడ్ మండలం పార్టీ అధ్యక్షుడు శెట్టిపల్లి సైదులు, గోవింద చారి, కృష్ణ, ఏర్పుల లింగయ్య, టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సైదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## షిఫా మల్టీ స్పెషాలిటీ & చిల్డ్రన్ హాస్పిటల్ సెంటర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి




గద్వాల జూలై 20( విజన్ ఆంధ్ర కరస్పాండెంట్) : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని 2వ రైల్వే గేట్, సమీపంలో నూతనంగా షిఫా మల్టీ స్పెషాలిటీ, చిల్డ్రన్ హాస్పిటల్స్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరై రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే కి, చైర్పర్సన్ కి డాక్టర్ యం.డి . షఫీక్ శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే హాస్పిటల్ లో ఆపరేషన్ థియేటర్, వైద్య పరికరాలను పరిశీలించారు. అనంతరం డాక్టర్ షఫీ కుమార్తె జన్మదిన సందర్భంగా ఎమ్మెల్యే సమక్షంలో కేక్ కటింగ్ చేశారు. ఎమ్మెల్యే చిన్నారికి కేకు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గద్వాల ప్రాంతంలో దినదిన అభివృద్ధి చెందుతుంది. కొత్త టెక్నాలజీ ప్రజలు వివిధ రకాల ఆరోగ్య సమస్యల పైన హైదరాబాద్ కర్నూల్ వంటి ప్రాంతాలకు వెళ్లి చికిత్సలు పొందేవారు. కానీ ఇప్పుడు గద్వాలలో అన్ని రకాల రోగాలకు సంబంధించిన హాస్పిటల్, ప్రజలకు అందుబాటులో ఎన్ని రకాల సౌకర్యాలు లభిస్తున్నాయి అని తెలపారు. భవిష్యత్తులో గద్వాల నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి నర్సింహులు యాదవ్, మాజీ జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, మాజీ ఎంపీపీ విజయ్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు రాజశేఖర్, మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్స్ బాబర్, రామలింగేశ్వర కాంప్లే, తదితరులు పాల్గొన్నారు.

# ఆలస్యంగా వచ్చినా కురిసింది కదా... రైతుల్లో ఆనందం పొంగింది

**- జూన్ లో రావాల్సిన వర్షాలు జూలై చివర్లో ప్రారంభం...**
**- తెలంగాణ వ్యాప్తంగా పొలం పనుల జోరు..**
**- గుంతకల్లు దశలో ఉన్న పంటలకు మందు చల్లే పనులు...**
**- వర్షాభావంతో దున్ని వదిలేసిన పొలాల్లో మళ్లీ చైతన్యం...**
**- వ్యవసాయ శాఖ అప్రమత్తం..**
**- రాబోయే రోజుల్లో మరిన్ని వర్షాలు..**

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, జూలై 21 (విజన్ ఆంధ్ర):దఈ ఏడాది తెలంగాణ రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేసిన వర్షాలు చివరికి కురవడం ప్రారంభమయ్యాయి. సాధారణంగా జూన్ మొదటి వారంలోనే రావాల్సిన నైరుతి రుతుపవనాలు దాదాపు నెలన్నర ఆలస్యమై జూలై చివరి వారంలో రాష్ట్రవ్యాప్తంగా



విస్తారంగా కురిశాయి. ఆలస్యంగా వచ్చినా వర్షాలు కురవడంతో రైతుల ముఖాల్లో వెయ్యి దీపాల కాంతి కనిపిస్తోంది. "వర్షాలు రావేమోనని భయపడ్డాం. ఇప్పుడు దేవుడు కరుణించాడు" అంటూ రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**ఆలస్య వర్షాలతో అయోమయం- వర్షాభావంతో పొలాలు బోసిపోయాయి**

జూన్, జూలై మొదటి మూడు వారాల్లో వర్షాలు లేకపోవడంతో రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో రైతులు పొలాలు దున్ని విత్తనాలు చల్లకుండా అలాగే వదిలేశారు. "జూలైలో కూడా వర్షాలు పడవేమో" అనే భయంతో చాలా మంది రైతులు ఈ సారి సాగు



చేయాలా వద్దా అనే సందిగ్ధంలో పడ్డారు. విత్తనాలు, ఎరువుల ధరలు పెరగడంతో అప్పులు చేసి సాగు చేయాలంటే భయపడ్డారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే విత్తిన పంటలు ఎండిపోయి రైతులను కంటతడి పెట్టించాయి.

**జూలై చివర్లో వాన - పొలాల్లో సందడి**



అయితే గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. భూమిలో తేమ పెరగడంతో రైతులు యుద్ధప్రాతిపదికన పొలం పనుల్లోకి దిగారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో విత్తిన మొక్కజొన్న, వరి, పత్తి పంటలు గుంతకల్లు దశకు చేరుకున్నాయి. ఈ దశలో మొక్కలకు మందు చల్లడం, కలుపు తీయడం వంటి పనులు చేయాల్సి ఉంది. కురుస్తున్న వర్షాలు ఆ పనులకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. దుక్కి దున్నడం, విత్తనాలు చల్లడం, నారుమడులు పోయడం వంటి పనులు రాష్ట్రవ్యాప్తంగా వేగంగా జరుగుతున్నాయి. ట్రాక్టర్ల శబ్దాలు, రైతుల సందడితో పొలాలు మళ్లీ కళకళలాడుతున్నాయి.

**రైతుల మాటల్లో...**

"జూన్ లో వర్షం లేకపోవడంతో పొలం దున్ని అలాగే వదిలేశాం,ఇప్పుడు వర్షం పడడంతో మళ్లీ విత్తనాలు చల్లాను. ఈ సారి మంచి పంట వస్తుందనే నమ్మకం ఉంది" అని రైతులు తెలుపుతున్నారు. "ఆలస్యమైనా వర్షం వచ్చింది. ఇప్పుడు మందు చల్లే టైం వచ్చింది. ప్రభుత్వం ఎరువులు, విత్తనాలు సకాలంలో అందిస్తే బాగుంటుంది అని కోరుతున్నారు.

**వ్యవసాయ శాఖ హెచ్చరికలు, సూచనలు**

ఆలస్యంగా వర్షాలు వచ్చినందున రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. స్వల్పకాలిక పంటలను ఎంచుకోవాలనీ, వర్షాలు ఆలస్యమైనందున 90-100 రోజుల్లో పండే వరి, మొక్కజొన్న రకాలు వేయాలనీ అన్నారు. నాణ్యమైన విత్తనాలు,ధృవీకరించిన విత్తనాలనే కొనుగోలు చేయాలనీ,సమగ్ర యాజమాన్యం కలుపు నివారణ, చీడపీడల నివారణకు తగు చర్యలు తీసుకోవాలి. రాబోయే రోజుల్లో కూడా మంచి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. అందువల్ల రైతులు ధైర్యంగా సాగులోకి దిగాలని అధికారులు కోరారు.

**ప్రభుత్వం, రైతుల ఆశలు**

వర్షాల రాకతో రాష్ట్రవ్యాప్తంగా రైతుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. ఈ ఏడాది పంటలు బాగా పండాలని, రుణాలు తీర్చుకునే అవకాశం రావాలని రైతులు ఆకాంక్షిస్తున్నారు. ప్రభుత్వం కూడా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, రుణాలు సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకోవాలని, "ఆలస్యంగా వచ్చినా అమృతంలా వర్షం కురిసింది"అంటూ రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది తెలంగాణలో పచ్చని పంటలతో రైతుల ఇళ్లలో పండుగ వాతావరణం నెలకొనాలని అందరూ కోరుకుంటున్నారు....

# ఉచిత కంటి వైద్య శిబిరం అభినందనీయం..

సూర్యాపేట సిటీ, జూలై 20:(విజన్ ఆంధ్ర) : ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యం శిబిరం అభినందనీయం అని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని 47వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఏఆర్ కంటి ఆసుపత్రి నిర్వాహకులు పాషా సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమాజ సేవా దృక్పథంతో ఈ క్యాంప్ ఏర్పాటు చేసిన ఏఆర్ కంటి ఆసుపత్రి నిర్వాహకులు పాషా ని ప్రత్యేకంగా అభినందించారు. నేత్ర పరీక్షలపై నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని, 40 సంవత్సరాలు దాటిన వారు పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్



నాయకులు పోతు భాస్కర్, మున్సిపల్ వైస్ చైర్మన్ యండి షఫీ ఉల్లా, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, కౌన్సిలర్ కొండపల్లి దిలీప్ రెడ్డి, కొనతం రాజేష్ రెడ్డి, కోడి శిరీష శివ, జిల్లా కోశాధికారి కక్కిరేణి శ్రీనివాస్, తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు బొడ్డు సాయి, సంకరమద్ది శ్రావ్య సుధీర్ రెడ్డి, మద్దెబోయిన శ్రీనివాస్, మొరిశెట్టి లక్ష్మాది, నేరెళ్ల మధు, బండారు వెంకన్న, నరేందర్ నాయుడు, రావుల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న రైతుల ఖాతాల్లో డబ్బులు జమ

**- మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ చంద్రమౌళి**

గద్వాల జూలై 20( విజన్ ఆంధ్ర బ్యూరో) : జిల్లాలోని రైతుల నుంచి యాసంగి కాలానికి సంబంధించి మొక్కజొన్నను కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించగా, కొంతమంది రైతుల అకౌంటు నెంబర్లు తప్పులుగా ఉండడం వలన సకాలంలో వారి ఖాతాల్లో జమ కాని రూ.56 లక్షల డబ్బులు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ వారంలో జమ చేయడం జరుగుతుందని మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ చంద్రమౌళి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లాలో 2025-26 యాసంగి కాలంలో రైతులు పండించిన మొక్కజొన్నను మార్క్ఫెడ్ ఆధ్వర్యంలో ఏడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సహకారంతో ఆయా మండలాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి సేకరించమన్నారు. మొత్తం 9845 మంది రైతుల నుంచి 599185 క్వింటాళ్ల మొక్కజొన్నను కొనుగోలు చేయగా, దీనికి సంబంధించిన రూ.143 కోట్లు వారి ఖాతాల్లో ఇప్పటివరకు జమ చేసామన్నారు. అకౌంట్ నెంబర్ తప్పులుగా ఉన్న మిగిలిన రైతులకు మాత్రమే ఈ వారంలో డబ్బులు జమ చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

## శ్రీ సరస్వతి ఇంటర్నేషనల్ పాఠశాలలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



ఎర్రవల్లి జులై 20 (విజన్ ఆంధ్ర) : జాతీయ నూలు పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి ఇంటర్నేషనల్ పాఠశాలలో సోమవారం చిన్నారులకు తల్లిదండ్రుల సమక్షంలో ఆల్బెండజోల్ (నూలు పురుగుల నివారణ) మాత్రలను పంపిణీ చేసి వేయించారు. పాఠశాల కరస్పాండెంట్ మధులిక గోవర్ధన్ రెడ్డి చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (ఎంపిహెచ్ఈవో) శేఖర్ శెట్టి (పీహెచ్‌సీ) సిబ్బంది పరిమళ, ఎర్రవల్లి గ్రామపంచాయతీ ఆశా వర్కర్ సుగుణ, పాఠశాల ప్రిన్సిపల్ స్రవంతి, వైస్ ప్రిన్సిపల్ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# విద్యా ప్రమాణాల్లో పెద్దపల్లికి రాష్ట్రస్థాయి గుర్తింపు

**- కలెక్టర్ కోయ శ్రీహర్ష నాయకత్వానికి మరో ప్రతిష్ఠాత్మక గౌరవం**
**- విద్యార్థుల అభ్యాస ఫలితాల్లో ముందంజలో నిలిచిన పెద్దపల్లి జిల్లా**
**- డీఈవోతో పాటు ఎంఈఓలు, హెచ్ఎంలు, సీఆర్పీలు, టీపీలకు సత్కారం**




పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూలై-20(విజన్ ఆంధ్ర) : విద్యా ప్రమాణాల పెంపు, నాణ్యమైన బోధన, మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థుల అభ్యాస ఫలితాల మెరుగుదలలో విశిష్ట ప్రతిభ కనబరిచిన పెద్దపల్లి జిల్లాకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గౌరవం లభించింది. జిల్లాను విద్యా రంగంలో అగ్రగామిగా నిలిపినందుకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష నాయకత్వంలో పనిచేసిన జిల్లా విద్యాశాఖ అధికారులను హైదరాబాద్‌లోని ఎల్.బి. స్టేడియంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో), పీఎల్‌జీ సీఓ, క్వాలిటీ సీఓ, మండల విద్యాశాఖ అధికారులు (ఎంఈఓలు), కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఉత్తమ సీఆర్పీలు, ఉత్తమ టీపీలను ఘనంగా సన్మానించారు. విద్యా రంగంలో మౌలిక వసతుల కల్పన, ఆన్‌లైన్ కార్యకలాపాల సమర్థ నిర్వహణ, నాణ్యతాభివృద్ధి, విద్యార్థుల అభ్యాస ఫలితాల పెంపు, పాఠశాలల సమర్థ నిర్వహణలో రాష్ట్రంలో పెద్దపల్లి జిల్లా ముందంజలో నిలవడంతో ఈ గుర్తింపు దక్కింది. వేలాది మంది విద్యార్థులు, ఉపాధ్యాయుల సమక్షంలో ఈ సత్కారం జరగడం జిల్లా విద్యాశాఖకు గర్వకారణంగా నిలిచింది. ఈ విజయానికి కృషి చేసిన జిల్లా విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యా రంగ భాగస్వాములందరికీ జిల్లా యంత్రాంగం అభినందనలు తెలిపింది.

# షాదీఖానాకు కేటాయించిన స్థలాన్ని తిరిగి ఇవ్వాలి

హన్మకొండ జిల్లా ప్రతినిధి జులై 20 ( విజన్ ఆంధ్ర ) : తెలంగాణ మున్సిపల్ శాఖ సెక్రటరీ డా. టీకే శ్రీదేవి ఐఏఎస్ ని కలిసి వినతిపత్రం అందజేసిన ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో సోమవారం రోజున మున్సిపల్ శాఖ సెక్రటరీని మైనార్టీ నాయకులు నయీమొద్దీన్, మసూద్‌తో కలిశారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ హనుమకొండలోని షాదీఖానా, వరంగల్‌లోని హజ్ హౌజ్‌కు కేటాయించిన స్థలాల విషయాన్ని సెక్రటరీ కి వివరించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ... వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో పేద ముస్లిం సంక్షేమంలో భాగంగా కాజీపేట మండల పరిధి న్యూశాయంపేట రెవెన్యూ గ్రామ పరిధిలోని 579లోని 25 గుంటల స్థలాన్ని 5 కోట్ల రూపాలయ నిధులు, వరంగల్‌లో 1800 గజాల స్థలం రెండు కోట్ల రూపాయల నిధులను కేటాయించడం జరిగిందని గుర్తు చేశారు మైనార్టీల సంక్షేమానికి నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ , నాటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవ చూపారని వివరించారు ప్రస్తుత అధికార



కాంగ్రెస్ పార్టీ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిన భూమిని తిరిగి తీసుకుందని తెలిపారు. వెంటనే ప్రభుత్వం మైనార్టీలకు కేటాయించిన స్థలాన్ని తిరిగి కేటాయించాలని, ప్రభుత్వం నిధులు కేటాయించి షాదీఖానా నిర్మించాలని డిమాండ్ చేశారు కాంగ్రెస్ పార్టీ మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వరంగల్‌లో హజ్ హౌజ్, హనుమకొండలో షాదీఖానా వెంటనే నిర్మించాలని సవాలు విసిరారు.

# సిజెపి కార్యకర్తలపై లాఠీ-ఛార్జ్ దారుణం: రాహుల్

న్యూఢిల్లీ,జులై 20 : నిరసన ర్యాలీ చేపట్టిన విద్యార్థులు, కాక్రోచ్ జనతాపార్టీ నేతలపై పోలీసులు లాఠీ ఛార్జ్ చేయడాన్ని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ తప్పుబట్టారు. 'యువత వ్యతిరేకి' అంటూ ప్రధాని మోదీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. పరీక్షల్లో చోటు చేసుకున్న అవకతవకలను ఎత్తి చూపితే.. పోలీసు బలాన్ని ఉపయోగించి అణిచివేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. పేపర్ లీకేజీలకు సంబంధించి విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై వరుస ఆరోపణలు వస్తున్నా రక్షణ కవచంలా వ్యవహరిస్తోందని ఆక్షేపించారు. ఈ ప్రభుత్వహయాములో మొత్తం 152 పరీక్ష పేపర్లు లీకయ్యాయని, దీని వల్ల 7.5 కోట్ల మంది విద్యార్థులు ప్రభావితమయ్యారని ఆయన ఆరోపించారు.

## ప్రజావాణి ప్రతి ఫిర్యాదును వేగవంతంగా పరిష్కరించాలి

**- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**
**- ప్రజావాణిలో ప్రజల నుంచి 268 ఫిర్యాదులు స్వీకరణ**



హనుమకొండ జిల్లా ప్రతినిధి జులై 20 ( విజన్ ఆంధ్ర ) : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి ఫిర్యాదును వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు సమర్పించిన ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. అక్కడ ఉన్న జిల్లా అధికారులతో పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీవోలు, తహసీల్దార్లతో ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన దరఖాస్తులను పరిష్కార చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు 268 ఫిర్యాదులను సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి అర్జీని ఆన్లైన్ పోర్టల్ లో పరిశీలించాలని, పరిష్కార చర్యలు సంబంధిత శాఖల అధికారులు చేపట్టాలన్నారు . ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్ లో ఉండకుండా పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, డి ఆర్ డి ఓ మేన శ్రీను, జెడ్పి సీఈవో శేషాద్రి, సిపిఓ సత్యనారాయణ రెడ్డి, ఇతర శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సరిహద్దు ప్రాంతాల్లో నేరాల నియంత్రణకు సమన్వయమే కీలకం: సైబరాబాద్ సీపీ

## గోల్కొండ రిసార్ట్‌లో సైబరాబాద్ పోలీస్ ఆధ్వర్యంలో సరిహద్దు నేరాల సమన్వయ సమావేశం



శేరిలింగంపల్లి. జూలై 20: (విజన్ ఆంధ్ర) : సరిహద్దు ప్రాంతాల్లో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, పోలీసు శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో గోల్కొండ రిసార్ట్‌లో బోర్డర్ క్రైమ్ కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, ఐపీఎస్ అధ్యక్షత వహించగా, హైదరాబాద్, ఫ్యూచర్ సిటీ, సంగారెడ్డి, మెదక్, తదితర సరిహద్దు కమిషనరేట్లు, జిల్లాల పోలీసు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, ఐపీఎస్ మాట్లాడుతూలి, సరిహద్దు ప్రాంతాల్లో జరిగే నేరాలను అరికట్టడంలో పోలీసు శాఖల మధ్య సమన్వయం, వేగవంతమైన సమాచార మార్పిడి, సంయుక్త కార్యాచరణ అత్యంత కీలకమని. ఒక కమిషనరేట్ లేదా జిల్లా పరిధిలో నేరానికి పాల్పడి మరో ప్రాంతానికి పారిపోయే నేరస్థులను గుర్తించి, త్వరితగతిన పట్టుకోవడానికి పరస్పర సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, సీసీటీవీ నెట్‌వర్క్, ఇంటెలిజెన్స్ సమాచారాన్ని సమర్థవంతంగా



వినియోగించి నేరాల నియంత్రణలో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. అలాగే రౌడీ షీటర్లు, చరిత్ర కలిగిన నేరస్తులు, అంతర్‌రాష్ట్ర ముఠాలు, సైబర్ నేరస్థులపై నిరంతర నిఘా కొనసాగించాలని, ప్రతి సరిహద్దు పోలీసు యూనిట్ పరస్పరం సమాచారాన్ని వెంటనే పంచుకుంటూ సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో లా అండ్ ఆర్డర్, క్రైమ్, ట్రాఫిక్, స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ (ఎస్ఓటీ), స్పెషల్ బ్రాంచ్, సైబర్ క్రైమ్ తదితర విభాగాల పనితీరును సమగ్రంగా సమీక్షించారు. ఆయా విభాగాల అధికారులు తమ పరిధిలోని ప్రస్తుత పరిస్థితులు, ఎదురవుతున్న సవాళ్లు, నేరాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలు, పరస్పర సమన్వయాన్ని బలోపేతం చేసే అంశాలపై ప్రజెంటేషన్లు ఇచ్చి, కార్యాచరణ ప్రణాళికలు మరియు అమలు వ్యూహాలను సమావేశంలో వివరించారు. రౌడీ షీటర్లు, చరిత్ర కలిగిన నేరస్తులు, అంతర్‌రాష్ట్ర ముఠాల కదలికలపై సమాచార మార్పిడి, సంయుక్త చెక్‌పోస్టులు, పెట్రోలింగ్, వాట్సాప్ గ్రూపుల ద్వారా తక్షణ సమాచార వినిమయం, మిస్సింగ్ వ్యక్తులు, గుర్తుతెలియని మృతదేహాల వివరాల భాగస్వామ్యం, సీసీటీవీ కవరేజ్ విస్తరణ, సైబర్ నేరాలపై సమన్వయం, వీఐపీ బందోబస్తు, మతపరమైన పండుగలు, భారీ కార్యక్రమాల సందర్భంగా ట్రాఫిక్ నిర్వహణ, సామాజిక ఉద్రిక్తతల నివారణ, సహజ విపత్తుల సమయంలో సంయుక్త చర్యలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్., జాయింట్ సీపీ (ట్రాఫిక్) సన్‌ప్రీత్ సింగ్, హైదరాబాద్ జాయింట్ సీపీ (ట్రాఫిక్) జోయెల్ డావిస్, ఐపీఎస్., కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, ఐపీఎస్., కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి, ఐపీఎస్., శేరిలింగంపల్లి డీసీపీ సి. హెచ్. శ్రీనివాస్, ఐపీఎస్., ట్రాఫిక్ డీసీపీ ఐ శేషాద్రిని రెడ్డి, ఐపీఎస్., డీసీపీ (క్రైమ్స్) ముత్యం రెడ్డి, డీసీపీ (స్పెషల్ బ్రాంచ్) వై.వి.ఎస్. సుధీంద్ర, డీసీపీ (మహిళా, శిశు భద్రత విభాగం) సృజన కరణం, డీసీపీ (సైబర్ క్రైమ్స్) పుష్ప, రోడ్ సేఫ్టీ విభాగం అధికారులు, మేడ్చల్ ఎస్‌వోటీ (ఎస్ఓటీ) డీసీపీ, ఎస్‌వోటీ డీసీపీ శోభన్ కుమార్, ట్రాఫిక్ డీసీపీ2 రవికుమార్, వివిధ సరిహద్దు కమిషనరేట్లు, జిల్లాల పోలీసు అధికారులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

**- జిల్లా ఎస్పీ సునిత రెడ్డి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, జూలై 20 (విజన్ ఆంధ్ర) : ప్రజావాణి సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 17 మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలను ఎస్పీకి నేరుగా విన్నవించుకున్నారు. ప్రతి ఫిర్యాదును స్వయంగా పరిశీలించిన ఎస్పీ.. సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణ ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు సత్వర న్యాయం అందించడంలో పోలీసులు రాజీపడొద్దని, చట్టబద్ధంగా, పారదర్శకంగా మరియు వేగవంతంగా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

సమస్యల పరిష్కారమే అసలు ఉద్దేశ్యం

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను వినడం మాత్రమే కాకుండా, వాటికి త్వరితగతిన పరిష్కారం చూపడమే ప్రజావాణి యొక్క అసలు ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ప్రతి ఫిర్యాదును సున్నితంగా పరిశీలించి, బాధితులకు న్యాయం జరిగేలా పోలీసులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కాగా, ఎస్పీ తక్షణ స్పందన మరియు సమస్యల పరిష్కారానికి చూపిన చొరవపై ఫిర్యాదుదారులు హర్షం వ్యక్తం చేశారు. తమకు ఖచ్చితంగా న్యాయం జరుగుతుందనే పూర్తి విశ్వాసం కలిగిందని వారు తెలిపారు.

## కల్లుగీత కార్మిక రణభేరి చైతన్య బస్సు యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

**- గుండెబోయిన రవి గౌడ్**



ములుగు జూలై 21 , విజన్ ఆంధ్ర ప్రతినిధి: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 2 నుండి 18 వరకు "కల్లు గీత కార్మికుల రణభేరి చైతన్య బస్సు యాత్ర"నిర్వహిస్తున్నట్లు కల్లు గీత కార్మిక సంఘం నాయకులు తెలిపారు.సోమవారం ములుగులో జరిగిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు పులి నర్సయ్య గౌడ్, అధ్యక్షులు గుండెబోయిన రవిగౌడ్, కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.ఆగస్టు 2న మహబూబాబాద్ లో ప్రారంభమయ్యే ఈ యాత్ర ఆగస్టు 18న హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద ముగుస్తుందని తెలిపారు. ఆగస్టు 16న ఉదయం 11 గంటలకు ములుగు కు చేరుకుని భారీ ర్యాలీ, సభ నిర్వహిస్తామని చెప్పారు. వృత్తి పింఛన్ రూ.4000, 10 లక్షల ఎక్స్-గ్రేషియా, తాటి మొక్కల పంపిణీ, పెండింగ్ చెక్కుల విడుదల, ములుగులో పాపన్న విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రంగు సత్యనారాయణ గౌడ్, ఉయ్యాల మధుకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీనగర్ లో పరిశుభ్రత - నీటి సంరక్షణపై అవగాహన


**- ఇంటింటికి తిరిగి ప్రజలకు సూచనలు చేసిన సర్పంచ్ నిర్మల వెంకన్న.**



ములుగు జూలై 20 , విజన్ ఆంధ్ర ప్రతినిధి : గాంధీనగర్ గ్రామంలో సర్పంచ్ బానోత్ నిర్మల వెంకన్న ఆధ్వర్యంలో పరిశుభ్రత, నీటి సంరక్షణ , సీజనల్ వ్యాధుల నివారణపై ఇంటింటి అవగాహన కార్యక్రమం నిర్వహించగా బాలవికాస ప్రతినిధులు, బాలవికాస గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బానోత్ వెంకన్న , కమిటీ సభ్యులతో కలిసి సర్పంచ్ గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, తాగునీటిని వృథా చేయవద్దని సూచించారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించి వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చేయాలని వివరించారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమల నివారణ చర్యలు తీసుకోవాలని ప్రజలకు తెలిపారు. గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలి" అని సర్పంచ్ బానోత్ నిర్మల వెంకన్న పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వల్లపు మహేష్, వార్డు మెంబర్లు మాలోత్ శంకర్, రామావత్ సంధ్యా బిక్షురాథోడ్, బాలవికాస ప్రతినిధులు వినయ్, శంకర్, కమిటీ సభ్యులు లిక్కి నరేష్, బెల్లి సురేష్, భూక్య రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలి.

**- అదనపు కలెక్టర్ సంపత్ రావు**



ములుగు జూలై 19 , విజన్ ఆంధ్ర ప్రతినిధి : ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయవద్దని, ప్రజావాణి దరఖాస్తులను వారం రోజుల్లోగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సోమవారం కలెక్టరేట్ లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించారు. ఈ వారం ప్రజావాణిలో మొత్తం 82 ఫిర్యాదులు అందగా అందులో భూ వివాదాలు – 22, ఇందిరమ్మ ఇళ్లు – 18, పెన్షన్లు – 17, ఇతర సమస్యలు – 25 ఉన్నాయి. ప్రతి ఫిర్యాదును సానుభూతితో పరిశీలించి, అర్హులకు వెంటనే న్యాయం చేయాలని అదనపు కలెక్టర్ సంపత్ రావు అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుదారులకు పరిష్కారం వివరాలను తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణవేణి, డిఆర్ఓ రవికుమార్, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ కుషీల్ తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ప్లాస్టిక్ నివారణ దినోత్సవం సందర్భంగా భారీ ర్యాలీ




హైదరాబాద్, జూలై 20 (విజన్ ఆంధ్ర) : అంతర్జాతీయ ప్లాస్టిక్ నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్(టీసీసీ) రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో హరిబోలిలోని రిఫాయం హైస్కూల్‌లో అవగాహన సదస్సు, సుధా టాకీస్ నుంచి శాలిబండ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథి ప్రొఫెసర్ కె.పురుషోత్తం రెడ్డి, ప్రధాన వక్త డాక్టర్ సి.ఉమా మహేశ్వర్ రెడ్డి, మొఘల్‌పురా ఎస్ఐ పి.సాయికుమార్ ప్లాస్టిక్ వల్ల ఆరోగ్య, పర్యావరణానికి కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ అధ్యక్షత వహించగా, వ్యాసరచన విజేతలను సన్మానించారు. పాతబస్తీ అధ్యక్షుడిగా ఎన్నికైన ఉత్తం కొటారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సిద్ధేష్ ముదిరాజ్, మహమ్మద్ అక్తర్ షరీఫ్, ఎస్.పుల్లారెడ్డి, కె.నీరజ, ఎం.విద్యావతి, మొహమ్మద్ షాహిద్ అలీ, కె.రవీందర్, జి.వేణుగోపాల్, కె.శ్యామ్‌రావు ముదిరాజ్, బిచ్చుకారి సూర్య, ఎం.చంద్రకళ, ఆర్.వసంత, ఎస్.వెంకట్‌రెడ్డి, పి.వి.ప్రమోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

**- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ ఆదేశం**

**- కలెక్టరేట్‌లో 61, ఆర్డీవో ఆఫీస్‌లో 2 దరఖాస్తులు నమోదు**



వనపర్తి జిల్లా ప్రతినిధి, జూలై 20 (విజన్ ఆంధ్ర) : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించి, ఆ సమాచారాన్ని ఫిర్యాదుదారునికి అందించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిరుపతయ్యతో కలిసి ప్రజల నుంచి అర్జీలు, వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించి, ఆ వివరాలను సంబంధిత దరఖాస్తుదారునికి పంపించడంతో పాటు ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఒకవేళ ఏదైనా ఫిర్యాదు తమ శాఖ పరిధిలోనిది కాకపోతే, దానిని సంబంధిత శాఖకు లేఖ ద్వారా బదిలీ చేయాలన్నారు. సాంకేతిక లేదా ఇతర కారణాల వల్ల పరిష్కరించలేని అంశాలు ఉంటే ఉన్నతాధికారులకు పంపాలని, లేదా ఏ నిబంధన ప్రకారం ఆ పని చేయలేమో స్పష్టంగా ఫిర్యాదుదారునికి తెలియజేయాలి తప్ప.. దరఖాస్తులను కార్యాలయాల్లో పెండింగ్‌లో పెట్టుకోవద్దని సూచించారు.

సీఎం, మంత్రి అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ..

ముఖ్యమంత్రి (సీఎం), జిల్లా మంత్రి నుంచి వచ్చే ప్రజావాణి దరఖాస్తులను సైతం అన్ని శాఖల అధికారులు సత్వరమే పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించేలా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాగా, సోమవారం నాటి ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 61 దరఖాస్తులు వచ్చాయి. అలాగే, ఆర్డీవో (=ఆర్డీవో) కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 2 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షణ ఉప కలెక్టర్ రజనీకాంత్ రెడ్డితో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మురుగు కంపు తో అల్లాడుతున్న 9వ వార్డు ప్రజలు

***డ్రైనేజీ కోసం కలెక్టర్ చుట్టూ కౌన్సిలర్ వాణికుమార్ చక్కర్లు.***



ములుగు జూలై 20 ,విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు మున్సిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్ గంద్రకోట వాణికుమార్ తన వార్డులో దీర్ఘకాలంగా ఉన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని స్థానికుల తో కలిసి జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో మున్సిపాలిటీలోని కీలక ప్రాంతాల్లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా నేషనల్ హైవే మిరాకిల్ ప్రైమ్ స్కూల్ నుంచి ప్రేమ్ నగర్ వరకు ఈ ప్రాంతంలో డ్రైనేజీ లేకపోవడంతో వర్షపు నీరు , మురుగునీరు రోడ్డు పక్కన నిలిచిపోతున్నాయి. ఫలితంగా దుర్వాసన, దోమల బెడద పెరిగిపోయింది.సాధన హైస్కూల్ కు వచ్చే వేలాది మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక నివాసితులు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడిన వెంటనే ఈ ప్రాంతమంతా చిన్న చెరువులా మారుతుందని అలాగే జీవింతరావుపల్లి ఆ రోడ్స్ నుంచి బండారుపల్లి రోడ్ వరకు సుమారు150 మీటర్ల మేర రోడ్డు ను ఆనుకుని డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ప్రతి వర్షానికి నీరు నిలిచిపోతుంది. దీనివల్ల రోడ్డు త్వరగా పాడైపోతుండడమే కాకుండా, ప్రజారోగ్యానికి ప్రమాదకరంగా మారి స్థానికుల నుంచి రోజూ ఫిర్యాదులు వస్తున్నాయని కౌన్సిలర్ పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, పారిశుద్ధ్యం, రోడ్డు భద్రత దృష్ట్యా ఈ సమస్యను వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉందని కౌన్సిలర్ "వాణికుమార్" కలెక్టర్ కు ఇచ్చిన వినతిలో పేర్కొన్నారు. సంబంధిత సమస్యపై నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులతో సమన్వయం చేసి, శాశ్వత ప్రాతిపదికన సరైన డ్రైనేజీ వ్యవస్థను నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. తద్వారా దోమల బెడద తగ్గడంతో పాటు ప్రజారోగ్యం మెరుగుపడుతుందని, ప్రమాదాలు కూడా నివారించవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పట్ల తాను ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటానని, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని కౌన్సిలర్ వాణికుమార్ స్పష్టం చేశారు.

# రామవారంలో సింగరేణి డిస్పెన్సరీ పునఃప్రారంభం

**- వీకేసీఎంలో నాలుగు నూతన క్రేన్ల ప్రారంభం చేసిన డైరెక్టర్ (పి&పి) కె. వెంకటేశ్వర్లు**



కొత్తగూడెం బ్యూరో, జూలై 21(విజన్ ఆంధ్ర) : సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని రామవారంలో ఆధునిక సౌకర్యాలతో పునరుద్ధరించిన సింగరేణి డిస్పెన్సరీని సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) కె. వెంకటేశ్వర్లు సోమవారం పునఃప్రారంభించారు. అనంతరం వీకేసీఎం ప్రాజెక్టులో నూతనంగా కొనుగోలు చేసిన నాలుగు క్రేన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు నాణ్యమైన వైద్య సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో డిస్పెన్సరీని ఆధునికీకరించి తిరిగి అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా. కిరణ్ రాజ్ మాట్లాడుతూ, ఉద్యోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని డిస్పెన్సరీలో నిరంతరం స్టాఫ్ నర్స్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని, అవసరమైన వైద్య సేవలు, మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుతామని చెప్పారు. కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు మాట్లాడుతూ, పునరుద్ధరించిన ఈ డిస్పెన్సరీ ద్వారా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో పాటు పరిసర ప్రాంత ప్రజలకు కూడా మెరుగైన వైద్య సేవలు అందనున్నాయని, ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వీకేసీఎం ప్రాజెక్టులో నూతనంగా



కొనుగోలు చేసిన నాలుగు క్రేన్లను డైరెక్టర్ కె. వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ క్రేన్ల వినియోగంతో గని నిర్వహణ పనులు మరింత వేగవంతంగా, సమర్థవంతంగా సాగడంతో పాటు భద్రతా ప్రమాణాలు, ఉత్పాదకత పెరుగుతాయని తెలిపారు. భారీ యంత్ర పరికరాల తరలింపు, నిర్వహణ పనులు సులభతరం కావడంతో ఉత్పాదకతలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ ఆధునికీకరణకు నిరంతరం ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో వీకేసీఎం ప్రాజెక్టు ఆఫీసర్ ఎం.వి. నరసింహారావు, ఏరియా ఇంజనీర్ వి. రామకృష్ణ, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మొక్కపాటి వెంకటేశ్వర్లు, డీజీఎం (ఐఈడీ) యోహన్, ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రటరీ వంగా వెంకట్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మల్లికార్జున్ రావు, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. రజాక్, రామవరం కార్పొరేటర్ కె. జమలయ్య, ఎస్‌వో టు జీఎం ఎం. గోవిందరావు, సీఎంఓఏఐ జనరల్ సెక్రటరీ ఉపేందర్, పర్సనల్ మేనేజర్ తిరుపతి, ఇన్‌చార్జ్ హెచ్‌వోడీ (సివిల్) కె. రాజారాం, మేనేజర్ (ఐటీజీ) శేషశ్రీ, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ హరీష్, ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ గట్టయ్య, ఐఎన్‌టీయూసీ ఫిట్ సెక్రటరీ సాగర్, అధికారులు, వైద్యాధికారులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు

# రాష్ట్రంలోని రైస్ మిల్లర్లందరికీ ఓటు హక్కు కల్పించాలి.

**- రాష్ట్ర అసోసియేషన్ వైఫల్యంపై ములుగు జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్ ఫైర్.**



ములుగు జూలై 19 , విజన్ ఆంధ్ర ప్రతినిధి : రాష్ట్ర ప్రభుత్వానికి సీఎంఆర్ పెట్టే రైస్ మిల్లర్లందరికీ త్వరలో జరిగే రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు "బాదం ప్రవీణ్" డిమాండ్ చేశారు. ఆదివారం "బాదం ప్రవీణ్" ఆధ్వర్యంలో ములుగు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఆరు జిల్లాల అసోసియేషన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, సీనియర్ నాయకులు పాల్గొని 2013 నుంచి అసోసియేషన్‌కు ఎన్నికలు జరగకపోవడంతో ఒకే కార్యవర్గం అధికారంలో కొనసాగుతోందని" బాదం ప్రవీణ్" విమర్శించారు. గ్రామీణ స్థాయిలో ఉన్న మిల్లర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడంలో ప్రస్తుత కమిటీ పూర్తిగా విఫలమైందని, మిల్లర్ల సంక్షేమానికి ఏమీ చేయలేదని ఆరోపించారు. దీంతో లిఉమ్మడి వరంగల్ జిల్లా రైస్ మిల్లర్లులి సదరు అసోసియేషన్ నుంచి బయటకు వచ్చినట్లు బాదం ప్రవీణ్ ప్రకటించారు. తిరుగుబాటుకు భయపడిన రాష్ట్ర కమిటీ అసోసియేషన్ కార్యవర్గాన్ని రద్దు చేసిందని, ఇది ఉమ్మడి జిల్లా రైస్ మిల్లర్లు సాధించిన విజయమని స్పష్టం చేశారు. పాత బైలా ప్రకారం 25 వేల మెట్రిక్ టన్నుల సిఎంఆర్‌కు ఒక ఓటు అనే నిబంధనను బాదం ప్రవీణ్ తప్పుబట్టారు. ఇది రైస్ మిల్లర్ల సంక్షేమానికి పూర్తి విరుద్ధమని అన్నారు. మిల్లు నడుపుతున్న ప్రతి యజమానికి ఒక "ఓటు" కల్పించడమే తమ ప్రధాన డిమాండ్ అని బాదం ప్రవీణ్ స్పష్టం చేశారు. దీనికోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైస్ మిల్లర్లను సమీకరించి ఎన్నికల కమిటీపై ఒత్తిడి తీసుకువస్తామని, ఉద్యమ కార్యచరణ సిద్ధమైందని తెలిపారు. సమావేశంలో ఆల్ ఇండియా రైస్ మిల్లర్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు తోట సంపత్ కుమార్, మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవునూరి అంజయ్య, వరంగల్ జిల్లా అధ్యక్షులు గోనెల రవీందర్, జనగామ జిల్లా అధ్యక్షులు ముత్తయ్య, భూపాలపల్లి జిల్లా గౌరవాధ్యక్షులు కోరే రవి, మహబూబాబాద్ జిల్లా కోశాధికారి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# "కెమెరా పెడితే నేరం ఆగుతుంది" పసర ఎస్సై తాజుద్దీన్ హెచ్చరిక




గోవిందరావుపేట జూలై 20 ; విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం దుంపెల్లిగూడెం గ్రామంలో నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు కొత్త ప్రణాళిక అమలు చేస్తున్నారు. ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకేన్ మార్గదర్శకం, డీఎస్పీ రవీందర్ పర్యవేక్షణలో బి"నేను సైతం"బి కార్యక్రమంలో భాగంగా సిఐ దయాకర్, ఎస్సై తాజుద్దీన్ ఆధ్వర్యంలో గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ సీతారాం , వార్డు సభ్యుల సహకారంతో గ్రామంలో 9 కెమెరాలు, స్థానికులు పసర సంపత్ రెడ్డి ఇంటి వద్ద 3, చల్వాయి నర్సయ్య దుకాణం వద్ద 3 కెమెరాలు ఏర్పాటు చేశారు. ఒక్క రోజులోనే మొత్తం 15 కెమెరాలు పనిచేస్తున్నాయి. ఈ సందర్భంగా ఎస్సై తాజుద్దీన్ మాట్లాడుతూ, ఒక కెమెరా అంటే వంద మంది పోలీసులు అప్రమత్తంగా ఉన్నట్టే" అన్నారు. కెమెరా చూస్తేనే నేరస్తుడు వెనక్కు తగ్గుతాడని, ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు సీసీ కెమెరాలే పెద్ద అండ అని చెప్పారు. ఇకపై ప్రతి ఇల్లు, ప్రతి దుకాణం, ప్రతి వీధి కెమెరా కంటి కింద ఉండాలి అని స్పష్టం చేశారు. నేర రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పోలీసులు కోరారు.

## ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ**

వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 20 ( విజన్ ఆంధ్ర ) : ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను అధిక ప్రాధాన్యత కల్పిస్తూ పరిష్కార దిశగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఇ.వెంకటా చారి, డీఆర్ఓ స్వర్ణలత, డిప్యూటీ కలెక్టర్ (ట్రైనీ) పూజ, జడ్పీ సీఈఓ సుధీర్, డిఆర్డిఓ శ్రీనివాస్ లతో కలిసి ప్రజల నుండి (104 ) అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో వివిధ శాఖల్లో పెండింగ్ లో ఉన్న 150 ప్రజావాణి అర్జీలను అధికారులు ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి మండల స్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన అన్నారు. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించే దిశగా పని చేయాలన్నారు. ప్రజావాణిలో హౌసింగ్, పెన్షన్, విద్యుత్తు, గురుకుల ప్రవేశాలు తదితర అంశాలపై విజ్ఞప్తులు వచ్చాయి.

# కలలపై రాజీ పడొద్దు లక్ష్యం చేరేవరకు పట్టుదలతో శ్రమించండి

- విద్యార్థులకు పిలుపునిచ్చిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్.చెరుకూరి
- సైనింగ్ స్టార్ - 2026 అవార్డు క్రింద ఒక్కొక్కరికీ రూ. 20 వేలు చొప్పున బహుకరణ
- జిల్లాలో 33 మంది ఇంటర్, 248 మంది టెన్త్ విద్యార్థులకు కలిపి మొత్తం మొత్తం రూ.56,20,000 లు విడుదల



కడప,జూలై 20 (విజన్ ఆంధ్ర)విద్యార్థులు తమ కలలు,జీవిత లక్ష్యాలపై ఎప్పుడూ రాజీ పడకుండా, అవి నెరవేరే వరకు నిరంతరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు. సోమవారం కడపలోని మాధవి కన్వెన్షన్ హాలులో. 2025-26 విద్యా సంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ లో జిల్లా స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్-2026 పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రూ. 20 వేల నగదు బహుమతి, సర్టిఫికేట్, మెడల్స్ బహుకరించి.. సత్కారంచే కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తోపాటు రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన, ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి, రాష్ట్ర షేక్ డెవలప్మెంట్ కార్పోరేషన్ చైర్మన్ వి.ఎస్.ముక్తియార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డి. భానుప్రకాశ్ లు హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "షైనింగ్ స్టార్స్-2026" అవార్డులు విద్యార్థుల ఉన్నత చదువులు, ఉజ్వల భవిష్యత్తుకు ప్రోత్సాహాన్ని అందిస్తాయన్నారు. ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ ఒక్కో ప్రతిభ ఉందని, ఆశయం ఏదైనా కావచ్చని, ఆ రంగంలో నిష్ణాతులుగా ఎదిగి ప్రపంచ చరిత్రలో మన పేరు లిఖించబడాలి అన్న ఆశయంతో ముందుకు సాగాలన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం కష్టం కాదని, లక్ష్యాన్ని చేరుకోవడంలో ప్రణాళిక ప్రకారం, దృఢ సంకల్పంతో అడుగులేయలన్నారు. ఈ ఆశయ సాధనలో మీరంతా మొదటి మెట్టు ఎక్కరన్నారు. ఈ రోజు విద్యార్థుల అభ్యసనం, కృషి, పట్టుదల ఆశయాలకు రెక్కలు వచ్చిన రోజుగా ఆయన అభివర్ణించారు.మన విజయానికి చేయుతను ఇచ్చిన వారిని భవిష్యత్తులో ఎన్నడూ మారువకూడదన్నారు.మీ లక్ష్యాలను ఎప్పుడు కూడా.వెనుకంజలో నడిపించకూడదు అని సూచించారు.అదే విధంగా ఈ రోజు మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆలోచించి పిల్లలో ప్రతిభను వెలికి తీయాలి,వాళ్లని ప్రోత్సహించాలి, వెన్ను తట్టి లేపాలన్ని సదుద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని చెప్పారు.సమాజంలో నేడు ఎంతో పోటీ ఉందని, పిల్లల్లో కూడా ఒక్కొక్కరిలో ఒక్కొక్క రకమైన ప్రతిభ దాగి వుంటుందన్నారు. పిల్లల్లో ఉన్న ప్రతిభను తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల అభీష్టాన్ని గుర్తెరిగి,వారిలోని నైపుణ్యాలను వెన్ను తట్టి లేపి ప్రోత్సహించాలన్నారు. ఒక ఐఏఎస్ అధికారి తొలి ప్రయత్నంలో విఫలమైనా, రెండోసారి మరో ప్రభుత్వ ఉద్యోగం వచ్చినా అక్కడితో ఆగకుండా, తన అసలు లక్ష్యమైన ఐఏఎస్ సాధించేందుకు ఏడాది పాటు ప్రతిరోజూ 15 నుంచి 19 గంటలు కష్టపడి చివరకు విజయం సాధించారని సబ్ కలెక్టర్ భావన ను ఉదాహరణగా వివరించారు. జీవితంలో మధ్యలో లభించే విజయాలతో సంతృప్తి చెందకుండా, అసలు లక్ష్యాన్ని చేరుకునే వరకు పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. పాఠశాల లేదా కళాశాలలో మొదటి ర్యాంకు సాధించడం విజయమే అయినప్పటికీ, దానినే అంతిమ గమ్యంగా భావించకూడదన్నారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని నిరంతరం శ్రమిస్తేనే గొప్ప విజయాలు సాధించగలరని చెప్పారు. ఒకరి విజయం మరెందరికో స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకుని, వాటి సాధనకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించు కోవాలని సూచించారు. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, అనుభవజ్ఞుల సలహాలు తీసుకుంటూ ఒక్కో మెట్టు ఎక్కుతూ ముందుకు సాగాలని చెప్పారు. లక్ష్యాన్ని మనసులోనే దాచుకోకుండా, దాన్ని సాధించేందుకు అవసరమైన సహాయాన్ని తీసుకోవడంలో ఎలాంటి సంకోచం అవసరం లేదన్నారు."మీ కల మీదే... దానిని నిజం చేయాల్సిన బాధ్యత కూడా మీదే. ఎప్పటికీ ఓటమిని అంగీకరించొద్దు. 'నెవర్ గివ్ అప్' అనే తత్వంతో ముందుకు సాగండి" అని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు.విద్యకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, విద్యార్థుల భవిష్యత్తు, ఉన్నత విద్య, ఉద్యోగావకాశాల కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. "విద్యార్థులే దేశ భవిష్యత్తు. మీ కలలను నిజం చేసుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలి" అని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.మనం ఎప్పుడూ నిత్య విద్యార్థిని అనే భావనతో ముందుకు సాగాలన్నారు. మన ఇంటి కోసం, మన సొంతం కోసమే కాకుండా.మనతో పాటు సమాజం కోసం కూడా పాటుపడుతూ.దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలన్నారు. మనతో పాటు మన ఇల్లు, మన గ్రామం, మన జిల్లా అనే దృక్పథంతో నడవాలన్నారు.ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.మనం ఎదుగుతూనే మన సమాజంలో తోటి వారి ఎదుగుదలను కూడా ఆకాంక్షించే.మనస్తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. సమాజంలో ఇంకనూ అభివృద్ధి చెందాల్సిన వారు ఎంతో మంది ఉన్నారని, వారి బంగారు భవిష్యత్తుకు సహకారంఅందించాలన్నారు. జిల్లాలో 10వ తరగతి, 12వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి షైనింగ్ స్టార్స్ గా అత్యుత్తమ ప్రతిభ కలిగిన విద్యార్థులుగా అవార్డులు అందుకున్న వారు.భవిష్యత్తులో ఉన్నత విదులతో పాటు, అత్యున్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. సబ్ కలెక్టర్ భావన మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశలను, కలలను సఫలీకృతం చేస్తున్న విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. రాష్ట్ర.ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తూ షైనింగ్ స్టార్స్ అవార్డులను అమలు చేయడం గర్వించదగ్గ విషయం అన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడమే కాకుండా వారి విద్యకు ఆర్థిక చేయూతను ఇవ్వడం అభినందనీయం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య విధానంలో సమూలమైన మార్పులతో విద్యాభివృద్ధికి దోహదపడుతోందన్నారు.

చిన్నప్పటి నుండి కూడా ఇప్పటికే ఎన్నో లక్ష్యాలను ఛేదించి విజయాలను అందుకుని ఉంటారని అక్కడక్కడా ఎదురయ్యే ఓటములను గుణపాఠాలుగా గుర్తించి చక్కటి భవిష్య ప్రణాళికతో ప్రభుత్వం అందించే సహాయ సహకారాలను అందుకోవాలన్నారు.పాఠశాల విద్య ఆర్జేడీ కె శ్యామియేలు మాట్లాడుతూ తల్లిదండ్రులు మనకు అందించిన అవకాశాలను గుర్తెరిగి మన విద్యా, ప్రతిభ ద్వారా వారి గౌరవాన్ని మరింత పెంచేలా విలువలతో కూడిన విద్యను అభ్యసిస్తూ భవిష్యత్తులో ఉన్నత పదవులు, అధికారాలను అధిరోహించాలని విద్యార్థులను కోరారు.ఆర్ఐఓ & డివిఈవో ప్రకాష్ రావు పట్నాయక్ మాట్లాడుతూ విద్యార్థులకు మార్కులు ముఖ్యం కాదని, నిరంతర కొత్త విషయాలు నేర్చుకోవడంతో ఉన్నత స్థానాన్ని అధిరోహించారని, విద్యార్థులు కూడా అలాంటి గుణాన్ని అలవర్చుకుంటే ఏదైనా సాధించగలుగు తామన్నారు. తల్లిదండ్రులు విద్యార్థుల మనస్సును అర్థం చేసుకోవాలన్నారు. మీ లక్ష్యాలను వారిపై రుద్దకుండా వారి యొక్క లక్ష్యాలను సాదించడంలో తోడ్పాటును అందించాలన్నారు. ఏపిసి బి.అనురాధ మాట్లాడుతూ.మానవతా విలువలను కోల్పోకుండా సమాజాన్ని గౌరవిస్తూ. సమాజం కోసం, మన తల్లిదండ్రుల కలలను సాకారం చేసే దిశగా అడుగులేయలన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ఒక మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన విద్యాశాఖ వారికి, అవార్డు పొందిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకుఅభినందనలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.అనంతరం వైఎస్ఆర్ కడప జిల్లాలో 10వ తరగతిలో 248 మంది, ఇంటర్మీడియట్ లో 33 మంది అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మొత్తం 281 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 20వేలు చొప్పున మంజూరైన రూ. 56,20,000 ల మెగా చెక్కును, ప్రశంసా పత్రాలు, మెడల్ లను జిల్లా కలెక్టర్, ముఖ్య అతిథులతో కలిసి. విద్యార్థులకు అందజేశారు. అంతకుముందుగా షైనింగ్ స్టార్ అవార్డు పొందిన విద్యార్థులు,వారి తల్లిదండ్రులు కార్యక్రమంలో తమ మనోభావాలను పంచుకొని.ప్రతిభ గలిగిన విద్యార్థులను వెన్ను తట్టి ప్రోత్సహించడంతోపాటు, విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి పై తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు.ఈ కార్యక్రమంలో ఉప విద్యాశాఖ అధికారులు రాజగోపాల్ రెడ్డి, శివ ప్రసాద్,నాగయ్య, కళాశాలల ప్రిన్సిపాళ్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు,లెక్చరర్లు, ఉపాధ్యాయులు, ఎంఈఓలు, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందేలా చూడాలి

***మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ బి.నర్సింగ్ రావు***



గద్వాల జూలై 20 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు నాణ్యంగా అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అదనపు కలెక్టర్ బి.నర్సింగ్ రావు ఆదేశించారు. సోమవారం మల్దకల్ మండలం బిజ్జారం (పరమాల) గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు, విద్యార్థుల వసతి గృహాలు, వంటశాల,భోజనశాల,పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం,విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఆహార నాణ్యత, పారిశుధ్యం,తాగునీటి సౌకర్యాల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.విద్యార్థుల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల సిబ్బందికి ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించిన అదనపు కలెక్టర్, వారి విద్యాభ్యాసం,వసతి సౌకర్యాల గురించి తెలుసుకొని వారికి నోట్‌బుక్స్,బెడ్‌షీట్లు పంపిణీ చేసి,బాగా చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సిద్దిపేట రూరల్ మండలాల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని విధివిధానాలు పరిశీలించిన జిల్లా కలెక్టర్



సిద్దిపేట జిల్లా ప్రతినిధి జూలై 2026 : సిద్దిపేట రూరల్ మండలం బుస్సాపూర్‌లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా తనికి చేశారు.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలి లో వెజిటేబుల్ బిర్యాని, గుడ్డు, టమాట కందిపప్పు వేసి చేసిన సాంబారులను పరిశీలించారు. వెజిటేబుల్ బిర్యాని, సాంబారు నాణ్యత మెరుగుపరచాలని ఏదో ఇష్టానుసారంగా చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. పాఠశాల ప్రాంగణంలో నిన్న రాత్రి పడిన వర్షానికి మైదానంలో నీరు నిలిచిన గమనించి దోమలు పెరగడానికి అడ్డగా ఉంటాయని సీజనల్ వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉంది కావున నీరు నిలవకుండా చూసుకోవాలని ప్రిన్సిపల్ ను ఆదేశించారు. పక్కన గల లిమండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోలి అన్నం, సాంబారు, గుడ్డు పని పరిశీలించారు. మెను ప్రకారం వెజిటేబుల్ బిర్యాని చెయ్యలేదని అసహనం వ్యక్తం చేశారు. కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని ఏదోటి వండి పెడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని పునరావృతం కాకుండా చూసుకోవాలని లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాష్ బేసిన్ నుండి నీరు బయటికి వస్తున్నట్లు గమనించి, పైప్ లైన్ రిపేర్ చేయించుకుని నీరు బయటికి రాకుండా చేసుకోవాలని అలాగే పాఠశాలలో పిచ్చి మొక్కలు తొలగించాలని ప్రిన్సిపల్ ను ఆదేశించారు.అనంతరం ప్రాంగణంలోని లిఅంగన్వాడీ కేంద్రాన్నిలి సందర్శించి పిల్లలకు అందించే ఆహారాన్ని తనికి చేశారు. రోజు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని అంగన్వాడీ టీచర్ ను ఆదేశించారు. గ్రామంలో SIR ప్రక్రియ గూర్చి ఆరా తీశారు. SIR ఫారాలను డిటైజేషన్ ప్రక్రియ వేగంగా పూర్తి చెయ్యాలని ఆదేశించారు.


## యస్&పీసీ సెక్యూరిటీ సిబ్బందికి ఫస్ట్ ఎయిడ్, ఫైర్ ఫైటింగ్ శిక్షణ ప్రారంభం

**- 42వ బ్యాచ్‌లో 29 మంది సిబ్బందికి వారం రోజుల శిక్షణ**



కొత్తగూడెం బ్యూరో, జూలై 21(విజన్ ఆంధ్ర) : సింగరేణి యస్&పీసీ (సెక్యూరిటీ అండ్ ప్రొటెక్షన్ సెల్) విభాగం ఆధ్వర్యంలో 42వ బ్యాచ్‌కు చెందిన 29 మంది సెక్యూరిటీ సిబ్బందికి ఫస్ట్ ఎయిడ్, ఫైర్ ఫైటింగ్ అంశాలపై వారం రోజుల శిక్షణా తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. కొత్తగూడెంలోని యస్&పీసీ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహిస్తున్న ఈ శిక్షణను ఏరియా సెక్యూరిటీ అధికారి, ట్రైనింగ్ అధికారి ఎం.డి. జాకీర్ హుస్సేన్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి యూనిఫాం సిబ్బందికి ప్రథమ చికిత్స (ఫస్ట్ ఎయిడ్), అగ్నిమాపక (ఫైర్ ఫైటింగ్) అంశాలపై సంపూర్ణ అవగాహన ఉండటం అత్యంత అవసరమన్నారు. అందుకే యస్&పీసీ విభాగంలోని ప్రతి సెక్యూరిటీ సిబ్బందికి క్రమం తప్పకుండా ఈ శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.ఈ శిక్షణ ద్వారా సిబ్బంది వృత్తి నైపుణ్యం, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే సామర్థ్యం గణనీయంగా మెరుగుపడిందన్నారు. వారం రోజులపాటు ఫస్ట్ ఎయిడ్, ఫైర్ ఫైటింగ్‌కు సంబంధించిన అన్ని అంశాలను బోధిస్తామని, ఇందుకోసం సింగరేణి మెయిన్ హాస్పిటల్, మైన్స్ రెస్క్యూ స్టేషన్, భద్రాద్రి కొత్తగూడెం అగ్నిమాపక శాఖ నుంచి నిపుణులను ఫ్యాకల్టీగా తీసుకొస్తున్నట్లు వివరించారు. ఫస్ట్ ఎయిడ్‌పై సరైన అవగాహన ఉంటే ప్రమాద సమయంలో గాయపడిన వారికి వైద్యుడి వద్దకు తీసుకెళ్లేలోపే ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని చెప్పారు. అలాగే విధి నిర్వహణ ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు వెంటనే స్పందించి వాటిని అదుపులోకి తెచ్చి సింగరేణి ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత సెక్యూరిటీ సిబ్బందిపై ఉందన్నారు.మెరుగైన వృత్తి నైపుణ్యం, క్రమశిక్షణ, నీతి, నిజాయితీ, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ సంస్థతో పాటు సమాజాభివృద్ధికి ప్రతి సెక్యూరిటీ సిబ్బంది కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమం ముగింపులో జూనియర్ ఇన్‌స్పెక్టర్ కె. రాజనర్సు వందన సమర్పణ చేశారు.

## ఉమిత్యాల గ్రామంలో కోతుల బెడద... రక్షించండి మహాప్రభో



కేటి దొడ్డి జులై 20( విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా కే.డి.దొడ్డి మండలం ఉమిత్యాల గ్రామంలో గత 5 సంవత్సరాల నుండి కోతులు బెడదా కొనసాగుతూనే ఉన్నది. ఇళ్లలోకి వెళ్లి సంచారం చేస్తున్నాయి. అలాగే గ్రామంలో వృద్ధులు చిన్న పిల్లలను భయ భ్రాంతులకు గురి చేస్తున్న విషయం తెలిసిందే, నేడు ఉమిత్యాల గ్రామంలో రంగన్న ఇంటి దగ్గర వేప చెట్టు కింద ముగ్గురు మహిళలు కూర్చొని ఉండగా 10 కోతులు ఆ చెట్టు పై ఎగరడం దుంకడం వేప చెట్టు కొమ్మ విరిగి మహిళల మీద పడింది. ఆ ముగ్గురి( రంగమ్మ, గోవిందమ్మా, లాలేమ్మా )మహిళలకు తీవ్రంగా గాయాలు అయ్యాయి. జులై 10 వ తారీకు గద్వాల ఎమ్మెల్యే నిర్వహించిన డయల్ యువర్ గద్వాల ఎమ్మెల్యే ప్రోగ్రాంలో ఉమిత్యాల గ్రామస్తులు కోతుల కు సంబంధిం చిన విషయాన్ని కూడా విన్నవించారు ఎమ్మెల్యే స్పందించి త్వరలోనే కోతుల బెడద లేకుండా చూస్తాం అని చెప్పడం జరిగిందని గ్రామ ప్రజలు తెలిపారు. ఎమ్మెల్యే చెప్పి పది రోజులు కూడా కాలేదు మళ్లీ కోతులు యధావిధిగా గ్రామంలో సంకరిస్తున్నాయి. ముందస్తు జాగ్రత్తలు, కోతుల నుండి మాకు రక్షణ కల్పించండి అని సంబంధిత అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు.

## ముందస్తు సమాచారం లేకుండా షాప్ల ముందు రేకుల షెడ్యూల తొలగింపు చర్యలపై వ్యాపారుల తీవ్రతం అసంతృప్తి

**- పరకాలను అభివృద్ధి చేయడమంటే ప్రజలను ఆగం చేయడమా?**
**- ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గందె వెంకటేశ్వర్లు.**



హనుమకొండ జిల్లా (పరకాల మండలం విజన్ ఆంధ్ర) పరకాల పట్టణంలో మున్సిపాలిటీ అధికారులు చేపడుతున్న షాపుల ముందు రేకుల షెడ్ల తొలగింపు చర్యలపై వ్యాపారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పట్టణ అభివృద్ధి పేరుతో చిన్న వ్యాపారులను ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదని పరకాల ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గందె వెంకటేశ్వర్లు అన్నారు. షాపుల ముందు ఎంత మేరకు షెడ్లు ఏర్పాటు చేసుకోవచ్చో ముందుగానే స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసి, వ్యాపారులకు తగిన గడువు ఇవ్వాల్సిందని ఆయన సూచించారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా పోలీసుల సమక్షంలో షెడ్లను తొలగించడం వల్ల చిన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రొక్లెయిన్‌లతో దుకాణాల ముందు ఉన్న సిమెంట్ కాంక్రీట్ నిర్మాణాలను తొలగించి, మట్టిని బయటకు తరలిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయని పేర్కొంటూ, ఆ మట్టిని ఎక్కడికి తరలిస్తున్నారు? అక్కడ చేపట్టబోయే అభివృద్ధి పనులు ఏమిటి? అనే అంశాలపై మున్సిపాలిటీ ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే వ్యాపారాలు మందగించి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న చిన్న వ్యాపారులకు మున్సిపాలిటీ చర్యలు మరింత భారంగా మారుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తవ్విన గుంతలను ఎప్పుడు పూడుస్తారు, ఆ ప్రాంతంలో చేపట్టబోయే అభివృద్ధి పనుల వివరాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. పట్టణ అభివృద్ధి ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలని, వ్యాపారుల జీవనోపాధికి భంగం కలగకుండా మున్సిపాలిటీ వ్యవహరించాలని గందె వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రజల నుంచి వస్తున్న ఆరోపణలు, సందేహాలపై మున్సిపాలిటీ అధికారులు అధికారికంగా స్పందించి వివరణ ఇవ్వాలని ఆయన కోరారు.

## ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ హౌస్ అరెస్ట్ అంకాపూర్ వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు....



ఆర్మూర్ నిజాంబాద్ జిల్లా. జూలై. 20 (విజన్ ఆంధ్ర). అంకాపూర్. లో ఆర్మూర్ ఎమ్మెల్యే .రాకేష్ రెడ్డి కి. మద్దతు తెలిపేందుకు బయలుదేరిన .నిజాంబాద్ అర్బన్ .ఎమ్మెల్యే ధన్ పాల్. సూర్యనారాయణ గుప్తను సోమవారం పోలీసులు ఇంటి వద్ద అడ్డుకొని హౌస్ అరెస్ట్ చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ గుప్తా. మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ ఎన్నికల. సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తి విఫలమైందని విమర్శించారు ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం అనవసర వ్యాఖ్యలతో ప్రజల దృష్టిని మళ్లించే. ప్రయత్నం చేస్తుందని అన్నారు గత రెండున్నర. సంవత్సరాలలో కేంద్ర. ప్రభుత్వం తెలంగాణకు అందించిన నిధులు అభివృద్ధి కార్యక్రమాలపై తాము ఎప్పుడైనా బహిరంగ చర్చకు సిద్ధమని అదే విధంగా రాష్ట్ర. ప్రభుత్వం. ప్రజలకు చేసిన అభివృద్ధి వివరించే ధైర్యం కాంగ్రెస్ నాయకులకు ఉందా అని ప్రశ్నించారు ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు. చెల్లించకపోవడంతో వేలాదిమంది. విద్యార్థులు. భవిష్యత్తులో పడిందని మరోవైపు ఉద్యోగాలు భర్తీ చేయకుండా నిరుద్యోగ యువతను నిరాశ గురి గురి.చేస్తుందని ఆరోపించారు అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వం వైఖరితో తీవ్ర అసంపూర్తిలో ఉన్నారని పేర్కొన్నారు ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతిని రాజకీయ నాయకులను అడ్డుకోవడం హౌస్ అరెస్టు. చేయడం దుర్మార్గ చర్యని. ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేయడానికి. బీజేపీ. సిద్ధంగా ఉంటే దానిని అడ్డుకునేందుకు ప్రభుత్వ పోలీస్ యంత్రాంగాన్ని ఉపయోగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డికి .మద్దతు తెలిపేందుకు. బిజెపి. నాయకులు, కార్యకర్తలు వెళు తున్న ఎక్కడికి అక్కడ వారిని అడ్డుకోవడం అరెస్టు చేయడం ప్రభుత్వ అవగాహన వైఖరికి నిదర్శనమని అన్నారు ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని దన్పాల్. సూర్యనారాయణ గుప్త పేర్కొన్నారు..



## అఖిలపక్ష పార్టీలు జర్నలిస్టుల ఆధ్వర్యంలో ధర్నా..



జులై 20 (విజన్ ఆంధ్ర) : కృష్ణ మండలంలో టై రోడ్ చౌరస్తాలో సోమవారం నమస్తే తెలంగాణ రిపోర్టర్ రాము, జిల్లా ఫోటోగ్రాఫర్ తహేర్ లపై దాడిని ఖండిస్తూ అఖిల నాయకులు చే ధర్నా నిర్వహించారు. . అక్రమ ఇసుక రవాణాపై జర్నలిస్టు రాసిన కథనాలు రాసినందుకు ఇసుకమాఫియా విలేకరిపై భౌతిక దాడి చేయడాని ఖండిస్తూ వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కృష్ణ పోలీస్ స్టేషన్ గుడెబల్లూర్ పంచాయతీ పరిధిలోని టైరోడ్డు చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి. అఖిలపక్ష నాయకులు జిల్లా విలేకర్ల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. పాత్రికేయులపై దాడికి పాల్పడిన దుండగులను మర్డర్ 307 అరెస్టు చేసి వారికి తగిన శిక్ష విధించాలని చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు . గత కొన్ని సంవత్సరాలుగా అక్రమ ఇసుక వ్యాపారం జరుగుతున్న గత పాలకులు ప్రస్తుత పాలకులు రిపోర్టర్ల పైన దాడి చేస్తున్న ఇసుక మాఫియాను అరికట్టడంలో విఫలమయ్యారని సిపిఎం జిల్లా కార్యదర్శి టి నరసింహులు అన్నారు ఇసుక మాఫీ దాడి చేయడము చాలా సిగ్గుచేటు ఇది ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రభుత్వ యంత్రాంగము పాలకులు చర్యలు తీసుకోవాలని బిజెపి నాయకులు కండించారు ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

## చెరువును తలపిస్తోన్న రోడ్డు



రాజోలి,జులై20(విజన్ ఆంధ్ర)ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ జల పాతలయ్యాయి. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వర్షపు నీటితో నిండుకుని, చెరువులను తలపిస్తున్నాయి. రాజోలి మండల పరిధిలోని పచ్చర్ల గ్రామంలో బీసీ కాలనీ లోని రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. గత కొన్నేళ్ల నుంచి ట్రాన్స్ఫార్మర్ ఉండడంతో రోడ్డు లేక కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షాని కి నీరంతా చేరి, ఈ రోడ్లలో ప్రయాణం చేయాలంటే నరకం అనుభవిస్తున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నీరు వెళ్లే మార్గం లేక పోవడంతో రోడ్డుపై నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయి. నిలిచివున్న మురుగు నీటితో రాకపోకలు సాగించడం వల్ల అంటువ్యాధులు సోకుతూ ఇబ్బందులు పడుతున్నామని గ్రామ స్థులు వాపోతున్నారు. మరోపక్క తీవ్రమైన కంపును భరించలేకపోతు న్నామని అంటున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా దోమలు కుడు తున్నాయని, దీంతో ఏం రోగాలు వస్తాయోనని స్థానికులు వణుకుతున్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ సర్పంచ్, సభ్యు లు, పంచాయతీ అధికారులు పారిశుధ్య పను లు చేపట్టి ప్రజలు వ్యాధులబారిన పడకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# అనుమతులు లేని పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

**- ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో యూనిఫాంలు, పుస్తకాల దందా అరికట్టాలని విజ్ఞప్తి**

**- ఎంఈవోకు వినతిపత్రం అందజేసిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ యువజన నేత ముత్యాల మనీష్ పటేల్**



ఇబ్రహీంపట్నం ,జులై 20 (విజన్ ఆంధ్ర) : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో యూనిఫాంలు, పుస్తకాల పేరుతో జరుగుతున్న అక్రమ దందాను అరికట్టాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో)ని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ యువజన అధ్యక్షుడు ముత్యాల మనీష్ పటేల్ ఆధ్వర్యంలో సోమవారం ఎంఈవో కార్యాలయంలో ఈ వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల పరిధిలో అనుమతులు లేకుండా నడుస్తున్న కొన్ని ప్రైవేట్ పాఠశాలల వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న విద్యాసంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపే విధంగా ఒకే దుకాణాల్లో యూనిఫాంలు, పుస్తకాలు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నాయని ఆరోపించారు. ఇటువంటి అక్రమాలను అరికట్టి, విద్యా వ్యవస్థలో పారదర్శకత తీసుకురావాలని ఎంఈవోను కోరారు. విద్యార్థుల హక్కులను పరిరక్షించడంతో పాటు తల్లిదండ్రులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకుంటామని ఎంఈవో హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు, యువజన విభాగం ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 169.4 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

**- మోటం సారంగపాణి తూర్పాటి వెంకటేశ్వర్లు అదుపులోకి తీసుకున్నాం. టాస్క్ ఫోర్స్ అదనపు ఎస్పీ ప్రభాకర్**



భూపాల్ పల్లి జిల్లాగణపురం, జూలై 20 (విజన్ ఆంధ్ర): భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలో అక్రమంగా నిల్వ ఉంచిన 169.4 క్వింటాళ్ల ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యాన్ని అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్, పోలీసు, సివిల్ సప్లై, రెవెన్యూ శాఖల సంయుక్త బృందాలు నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో ఈ భారీ బియ్యం నిల్వ వెలుగుచూసింది. టాస్క్‌ఫోర్స్ అదనపు ఎస్పీ ప్రభాకర్ ఆధ్వర్యంలో గణపురం ఎస్ఐ బొరగల అశోక్, సివిల్ సప్లై, రెవెన్యూ శాఖల అధికారులు పక్కా సమాచారంతో దాడులు నిర్వహించారు. ఒకేచోట అక్రమంగా నిల్వ ఉంచిన 169.4 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, ఈ వ్యవహారానికి సంబంధించిన మోటం సారంగపాణి, తూర్పాటి వెంకటేశ్‌లను అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని తదుపరి విచారణ నిమిత్తం గణపురం మండల కేంద్రంలోని లక్ష్మీ గణపతి రైస్ మిల్లుకు తరలించారు. నిందితులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసే పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడం, రవాణా చేయడం వంటి చర్యలకు పాల్పడేవారిపై6 కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ ఘటనతో జిల్లాలో అక్రమ పీడీఎస్ బియ్యం నిల్వలు, రవాణాపై అధికారుల నిఘా మరింత కట్టుదిట్టం కానున్నట్లు తెలుస్తోంది.

# ప్రమాదాలకు నిలయంగా పోరుమామిళ్లరహదారులు.

**- కలెక్టర్‌కు హ్యూమన్ రైట్స్ రాష్ట్ర కార్యదర్శి వినతి**

**- రూ.28 కోట్ల డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని డిమాండ్**



బద్వేలు, జూలై 20 (విజన్ ఆంధ్ర)వైయస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల పట్టణంలోని ప్రధాన రహదారులు గుంతలమయంగా మారడంతో పాటు డ్రైనేజీ పనులు సంవత్సరాలుగా పూర్తి కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర కార్యదర్శి ముత్యాల ప్రసాద్‌రావు వైఎస్సార్ కడప జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పోరుమామిళ్ల పట్టణంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సర్కిల్ నుంచి బద్వేల్ రోడ్డులోని కమ్మవారిపల్లె వరకు, అలాగే మైదుకూరు రోడ్డులోని వసుంధర కళ్యాణ మండపం వరకు ప్రధాన రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు.కడపవిజయవాడ ప్రధాన రహదారి, బద్వేల్‌పోరుమామిళ్ల రహదారులపై భారీ గుంతలు ఏర్పడి వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు.వర్షాలు కురిసిన సమయంలో గుంతల్లో నీరు నిలిచి ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాల రాకపోకలు సైతం ఇబ్బందికరంగా మారుతున్నాయని, అత్యవసర సేవలు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో వివరించారు. ఈ సమస్యలపై పలుమార్లు పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలో కథనాలు వచ్చినప్పటికీ సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు స్పందించలేదని, మండల, జిల్లా అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందనిపేర్కొన్నారు.అదేవిధంగా, పోరుమామిళ్ల పట్టణంలో సుమారు రూ.28 కోట్ల వ్యయంతో చేపట్టిన డ్రైనేజీ పనులు ఆరు సంవత్సరాలుగా కొనసాగుతున్నప్పటికీ ఇప్పటికీ పూర్తి కాలేదని, ప్రణాళికాబద్ధంగా పనులు జరగక ప్రజలు నిత్యం ఇబ్బందులుఎదుర్కొంటున్నారని తెలిపారు. ధ్వంసమైన రహదారులకు తక్షణ మరమ్మత్తులు చేపట్టడంతో పాటు అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయించాలని, నిర్లక్ష్యం వహించిన అధికారులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ముత్యాల ప్రసాద్‌రావు వినతిపత్రం ద్వారా కోరారు.

# కల్వకుర్తి పుణ్యభూమిలో ప్రారంభమైన 91వ విశ్వశాంతి మహాయాగం

- "ప్రపంచమంతా రామరాజ్యం" సంకల్పంతో 15 రోజుల మహోత్సవం
- శ్రీ సీతారామ సామ్రాజ్య పట్టాభిషేకానికి భక్తుల పోటెత్తు
- యాగంలో పాల్గొన్న పట్టణ ప్రముఖులు, రాజకీయ నాయకులు
- అయుత చండీ, అతిరుద్ర యాగాలతో భక్తి జ్వాల
- స్వామీజీ కృష్ణ జ్యోతి స్వరూపానంద దివ్యాశీస్సులతో



యాగం కోసం ఏర్పాటు చేసిన మండపం...

**- జూలై 19న పుణ్యాహవాచనంతో ప్రారంభం...**

**- ఆగస్టు 2న పట్టాభిషేకం..**

**- లక్షలాది భక్తులకు అన్నప్రసాదం...**

**ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, జూలై 21 (విజన్ ఆంధ్ర)**



కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ....

ప్రపంచ శాంతి, సర్వజన క్షేమం కోసం శ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ వారి దివ్య మంగళాశాసనములతో నిర్వహిస్తున్న 91వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవం జూలై 19 ఆదివారం నాడు కల్వకుర్తిలో ఘనంగా ప్రారంభమైంది. గ్రౌండ్లో జరుగుతున్న ఈ 15 రోజుల



స్వామీజీతో సీఐ భీమ్ కుమార్, పట్టణ ప్రజలు...

మహాయాగానికి తొలి రోజు నుండే లక్షలాది భక్తులు తరలివచ్చారు. పట్టణ ప్రముఖులు, రాజకీయ నాయకులు కూడా యాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### జూలై 19న వైభవంగా శంఖారావం

తొలి రోజు పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రోక్షణ, యాగశాల ప్రవేశం తో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. స్వామీజీ ఆధ్వర్యంలో వేద పండితులు మంత్రోచ్ఛారణలతో యాగాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పట్టణ రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొని యాగ కర్తలకు అభినందనలు తెలిపారు. "ప్రపంచ శాంతికి ఇలాంటి యాగాలు అవసరం" అని వారు పేర్కొన్నారు.

### "వసుధైక కుటుంబం" సంకల్పంతో మహాయాగం

"శ్రీరామ రాజ్యం మన దేశంలోనే కాదు, యావత్ ప్రపంచమంతా రావాలనే" గొప్ప సంకల్పంతో ఈ యాగం జరుగుతోందని యాగ కమిటీ తెలిపింది. రామాయణం– సత్య ధర్మ స్వరూపిణి, కరుణామృత వాహిని. "రామో విగ్రహవాన్ ధర్మః" అనే నినాదంతో భక్తులు రామనామ జపం చేస్తున్నారు.

### మహాయాగంలో 5 మహాయాగాలు

91వ విశ్వశాంతి మహాయాగంలో ఏకకాలంలో 5 మహాయాగాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఆగస్టు 2న లక్ష పుష్పాలతో శ్రీ సీతారామ సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహించనున్నారు. అదేవిధంగా విష్ణుపంచాయతనం అయుత చండీ యాగంలో 10 వేల పారాయణలు, 1000 హోమాలు జరుగనున్నాయి. "సర్వం రుద్రమయం జగత్" అనే సంకల్పంతో అతిరుద్ర మహాయాగం, మహాసుదర్శన, లక్ష్మీనారాయణ సహిత శ్రీమద్భాగవత యాగం, శ్రీ కృష్ణ కాలచక్ర యంత్ర పూజలు కూడా నిర్వహించబడుతున్నాయి. ఈ యాగాల వల్ల రోగ నివారణ, కార్యసిద్ధి, వివాహప్రాప్తి, సంతానప్రాప్తి, ఐశ్వర్యాభివృద్ధి కలుగుతుందని నిర్వాహకులు తెలిపారు. 26వ తేది ఆదివారం నాడు వివాహం కాని వారికి ప్రత్యేక హోమం నిర్వహించి సాయంత్రం 5 గంటలకు శ్రీ ఉమామహేశ్వర కళ్యాణం జరుపనున్నారు. 02వ తేదీ శనివారం సాయంత్రం 5 గంటలకు శ్రీ సీతారామ సామ్రాజ్య పట్టాభిషేకం పుష్పయాగంతో వైభవంగా జరుగనుంది. 03వ తేదీ సోమవారం శ్రీ కృష్ణ ఉట్టిగొట్టులు, రాధాకృష్ణ కళ్యాణంతో పాటు పూర్ణాహుతితో మహాయాగం ముగుస్తుంది.

### భక్తులకు పిలుపు

ఈ మహాయాగంలో అందరూ ఉచితంగా పాల్గొనవచ్చు. విశ్వశాంతి, లోక కళ్యాణం కోసం జరిగే ఈ దివ్య యజ్ఞాన్ని విజయవంతం చేయాలని యాగ కమిటీ కోరింది....

# ప్రజావాణిలో ప్రజల సమస్యలకు ప్రాధాన్యం

**- మేడ్చల్‌మల్కాజిగిరి ఐడీఓసీలో 84 అర్జీలు స్వీకరణ**

**-జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహణ**

**-ప్రజలతో పాటు రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి వినతుల స్వీకరణ**

**-ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు పంపాలని అధికారులకు ఆదేశం**

**-అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టమైన సూచన**

**-ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపు**

**-ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా సేవలందించాలని అధికారులకు దిశానిర్దేశం**



కుత్బుల్లాపూర్, జూలై 20 (విజన్ ఆంధ్ర); ప్రజల సమస్యలకు వేగవంతమైన పరిష్కారం అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ప్రజావాణి' కార్యక్రమం సోమవారం మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) సమావేశ మందిరంలో ఘనంగా జరిగింది. జిల్లా కలెక్టర్ మను చౌదరి, ఐఏఎస్, జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) మాలతితో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ సమస్యలు, వినతిపత్రాలను కలెక్టర్‌కు అందజేశారు. ఈ ప్రజావాణిలో మొత్తం 84 అర్జీలు నమోదు కాగా, ప్రతి వినతిని కలెక్టర్ స్వయంగా పరిశీలించి సంబంధిత శాఖలకు పంపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ, ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించి, నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం ద్వారా ప్రభుత్వంపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# తెలంగాణ నర్సులకు విదేశాల్లో భారీ ఉద్యోగాలు..

## టామ్‌కామ్‌గ్లోబల్ నర్స్ ఫోర్స్ మధ్య ఎంఓయూ

**అంతర్జాతీయ ప్రమాణాలతో శిక్షణ, భాషా కోర్సులు, ప్లేస్‌మెంట్ సౌకర్యాలు.. జర్మనీ, జపాన్, ఇజ్రాయెల్ సహా పలు దేశాల్లో అవకాశాలు: మంత్రి డా. జీ. వివేక్ వెంకటస్వామి**

హైదరాబాద్, జూలై 20: తెలంగాణకు చెందిన అనుభవజ్ఞులైన నర్సులకు విదేశాల్లో భారీగా ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన నర్సులను గుర్తించి, అంతర్జాతీయ ప్రమాణాలకు



అనుగుణంగా ప్రత్యేక శిక్షణ అందించి, తెలంగాణ ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ (టామ్‌కామ్) ద్వారా విదేశాలకు పంపించే ప్రక్రియను వేగవంతం చేస్తోంది. ఇందులో భాగంగా టామ్‌కామ్ (టీఓఎంసీఓఎం) మరియు గ్లోబల్ నర్స్ ఫోర్స్ (+శ్రీశీఝశ్రీ చీబతీంవ ఖీశతీఙవ) మధ్య సోమవారం అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. ఈ ఒప్పందం రాష్ట్ర శక్తి (కార్మిక, ఉపాధి, శిక్షణ & ఫ్యాక్టరీస్) మరియు గనుల శాఖ మంత్రి డా. జీ. వివేక్ వెంకటస్వామి సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా మంత్రి డా. జీ. వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, యూరప్‌తో పాటు ప్రపంచంలోని పలు దేశాల్లో నైపుణ్యం కలిగిన భారతీయ నర్సులకు రోజురోజుకూ డిమాండ్ పెరుగుతోందన్నారు. ఆ అవకాశాలను తెలంగాణ యువతకు అందించేందుకు ప్రభుత్వం టామ్‌కామ్ ద్వారా సమగ్ర కార్యాచరణ అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన నర్సులను గుర్తించడం, ఇంటర్వ్యూలు నిర్వహించడం, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా శిక్షణ అందించడం, విదేశీ నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. టామ్‌కామ్‌గ్లోబల్ నర్స్ ఫోర్స్ భాగస్వామ్యంతో నర్సులకు విదేశీ ఉద్యోగాలకు అవసరమైన జర్మన్‌తో పాటు ఇతర విదేశీ భాషల శిక్షణ, క్లినికల్ కమ్యూనికేషన్, ఇంటర్వ్యూ నైపుణ్యాలు, వీసా, లైసెన్సింగ్, ప్లేస్‌మెంట్ వంటి అంశాల్లో సమగ్ర సహకారం అందించనున్నట్లు మంత్రి వెల్లడించారు. జర్మనీ, జపాన్, ఇజ్రాయెల్‌తో పాటు ఇతర దేశాల్లో నాణ్యమైన ఉద్యోగ అవకాశాలను కల్పించడమే ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యమని చెప్పారు. విదేశీ ఉపాధి కార్యక్రమాలు తెలంగాణ యువతకు మాత్రమే కాకుండా ఆతిథ్య దేశాల ఆరోగ్య రంగ అవసరాలను కూడా తీర్చే విధంగా ఉండాలని మంత్రి పేర్కొన్నారు. అభ్యర్థులకు అత్యున్నత ప్రమాణాలతో శిక్షణ అందించి, అంతర్జాతీయ ఆరోగ్య రంగ అవసరాలకు అనుగుణంగా వారిని తీర్చిదిద్దాలని గ్లోబల్ నర్స్ ఫోర్స్ ప్రతినిధులను కోరారు. శిక్షణ, నియామకాల నాణ్యతపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య రంగంలో అవకాశాలు వేగంగా పెరుగుతున్నాయని, అనుభవజ్ఞులైన నర్సులతో పాటు కొత్తగా నర్సింగ్ పట్టభద్రులవుతున్న యువత కూడా విదేశీ ఉద్యోగాలపై ఆసక్తి చూపడం సానుకూల పరిణామమని మంత్రి అన్నారు. తెలంగాణ నైపుణ్యాన్ని ప్రపంచ ఉపాధి అవకాశాలతో అనుసంధానం చేసే విశ్వసనీయ వేదికగా టామ్‌కామ్ ఎదుగుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి మరియు శిక్షణ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ, ఐఏఎస్, టామ్‌కామ్ జనరల్ మేనేజర్, గ్లోబల్ నర్స్ ఫోర్స్ ప్రతినిధి పరమానంద సంత్రా తదితరులు పాల్గొన్నారు.

# సుభాష్ నగర్ లోఘనంగా అమరుల బంధుమిత్రుల సంఘం 24వ ఆవిర్భావ దినోత్సవం



అల్వాల్, జూలై 20,( విజన్ ఆంధ్ర): అల్వాల్ సర్కిల్ పరిధిలోని సుభాష్ నగర్ లో 'అమరుల బంధుమిత్రుల సంఘం' 24వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. సుభాష్ నగర్ స్తూపం దగ్గర మీ జ్ఞాపకాలతో జీవిస్తాం,మీ ఆలోచనతో ముందుకు పోతాం అంటూ ఈ ఏడాది చనిపోయిన మోదం బాల కృష్ణ, సత్యనారాయణ రెడ్డి, రామచంద్రారెడ్డి, హనుమం తు, భాగ్య, జోగారావులకు ఘనంగా నివాళులర్పించా రు. అమరుల త్యాగాలను స్మరించుకుందాం. పేద ప్రజల కోసం ప్రాణాలు ఇచ్చిన గొప్పవాళ్లు. మనుషులు చనిపోయిన వాళ్ళ ఆలోచనలు ఆగిపోవని విప్లవ గీతాలతో ఆలపించారు. ఈ కార్యక్రమంలో బంధుమిత్రుల సంఘం సభ్యులు, నాయకులు పద్మ కుమారి, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.


# భూదేవి నగర్ లో 'సర్' పై అవగాహన



అల్వాల్, జూలై 20,( విజన్ ఆంధ్ర): అల్వాల్ సర్కిల్ భూదేవి నగర్ పార్క్ వద్ద 'సర్' కార్యక్రమం పై అవగాహన నిర్వహిం చారు. 'సర్' కార్యక్రమం నిరువిఘ్నంగా కొనసాగా లని కోరుతూ, దీనిపై అవగాహన కల్పిస్తు న్నామని నాయకులు తెలిపారు. ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించే ప్రక్రియ కొనసాగుతుందని, భయపడే అవసరం లేద న్నారు. రాష్ట్ర వ్యాప్తంగా న సర్ కార్యక్రమం ఆగస్టు 3వతేదీ వరకు కొనసా గుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ బీఎల్ ఓలకు సహకరించి,తమ ఓటు వివరాలను తప్పనిసరిగా ధృవీకరించుకోవాలన్నారు. కొత్త ఓటు నమోదు, చిరు నామా మార్పులు,చేర్పులు కోసం ఆగస్టు 10వ తేదీ నుంచి సెప్టెంబర్ 9వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరి స్తారని తెలిపారు. సరైన టైంలో దరఖాస్తులను పూర్తి చేసి బిఎల్ ఓ లకు అందజే యాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో మల్లెల శివ, అశోక్ రెడ్డి, కృష్ణగౌడ్, భాస్కర్, బాల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు

# వంట కార్మికుల హామీలు అమలుచేయాలి.

**- ములుగులో ఏఐటీయూసీ ర్యాలీ, ధర్నా**



ములుగు, జూలై 19 విజన్ ఆంధ్ర ప్రతినిధి : మధ్యాహ్న భోజన వంట కార్మికులకు రూ.10,000 వేతనం హామీని వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ములుగులో ర్యాలీ, ధర్నా నిర్వహించారు. తెలంగాణ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడుతూ, అల్పాహారం పథకాన్ని అక్షయపాత్రకు అప్పజెప్పడం వల్ల కార్మికులు రోడ్డున పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. కోడిగుడ్లు, గ్యాస్, నిత్యావసర సరుకులను ప్రభుత్వమే సరఫరా చేయాలని, రాజకీయ కారణాలతో కార్మికులను తొలగించవద్దని కోరారు. అల్పాహారాన్ని కూడా వంట కార్మికులతోనే చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు బండి నర్సయ్య, గడ్డం భారతి తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ లోని చారిత్రిక శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి ఆలయం, (హరిబౌలి) 78వ బోనాల వార్షిక ఉత్సవాల ఆహ్వాన పత్రికను సోమవారం నాడు ఉదయం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ నగర ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. బంజారా హిల్స్ మినిస్టర్స్ క్వార్టర్స్ లో జరిగిన కారిక్రమంలో పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ తరపున బోనాల ఉత్సవాల నిర్వహణకు అని రకాలుగా సహకారం అందిస్తామని, చారిత్రిక శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి అమ్మవారి బోనాల జాతరలో ఈ సారి కర్ణాటక రాష్ట్రం నుండి లక్ష్మీ ఏనుగు పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు డి.ఆర్.ప్రభాకర్, కార్యదర్శి కె.దత్తాత్రేయ, ప్రతినిధులు జగ్మోహన్ కపూర్, ఏ.సతీష్, ఎస్.పి.క్రాంతి కుమార్, ఏం.వినోద్ కుమార్, సాయికిరణ్, రవీందర్ చారి, ఎల్.అరుణ్, సాహిల్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ రాయితీ మాయాజాలం
## జర్నలిస్టుల జేబులకు చిల్లు !



- 1/3 రాయితీకి మంగళం.. సగం ధరకంటే ఎక్కువే వసూలు
- ఎక్స్‌ప్రెస్‌లో 55శాతం, ఎలక్ట్రిక్ బస్సుల్లో 60శాతం బాదుడు
- బస్సు పాస్‌లో ఒకటి.. టికెట్ మిషన్‌లో మరొకటి !
- సాఫ్ట్‌వేర్ సాకుతో అదనపు వసూళ్లు.. బెంబేలెత్తుతున్న విలేకరులు

సిద్దిపేట జిల్లా, 20 జూలై 2026 (విజన్ ఆంధ్ర ప్రతినిధి) : ప్రజా సమస్యల పరిష్కారం కోసం, సమాజ హితం కోసం అహర్నిశలు శ్రమించే జర్నలిస్టులకి ఆర్టీసీ షాక్ ఇస్తోంది. జర్నలిస్టులకు ఇచ్చే ప్రయాణ రాయితీల్లో నిశ్శబ్దంగా కోత విధిస్తూ, వారిపై అదనపు భారాలు మోపుతోంది. గతంలో అమలైన 1/3 (మూడో వంతు) రాయితీని కాగితాలకే పరిమితం చేస్తూ, క్షేత్రస్థాయిలో సగం కంటే ఎక్కువ ధరను వసూలు చేస్తుండటంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్టేట్ అక్రిడిటేషన్ నిబంధనల ప్రకారం జర్నలిస్టులకు టికెట్ ధరలో కేవలం 33 నుండి 35 శాతం మాత్రమే వసూలు చేయాలి. కానీ, ప్రస్తుతం ఆర్టీసీ దాదాపు 50 శాతం (1/2 ధర) కంటే ఎక్కువే వసూలు చేస్తోంది. బస్సు పాస్‌ల మీద స్పష్టంగా 1/3 రాయితీ అని ముద్రిస్తున్న అధికారులు, టికెట్ ఇష్యూయింగ్ మిషన్లలో (టిమ్స్) మాత్రం ఆ మేరకు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయకపోవడమే ఈ దోపిడీకి కారణమని తెలుస్తోంది.

**ఎక్స్‌ప్రెస్, ఎలక్ట్రిక్ బస్సుల్లో చుక్కలు....**

సాధారణ పల్లె వెలుగు బస్సుల కంటే ఎక్స్‌ప్రెస్, ఎలక్ట్రిక్ సర్వీసుల్లో జర్నలిస్టులకు రాయితీ భారం భారంగా మారింది. ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో వీటిలో జర్నలిస్టుల నుంచి ఏకంగా 53 శాతం నుండి 55 శాతం వరకు టికెట్ ధర వసూలు చేస్తున్నారు. అంటే రాయితీ 50 శాతం కూడా ఉండటం లేదు. ఎలక్ట్రిక్ బస్సుల్లో పర్యావరణ హితం పేరిట వచ్చిన ఈ బస్సుల్లో జర్నలిస్టులకు అసలైన షాక్ తగులుతోంది. ఇక్కడ ఏకంగా 60 శాతం ధర వసూలు చేస్తూ, కేవలం 40 శాతం రాయితీతోనే సరిపెడుతున్నారు.

**కండక్టర్లతో వాగ్వివాదాలు.. మిషన్లదే తప్పు!**

బస్సుల్లో రాయితీపై కండక్టర్లను ప్రశ్నిస్తే.. మేమేం చేయలేం.. మిషన్లలో (టిమ్స్) ఫీడింగ్ ఎలా ఉంటే అలాగే టికెట్ వస్తుందని వారు చేతులెత్తేస్తున్నారు. రాయితీ లెక్కల్లో స్పష్టత లేకపోవడంతో నిరంతరం జర్నలిస్టులకు, కండక్టర్లకు మధ్య వాగ్వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. దూరాన్ని బట్టి లెక్కించాల్సిన రాయితీలు అస్తవ్యస్తంగా మారుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వార్తల సేకరణ కోసం జిల్లా కేంద్రాలకు, ఇతర పట్టణాలకు నిరంతరం ప్రయాణించే విలేకరులకు ఈ టికెట్ భారం గుదిబండగా మారింది. అతి తక్కువ జీతాలతో పని చేసే జర్నలిస్టులు, తమ సంపాదనలో ఎక్కువ భాగం ప్రయాణాలకే వెచ్చించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**జర్నలిస్టు సంఘాల డిమాండ్..**

ఆర్టీసీ యాజమాన్యం తక్షణమే స్పందించి అన్ని రకాల బస్సుల్లో (ఎక్స్‌ప్రెస్, ఎలక్ట్రిక్ సహా) పాత పద్ధతిలో మూడోవంతు రాయితీని పక్కాగా అమలు చేయాలని జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. యూజర్ చార్జీల నుంచి జర్నలిస్టులకు మినహాయింపు ఇవ్వాలని, టికెట్ మిషన్లలో సాఫ్ట్‌వేర్ లోపాలను సరిదిద్దాలని కోరుతున్నాయి. ప్రభుత్వ పెద్దలు స్పందించి ఈ రాయితీ కోతకు అడ్డుకట్ట వేయాలని జర్నలిస్టులు కోరుతున్నారు.

# విజన్ ఆంధ్ర వరుస కథనాలతో స్పందించిన కలెక్టర్..

- చౌడూరు క్రషర్‌పై తనిఖీలు
- 500 మీటర్ల నిబంధన ఉల్లంఘన.. పొలాల మధ్యలో క్రషర్ నిర్వహణ
- బాంబు బ్లాస్టింగ్‌తో గ్రామాల్లో రాళ్లు, దుమ్ము పడుతూ... బోర్లు ఎండిపోతున్నాయని ఆవేదన
- విజన్ ఆంధ్ర కథనాలతో కదిలిన కలెక్టర్.. తహసీల్దార్ బృందం క్షేత్రస్థాయి తనిఖీ
- క్రషర్ నుంచి వెలువడుతున్న దుమ్ముతో వాయు కాలుష్యంతో ప్రజల అవస్థలు..


నాటి క్షేత్రస్థాయి అధికారుల రికార్డు తప్పిదమే నేడు చౌడూరు ప్రజలకు శాపం

విజన్ ఆంధ్ర

నవాబ్‌పేట, జూలై 20, (విజన్ ఆంధ్ర): నవాబ్‌పేట మండలం చౌడూరు గ్రామ శివారు సర్వే నెం.352లో నడుస్తున్న అక్రమ క్రషర్‌పై బివిజన్ ఆంధ్రబి లో వరుస కథనాలు ప్రచురితం కావడంతో జిల్లా కలెక్టర్ స్పందించారు. బ్లాస్టింగ్, దుమ్ము కాలుష్యంతో చుట్టుపక్కల గ్రామాలు, తాండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వార్తలు రావడంతో తక్షణమే విచారించి నివేదిక ఇవ్వాలని నవాబ్‌పేట రెవెన్యూ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ ఆధ్వర్యంలోని రెవెన్యూ బృందం సోమవారం క్రషర్ సైట్‌ను పరిశీలించింది. తనిఖీలో పలు నిబంధనల ఉల్లంఘనలు వెలుగుచూశాయి. ఈ మేరకు పూర్తి వివరాలతో నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని, మండల రెవెన్యూ అధికారులు తెలిపారు.

# గుండె వైపల్య రోగులలో గుండె పనితీరు మెరుగుపరిచే ప్రత్యేక చికిత్స

- కన్సల్టెన్సీ కార్డియాలజీ ఎలక్ట్రో ఫిజియాలజిస్ట్ అండ్ హార్ట్ ఫెయిల్యూర్ స్పెషలిస్ట్ డాక్టర్ ఎం.ఎస్.చంద్రమౌళి



హన్మకొండ జిల్లా ప్రతినిధి జులై 20 ( విజన్ ఆంధ్ర ) : యశోద హాస్పిటల్ లో కార్డియాక్ ఎలక్ట్రో ఫిజియోలజీ విభాగం గుండె స్పందనలో వచ్చే అసాధారణ నిర్ధారణ చికిత్స ప్రతి మనిషిలో గుండె వైపల్య గుండె పనితీరు మెరుగుపరిచే ప్రత్యేక చికిత్స అని అన్నారు. సోమవారం హనుమకొండ లోని యశోద క్లినిక్ లో మీడియా సమావేశం నిర్వహించి కన్సల్టెన్సీ కార్డియాలజీ ఎలక్ట్రో ఫిజియోలజిస్ట్ అండ్ హార్ట్ ఫెయిల్యూర్ స్పెషలిస్టు ఎమ్. ఎస్. చంద్రమౌళి మాట్లాడుతూ.. అత్యాధునిక మ్యాపింగ్ సిస్టం సహాయంతో నిర్వహించే ప్రత్యేక ప్రక్రియను మెట్రిక్లర్ టాకీ కార్డియా అబ్లేషన్ ప్రాణాపాయ గుండె స్పందన వ్యాధులకు అధునాతన చికిత్స ఫేస్ మేకర్ ఎంప్లాటేషన్ సిస్టం ఛాంబర్, డ్యూయల్ ఛాంబర్ కండక్షన్ సిస్టం ఫేసింగ్ పద్ధతులు లీడ్స్ ఫేస్ మేకర్ వైర్లు లేకుండా అమర్చే అత్యధిక ఆకస్మిక గుండె మరణాన్ని నివారించే ప్రాణ రక్షక పరికరం అని అన్నారు. గుండె స్పందనలో వచ్చే అసాధారణతలను చాలామంది సాధారణ సమస్యగా భావించి నిర్లక్ష్యం చేస్తానని అన్నారు. అయితే గుండె సమస్యకు ముందు తల తిరగడం స్పృహ కోల్పోవడం గుండె దడ లేదా శ్వాస ఇబ్బంది వంటి లక్షణాలు తీవ్రమైన రితం సమస్యలకు సంకేతాలు కావచ్చునని ఆధునిక ఎలక్ట్రో పిజియాలజీ చికిత్సల ద్వారా చాలామంది రోగులు పూర్తిస్థాయి ఆరోగ్యాన్ని తిరిగి పొందగలుగుతున్నారు. సరే అనే సమయంలో నిపులను సంప్రదించడం అత్యంత ముఖ్యమని అన్నారు. యశోద హాస్పిటల్ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సేవలు అందిస్తుందని అన్నారు. గుండె స్పందన సక్రమంగా ఉంటే జీవితం సురక్షితం ప్రతిస్పందన కాపాడటం మా బాధ్యత అని తెలిపారు.

# నేరేడ్ మెట్‌లో బైక్ దొంగ అరెస్ట్

- నిందితుడి వద్ద నుంచి 11 ద్విచక్ర వాహనాలు స్వాధీనం





మల్కాజిగిరి,జూలై 20,(విజన్ ఆంధ్ర) : మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరుస బైక్ చోరీలకు పాల్పడుతున్న నిందితుడుని నేరేడ్‌మెట్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి 11 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మేడ్చల్ జిల్లా అత్తివెల్లి గ్రామానికి చెందిన గుడిసె సుశాంత్ (32) గత కొంతకాలంగా బైక్ చోరీలకు పాల్పడుతున్నాడు. బాధితులు ఫిర్యాదు మేరకు నేరేడ్‌మెట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడు సుశాంత్ తో పాటు,చోరీ సొత్తు కొనుగోలు చేసిన మరో వ్యక్తిని నేరేడ్మెట్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి చోరీకి గురైన 11 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారని మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. ప్రజలు తమ బైక్ పార్క్ చేసే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఇంటి వద్ద రక్షణ నిమిత్తం సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని డీసీపీ శ్రీధర్ కోరారు.


# సిరా చుక్క కాదు... రైతన్న గుండె కన్నీటి చుక్క!!

- నెర్రెలు బారిన నేలపై... కన్నీటి ప్రార్థన
- వానదేవుడి కోసం 'కప్ప తల్లి' వేడుకోలు
- టెక్నాలజీ యుగంలోనూ తగ్గని సెంటిమెంట్
- ఆకాశానికి పల్లె జనం పంపిన మెసేజ్




**ఆకాశం వైపు చూసి చూసి కళ్లు కాయలు కాసిన వేళ, చినుకు కోసం రైతన్న పడుతున్న ఆర్తికి అద్దం పడుతోంది ఈ 'కప్పతల్లి' సంప్రదాయ ఆట. టెక్నాలజీ యుగంలోనూ భూతల్లి నెర్రెలు వీడాలంటే ఆకాశపు జల్లే శరణ్యమనే ఏకైక నమ్మకంతో పల్లెల్లో ఈ ప్రాచీన సంస్కృతి మళ్లీ ఊపిరి పోసుకుంది. ఈ కప్ప తల్లి ఆటపై "విజన్ ఆంధ్ర" స్పెషల్ స్టోరీ**


ఇంటింటి నీటి అభిషేకం - రైతుల ఆశ


వానదేవుడి కోసం ఊరేగింపు - కప్పతల్లి పూజ

**హైదరాబాద్, జూలై 20:**
ఆకాశం వైపు చూసి చూసి కళ్లు కాయలు కాశాయి. నెర్రెలు బారిన భూతల్లిని చూసి రైతన్న గుండె తరుక్కుపోతోంది. ఆధునిక కాలంలో ఉన్నాం, శాస్త్ర సాంకేతికతతో దూసుకుపోతున్నాం, మెట్రో ట్రైన్లలో ప్రయాణిస్తున్నాం... కానీ, కంచెలోని అన్నం గిన్నె నిండాలంటే ఆకాశం వైపు చూడక తప్పదు కదా? అందుకే, సాంకేతిక యుగంలోనూ మన మూలాలను వెతుక్కుంటూ, పల్లెటూరి సెంటిమెంట్‌ను గుండెలకు హత్తుకుంటూ సాగిన ఒక అద్భుత దృశ్యం ఇది. వానదేవుడి కరుణ కోసం పల్లె జనం చేసిన కప్ప తల్లి ఆట... కేవలం ఒక ఆచారం కాదు, అది కరువుపై కన్నెర్ర చేసిన పల్లెటూరి గుండె చప్పుడు!

**ఆధునికత దాటని ఆత్మీయ బంధం**

ఈ రోజుల్లో వర్షం రాకపోతే స్మార్ట్‌ఫోన్లలో వెదర్ యాప్స్ చూస్తాం, క్లౌడ్ సీడింగ్ గురించి గూగుల్ చేస్తాం. కానీ, పల్లెటూరి ప్రేమాభిమానాలకు, నమ్మకానికి ఇవేవీ సరిపోవు. ప్రకృతిని సైతం తమ ఇంట్లో మనిషిలా భావించే అమాయకత్వం, ఆత్మీయత మన గ్రామీణ సంస్కృతి సొంతం. ఊరంతా ఏకమై, ఒక కప్పను పళ్లెంలో ఉంచి, పసుపు కుంకుమలతో అలంకరించి, పూలదండలు వేసి... ఇంటింటికీ తిరుగుతుంటే, అది చూసే ప్రతి కంటిలోనూ ఒకే ఆశ... ఒక్కటంటే ఒక్క చినుకు పడదా అని!
"కప్ప తల్లి పెళ్లికని కడవలతో నీళ్లు పోస్తే..ఆకాశపు పందిరిలో మేఘాలు కరగవా అంటూ ఆడపడుచులు పాడిన జానపద గీతాలు, ఊరి వీధుల్లో మోగిన డప్పు చప్పుళ్లు ఈ కాంక్రీట్ జంగిల్ దాటి ప్రతి ఒక్కరి హృదయాన్ని కదిలించాయి.

**కప్ప తల్లి ఆట: సంప్రదాయం వెనుక ఉన్న వేదన**

ప్రకృతిలో ప్రతి జీవికీ ప్రాధాన్యత ఉందనే గొప్ప పర్యావరణ స్పృహతోనే పల్లెల్లో 'కప్పను పూజించడం' అనే ఆచారం పుట్టుకొచ్చింది. కరువు కాలంలో వానదేవుడికి స్వాగతం పలికే ఒక సామూహిక సెంటిమెంట్‌తోనే ఊరేగింపుగా వస్తున్న కప్పతల్లిపై 'ఇంటింటికీ నీళ్లు చల్లడం' ఆనవాయితీగా వస్తోంది. ఈ వేడుకలో భాగంగా సాగే 'జానపద నృత్యాలు' కరువు తెచ్చిన మానసిక బాధను మరిచిపోవడానికే కాకుండా, అందరిలో సంతోషాన్ని పంచుకునే ప్రయత్నంగా నిలుస్తాయి. సైన్స్ యుగంలోనూ ప్రకృతిని దైవంగా భావించే ఈ పద్ధతులు పల్లెటూరి ఆత్మీయతకు, సమిష్టి ఆరాటానికి సజీవ సాక్ష్యాలు. చినుకు కోసం ఎదురుచూసే అన్నదాతల ఆశలను, ఈ ఆచారాల వెనుక ఉన్న ఆధునిక భావోద్వేగ కోణాన్ని ఈ సంప్రదాయం అద్భుతంగా ఆవిష్కరిస్తుంది.

**గుండెను పిండేసే సెంటిమెంట్**

ఈ ఆటలో అందరినీ కన్నీరు పెట్టించిన దృశ్యం ఒకటుంది. ఒక ముసలవ్వ ఆ కప్ప తల్లిపై నీళ్లు చల్లుతూ,"తల్లీ.. నువ్వైనా ఆ దేవుడికి చెప్పు, మా బిడ్డల కడుపులు మండిపోతున్నాయి. కాస్త కరుణించమనమని వేడుకో" అంటూ చేతులు జోడించినప్పుడు అక్కడ ఉన్న ప్రతి ఒక్కరి కళ్లు చెమ్మగిల్లాయి.
ఇది కేవలం ఒక మూఢనమ్మకమో, వినోదమో కాదు. ఇది ఒక నమ్మకం, ఒక నిరీక్షణ, ఒక సమిష్టి ప్రార్థన. సైన్స్ ఎంత ఎదిగినా, మనిషి ప్రకృతి ముందు మోకరిల్లక తప్పదనే నిత్యసత్యానికి ఈ 'కప్ప తల్లి ఆట' ఒక నిదర్శనం.

**ఆశల జల్లు కురవాలి!**

ట్రెండ్స్ మారవచ్చు, లైఫ్‌స్టైల్ మారవచ్చు... కానీ భూమిని నమ్ముకున్న రైతు ఆశ మారదు. కప్ప తల్లికి పల్లె జనం సమర్పించిన ఈ కన్నీటి అర్ఘ్యం ఆ వానదేవుడిని కరిగిస్తుందని ఆశిద్దాం. త్వరలోనే ఆకాశం నీలి రంగు నుంచి నల్లటి మేఘాలతో నిండిపోయి, తడిసి ముద్దయ్యేలా వాన జల్లులు కురవాలని, ప్రతి రైతన్న ముఖంలో ఆనందం వెల్లివిరియాలని కోరుకుందాం.

**- గడ్డం సంతోష్ రాజ్**
**స్పెషల్ కరస్పాండెంట్ (విజన్ ఆంధ్ర)**

# విద్యుత్ ఆర్టిసన్‌ల సమస్యల పరిష్కారానికి 22న మహా ధర్నా

- టీజీఎస్‌పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల భారీ నిరసనకు జేపీసీ పిలుపు
- గతంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్
- పెండింగ్ సమస్యల పరిష్కారం వరకు ఉద్యమం కొనసాగుతుందని జేఏసీ స్పష్టం
- రాష్ట్ర నలుమూలల నుంచి భారీ సంఖ్యలో విద్యుత్ ఆర్టిసన్‌లు తరలిరానున్నట్లు వెల్లడి
- ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ నాగేశ్వర్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు ప్రకటన
- ఉద్యోగుల ఐక్యతతో మహా ధర్నాను విజయవంతం చేయాలని జేపీసీ నాయకుల పిలుపు

హైదరాబాద్, జూలై 20 (విజన్ ఆంధ్ర):తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (ంవాౌజుజీూజ) ఆధ్వర్యంలో విద్యుత్ ఆర్టిసన్‌ల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22వ తేదీ (బుధవారం) హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ మింట్ కంపౌండ్‌లో ఉన్న టీజీఎస్‌పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట మహా ధర్నా నిర్వహించనున్నట్లు జేఏసీ నాయకులు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యుత్ ఆర్టిసన్‌లు పెద్ద ఎత్తున ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొని తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. విద్యుత్ ఆర్టిసన్‌లకు ప్రభుత్వం, విద్యుత్ సంస్థల యాజమాన్యం గతంలో ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదని జేఏసీ నాయకులు ఆరోపించారు. పలుమార్లు అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లినా ఎలాంటి స్పష్టమైన చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మహా ధర్నాకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వేలాదిగా విద్యుత్ ఆర్టిసన్‌లు తరలిరానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉద్యోగుల హక్కులు, సంక్షేమం, సేవా భద్రత కోసం చేపడుతున్న ఈ ఉద్యమంలో ప్రతి ఉద్యోగి భాగస్వామి కావాలని కోరారు. ధర్నా కార్యక్రమానికి ప్రముఖ సామాజికవేత్త ప్రొఫెసర్ హరగోపాల్, రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ నాగేశ్వర్ ముఖ్య అతిథులుగా హాజరై ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించనున్నట్లు జేఏసీ వెల్లడించింది.




జేఏసీ నాయకుల మాటల్లో...
"విద్యుత్ ఆర్టిసన్‌ల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం ఇకపై నిర్లక్ష్యం చేయరాదు. గతంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి. ఈ నెల 22న నిర్వహించే మహా ధర్నాకు రాష్ట్రంలోని ప్రతి విద్యుత్ ఆర్టిసన్ స్వచ్ఛందంగా హాజరై ఉద్యమాన్ని విజయవంతం చేయాలి. ఉద్యోగుల ఐక్యతే మా బలం. ప్రభుత్వం సానుకూలంగా స్పందించే వరకు మా పోరాటం కొనసాగుతుంది" అని జేఏసీ నాయకులు ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రభుత్వం విద్యుత్ ఆర్టిసన్‌ల సమస్యలను అత్యవసరంగా పరిష్కరించి ఉద్యోగుల న్యాయమైన హక్కులను పరిరక్షించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేయనున్నట్లు జేఏసీ హెచ్చరించింది.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.